అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

శనివారం 27-1 -2018

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 4 సంచిక : 29 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | www.navatelangana.com | 12 + 16 పేజీలు వెల : 5.00



2లో

రాష్ట్రపతి కోవింద్ చేతుల మీదుగా శౌర్యచక్ర పతకం అందుకుంటున్న జ్యోతి కార్పోరల్ జ్యోతి ప్రకాశ్ నిరాల సతీమణి



ఘనతంత్రం

ఢిల్లీ రాజ్‌పథ్‌లో ఆడంబరంగా 69వ రిపబ్లిక్ వేడుకలు

ముఖ్య అతిథులుగా ఆసియా దేశాధినేతలు హాజరు

త్రివిధ దళాల గౌరవవందనం స్వీకరించిన రాష్ట్రపతి కోవింద్

ఆకట్టుకున్న మహిళా సైనికుల ద్విచక్రవాహన ప్రదర్శన

ప్రధానమంత్రి ప్రోటోకాల్ ఉల్లంఘన.. రాజ్‌పథ్‌లో మోడీ నడక

వివరాలు 9లో



హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో గవర్నర్ నరసింహన్...

ఎఫ్‌ఆర్‌డీఐతో సొమ్ము మాయం

- జనం డిపాజిట్లు కొల్లగొట్టేందుకే..
- బ్యాంకర్ల ఆందోళనల్లో వారినీ భాగస్వామ్యం చేయాలి : 'బెఫీ' కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శనలో బీవీ రాఘవులు



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

కేంద్రప్రభుత్వం ప్రవేశపెడుతున్న ఆర్థిక విభజన మరియు డిపాజిట్ల బీమా (ఎఫ్‌ఆర్‌డీఐ) బిల్లుతో బ్యాంకుల్లోని డిపాజిటర్ల సొమ్ముకు ఎలాంటి భద్రత ఉండదని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు అన్నారు. బ్యాంక్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (బెఫీ) ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర శాఖల సంయుక్తాధ్వర్యంలో శుక్రవారం నాడిక్కడి సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద ఎఫ్‌ఆర్‌డీఐ బిల్లును రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బివి రాఘవులు మాట్లాడుతూ ప్రపంచం మొత్తం ఆర్థిక మాంద్యంతో విలవిల్లాడినా భారతదేశంపై ఆ ప్రభావం పడకపోవడానికి ఇక్కడి ప్రభుత్వరంగ బ్యాంకింగ్ వ్యవస్థే కారణమని, అలాంటి రంగాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రయివేటు, విదేశీ కార్పొరేట్ పెట్టుబడిదారులకు అనుకూలంగా ఎఫ్‌ఆర్‌డీఐ బిల్లును రూపొందించి, అమల్లోకి తేవాలని ప్రయత్నిస్తున్నారని చెప్పారు. పార్లమెంటరీ సెలెక్ట్ కమిటీకి పంపి అక్కడి నుంచి చట్టసభల్లో దీన్ని ఆమోదం పొందాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఈ సమస్య ...9లో



మూడేండ్లు.. మూడు ముఖ్య ఘట్టాలు

మహాజన పాదయాత్ర, టీ మాస్, బీఎల్ఎఫ్... సీపీఐ (ఎం) చరిత్రలో మైలురాళ్లు

వివరాలు 10లో

వికేంద్రీకృత ఎమర్జెన్సీ

- మోడీ పాలనలో ఇంతటి నిస్సహాయతను అత్యవసర పరిస్థితిలోనూ చూడలేదు
- ప్రజా ప్రతినిధుల్లో నాణ్యత లోపించింది
- చట్టసభలకు కఠిన అర్హతలను నిర్దేశించాలి: కేంద్ర మాజీమంత్రి అరుణ్‌శౌరీ



కోల్‌కతా: దేశంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితి వికేంద్రీకృత అత్యవసరస్థితి(ఎమర్జెన్సీ)ని తలపిస్తున్నదని సీనియర్ జర్నలిస్ట్, కేంద్ర మాజీమంత్రి అరుణ్‌శౌరీ అన్నారు. భయం, నిస్సహాయ వాతావరణం నెలకొన్నదని ఆయన అన్నారు. తక్షణం కేంద్రీకృత ఎమర్జెన్సీ లేనప్పటికీ వికేంద్రీకృత ఎమర్జెన్సీని తలపిస్తోందని అరుణ్‌శౌరీ ఆందోళన వ్యక్తం చేశారు. అయితే, రాజకీయంగా ఇటువంటి నిస్సహాయతను ఎమర్జెన్సీ సమయంలోనూ తాను చూడలేదని ఆయన అన్నారు. శుక్రవారం కోల్‌కతాలోని టాటా స్టీల్‌లో ఏర్పాటు చేసిన లిటరరీ మీట్‌లో ఆయన ప్రసంగించారు. మోడీ, ఆయన అనుచరుల వల్ల దేశానికి నైతిక ప్రమాదమున్నదని తాను గతంలోనే చెప్పానని శౌరీ గుర్తు చేశారు. ఈ పరిస్థితికి వ్యతిరేకంగా పోరాడాల్సిన శక్తులు విభజితమయ్యాయని ఆయన అన్నారు. గత 30-40 ఏండ్లుగా ప్రజా జీవితంలోకి వచ్చేవారిలో నాణ్యత లోపించిందని ఆయన అన్నారు. అదే ఇప్పుడు దేశంలో ప్రధాన సమస్య అని ఆయన ...9లో

దళితవాడకు వెళ్లకుండా హెచ్‌ఎంకు బెదిరింపులు

- జెండావిష్కరణకు అడ్డంకులు సృష్టించిన పెత్తందార్లు
- రేకులపల్లిలో మరోసారి బయటపడిన వివక్ష
- పోలీసుస్టేషన్ వద్ద ధర్నా

9లో



(ఫైల్)

ఆకాశంలో మరో అద్భుతం

- 31న సూపర్ బ్లూమూన్ సందడి

వివరాలు 2లో

రాజ్యాంగం పరిరక్షిద్దాం

బీజేపీని ఎదుర్కొనేందుకు పక్కా వ్యూహం

- 29న భావసారూప్యత కలిగిన అన్ని పార్టీల భేటీ : శరద్ పవార్
- ముంబయిలో 'రాజ్యాంగ పరిరక్షణ' మార్చ్



ముంబయి : మోడీ పాలనలో రాజ్యాంగం, ప్రజాస్వామ్యం పెనుప్రమాదంలో నెట్టవేయబడుతోందని రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీలో వక్తలు నినదించారు. బీజేపీని ఎదుర్కొనే మార్గాలను చర్చించేందుకు సమిష్టిగా ఏకమవ్వాల్సిన సమయం ఆసన్నమైందని గళమెత్తారు. భావసారూప్యతగల పార్టీలు దేశ రాజధాని ఢిల్లీలో 29న సమావేశం కానున్నట్టు ఎన్సీపీ నేత శరద్ పవార్ ప్రకటించారు. ముంబయిలో వివిధ ప్రతిపక్ష పార్టీలు నిర్వహించిన 'రాజ్యాంగ పరిరక్షణ' ర్యాలీ శుక్రవారం విజయంతమైంది. ముంబయి సెక్రెటేరియట్‌కు సమీపంలోని ఓవల్ మైదాన్ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ దక్షిణ ముంబయిలోని గేట్ వే ఆఫ్ ఇండియా వద్ద ముగిసింది. దాదాపు రెండు కిలోమీటర్ల మేర సాగిన ఈ ర్యాలీలో శరద్ యాదవ్ (తిరుగుబాటు జేడీయూ నాయకుడు), డి రాజా (సీపీఐ), హార్థిక్ పటేల్ (గుజరాత్ పటిదార్ ఉద్యమ నాయకుడు) తదితరులు పాల్గొన్నారు. ఎన్సీపీ నేత ప్రఫుల్ పటేల్, మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ నేత పృథ్వీరాజ్ చౌహాన్, మాజీ ఎంపీ రామ్ జెత్మలానీ తదితరులు కూడా ఈ మార్చ్‌లో పాలుపంచుకున్నారు.. బీజేపీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు.. ఐక్య పోరాటాలు నిర్మించాల్సిన అవసరమున్నదని వక్తలు నొక్కి చెప్పారు. ఈ పోరాటనికి దిశా, దశా నిర్దేశించుకునేందుకు ...9లో

నీట్‌కు ఒకే ప్రశ్నాపత్రం

- ఈ ఏడాది నుంచి అమలు

న్యూఢిల్లీ: ఈ విద్యా సంవత్సరం నుంచి దేశమంతా ఒకే ప్రశ్నాపత్రంతో నీట్ పరీక్షను నిర్వహించనున్నట్టు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్ఈ) స్పష్టం చేసింది. ఈ మేరకు సీబీఎస్ఈ తీసుకున్న తాజా నిర్ణయాన్ని భారత సర్వోన్నత న్యాయ స్థానానికి గురువారం నివేదించింది. మెడికల్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్(నీట్) నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఇంగ్లీషు, హిందీ సహా పది భాషల్లో నీట్ రాసేందుకు ఇదివరకే అనుమతిచ్చారు. కానీ, భాషల వారీగా సీబీఎస్ఈ ప్రశ్నాపత్రం రూపొందించడంపై అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. గతేడాది నిర్వహించిన నీట్‌లో ఇంగ్లీషులో కంటే ప్రాంతీయ భాషల్లోని ప్రశ్నాపత్రాల్లో ప్రశ్నలు కఠినంగా ఉన్నాయంటూ ఫిర్యాదులొచ్చాయి. ఈ నేపథ్యంలో నీట్‌కు ఉమ్మడి ప్రశ్నాపత్రం ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ 'సంకల్ప్' అనే చారిటబుల్ ట్రస్టు.. సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై గతేడాది ఆగస్టులో విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు ...9లో

సర్వశిక్షా అభియాన్ (ఎస్ఎస్ఏ)లో కాంట్రాక్టు ఉద్యోగులకు వేతన తిప్పలు తప్పడంలేదు. సకాలంలో వేతనాలు అందించే ఉద్దేశ్యంతో విద్యాశాఖ తీసుకొచ్చిన 'పేరోల్' విధానం కొందరు ఉద్యోగులకు అమలు కావడం లేదు. అదే సంస్థలో పనిచేస్తున్న తోటి ఉద్యోగులు ప్రతి నెలా వేతనాలు వస్తున్నా...జిల్లా ప్రాజెక్టు ఆఫీసుల్లో(డీపీఓ) పనిచేసే కాంట్రాక్టు ఎంప్లాయిస్‌కు మాత్రం ఒక్కోసారి నెలల తరబడి పెండింగ్‌లో ఉంటున్నాయి. దీంతో వారంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పేరోల్ లేక పరేషాన్



ఎస్ఎస్ఏ డీపీఓ కాంట్రాక్టు ఉద్యోగులకు వేతన కష్టాలు



(ఫైల్)

- పేరోల్ పరిధిలోకి తీసుకురాని విద్యాశాఖ
- సకాలంలో జీతాలందక ఇబ్బందులు

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

తెలంగాణలో ఎస్ఎస్ఏ పరిధిలో 31 జిల్లాల్లో సుమారు 20వేల మంది కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులున్నారు. వీరికి గతంలో సకాలంలో వేతనాలు అందకపోయేవి. వేతనాల కోసం అనేక సార్లు ధర్నాలు చేశారు. వీటన్నింటికీ చెక్‌పెట్టేందుకు గానూ విద్యాశాఖ ప్రత్యేకంగా 'పేరోల్' అనే ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను రూపొందించింది. ఆరునెలలుగా ఎస్ఎస్ఏ పరిధిలో పనిచేసే ఉద్యోగులను ఏ,బీ,సీ,డీ,ఈ విభాగాలుగా విభజించి వేతనాలు అందిస్తున్నారు. వీటిలో 'బీ' కేటగిరి ఉద్యోగులను మాత్రం 'పేరోల్'కు అనుసంధానం చేయలేదు. జిల్లా ప్రాజెక్టు కార్యాలయంలో పనిచేసే ఏపీఓలు, సెక్టోరల్ ఆఫీసర్లు, ఆపరేటర్లు, అటెండర్లు, సిస్టమ్ ఎనాలిసిస్ట్‌లు, అకౌంటెంట్లు దీని పరిధిలోకి ...9లో

ఈజిప్టు పర్యాటకానికి ప్రచారకర్తలు!

కైరో : ఈ ఫొటోలో కనిపిస్తున్న ఇద్దరూ గిన్నీస్ రికార్డులో చోటు సంపాదించుకున్నవారే. 8 అడుగుల 1 అంగుళం (246.5 సెం.మీ) ఎత్తుతో టర్కీ దేశస్తుడు సుల్తాన్ కోసెన్ (34) అత్యంత పొడగరిగా, 2 అడుగుల (62.8 సెం.మీ) ఎత్తుతో భారతీయురాలు జ్యోతీ ఆమ్గే అత్యంత పొట్టి వ్యక్తిగా ప్రపంచ గుర్తింపు పొందారు. వీరిద్దర్నీ తమ దేశ పర్యాటక ప్రచారం కోసం ఈజిప్టు టూరిజం బోర్డు కైరోకు ఆహ్వానించింది. ఈ సందర్భంగా శుక్రవారంనాడు గీజా పిరమిడ్ ముందు దిగిన ఫొటో ఇది.



రాష్ట్రపతి కంటతడి

- అమరవీరుని కుటుంబసభ్యులకు

'అశోక్‌చక్ర' అందజేస్తూ ఉద్వేగానికి లోనైన కోవింద్



న్యూఢిల్లీ : రిపబ్లిక్ డే ఉత్సవాల్లో భాగంగా సైనిక సాహస అవార్డు లు అందజేసే సందర్భం గా రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఉద్వేగానికి గురయ్యారు. ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ గార్డు కమెండో కార్పొరల్ జ్యోతి ప్రకాశ్ నిరాలకు మరణాంతరం ప్రకటించిన అశోక్ చక్ర అవార్డును ఆయన కుటుంబసభ్యులకు అందచేసే సమయంలో రాష్ట్రపతి కంటతడి పెట్టారు. కళ్లను తన హ్యాండ్ కర్చిఫ్‌తో తుడుచుకున్నారు. భారత వాయుదళానికి చెందిన ప్రత్యేక దళంలో కార్పొరల్ నిరాల సభ్యుడు. ఈ దళాన్ని రాష్ట్రీయ రైఫిల్స్ బెటాలియన్ నిర్వహిస్తున్న 'ఆపరేషన్ రక్షక్'కు జతచేశారు. నవంబర్ 18న జమ్మూకాశ్మీర్‌లోని బందిపోరా గ్రామంలో ఉగ్రవాదులు ఉన్నారనే నిఘా వర్గాల సమాచారంతో నిరాల బృందం అక్కడకు వెళ్లింది. ఉగ్రవాదులు ఉన్న భవనం వద్దకు చేరుకోగానే వారు కాల్పులకు దిగారు. భద్రతా దళాలు కూడా ఎదురుకాల్పులు జరిపాయి. ఈ కాల్పుల్లో నిరాలకు తీవ్రగాయాలయ్యాయి. అయినా అతను లెక్కచేయకుండా ముగ్గురు ఉగ్రవాదులను హతమార్చాడు. చివరికి తానూ మృతి చెందాడు. ఈ సంఘటనలో మొత్తం ఆరుగురు ఉగ్రవాదులు హతమయ్యారు. వీరిలో లష్కర్‌ఈతోయిబా చీఫ్ మేనల్లుడు, 26/11 ముంబాయి బాంబు పేలుళ్ల సూత్రధారి జకి యుర్ రెహ్మాన్ లక్వీ కూడా వున్నాడు.

ప్రభుత్వ నిబంధనలను లెక్కచేయని ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్

- ప్రయివేటు స్కూల్‌లో జెండా ఆవిష్కరణ



పాలక్కడ్: ప్రభుత్వ నిబంధనలను లెక్క చేయకుండా సంఘ్ విద్యా విభాగం నిర్వహిస్తున్న పాఠశాలలో 69వ గణతంత్ర దినోత్సవాల్లో ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్ జాతీయ జెండాను ఎగురవేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విద్యాసంస్థల్లో గణతంత్ర దినోత్సవాల్లో ఆ సంస్థల ప్రధానోపాధ్యాయుడు లేదా ప్రిన్సిపాల్ మాత్రమే జెండాను ఎగురవేయాలని రాష్ట్ర ప్రభుత్వం జనవరి 17న ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే ఈ ఉత్తర్వులను ఉల్లంఘిస్తూ ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ కేరళలో పాలక్కడ్‌లోని సీబీఎస్‌ఈ గుర్తింపు పొందిన.. సంఘ్ నిర్వహిస్తున్న వ్యాస విద్యా పీఠం ఉన్నత పాఠశాలలో శుక్రవారం త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం సీబీఎస్‌ఈ గుర్తింపు పొందిన పాఠశాలలు రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉండవని, గణతంత్ర దినోత్సవాన జెండా ఎగురవేయడం ప్రతిపౌరుని హక్కు అని ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు సమర్థించుకున్నారు. గతేడాది స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా ప్రభుత్వ నిధులతో నడిచే కర్ణికియమ్మన్ ఉన్నత పాఠశాలలో ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్ త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించడం పై రాష్ట్రవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తాయి. తాజాగా మరోసారి మోహన్ భగవత్ సర్కారు నిబంధనలను బేఖాతరు చేశారు.

పాక్ సైన్యంతో మిఠాయిలు పంచుకోవడానికి విముఖత

- సరిహద్దులో ఉద్రిక్తల నేపథ్యంలోనే : బీఎస్‌ఎఫ్

శ్రీనగర్: గణతంత్ర దినోత్సవం సందర్భంగా పాక్ సైనికులతో మిఠాయిలు పంచుకోవడం, శుభాకాంక్షలు తెలుపుకోవడాన్ని సరిహద్దు రక్షణ సిబ్బంది(బీఎస్‌ఎఫ్) శుక్రవారం తిరస్కరించింది. ఇరు దేశాల అంతర్జాతీయ సరిహద్దు, జమ్మూకాశ్మీర్‌లోని ఎల్‌వోసీ(లైన్ ఆఫ్ కంట్రోల్) గుండా పాక్ కాల్పుల విరమణను పదేపదే ఉల్లంఘిస్తూ గతకొంత కాలంగా భారత పౌరులను, సైన్యాన్ని పొట్టన పెట్టుకుంటున్నది. దీంతో సరిహద్దు వద్ద తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఈ విషయాన్ని వారికి తెలియజేసేందుకే గణతంత్రదినోత్సవం సందర్భంగా మిఠాయిలను పంచుకోలేదని బీఎస్‌ఎఫ్ అధికార వర్గాలు తెలిపాయి. రెండు దేశాల్లోని ప్రధాన పండుగలైన దీపావళి, రంజాన్, ఇరు దేశాల స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవం సందర్భంగా మిఠాయిలు పంచుకోవడం ఆనవాయితీగా వస్తోంది. అయితే నాలుగైదు ఏండ్ల నుంచి సరిహద్దు బలగాలు ఈ ఆనవాయితీని పాటించడంలేదు. మిఠాయిలు పంచుకొనే ఆనవాయితీ తిరిగి కొనసాగాలని బీఎస్‌ఎఫ్ డీజీ కెకె శర్మ ఆశాభావం వ్యక్తం చేశారు.

గణతంత్ర వేడుకల్లో తుపాకీతో కాల్చుకొని..

- పంజాబ్‌లో కానిస్టేబుల్ ఆత్మహత్య

చండీగఢ్: గణతంత్ర వేడుకల వద్ద విధుల్లో ఉన్న కానిస్టేబుల్ తుపాకీతో కాల్చుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషాద ఘటన పంజాబ్‌లోని లుథియానా లో చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లుథియానాకు చెందిన కానిస్టేబుల్ మంజిత్‌సింగ్.. జాగ్రాన్ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ ఇంద్రజిత్ సింగ్‌కు గన్‌మెన్‌గా డిప్యూటేషన్‌పై వెళ్లాడు. కాగా.. జాగ్రాన్‌లోని ఓ ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం జరిగిన గణతంత్ర వేడుకలకు ఎస్‌హెచ్‌ఓ హాజరవగా, ఆయన వెంట మంజిత్ కూడా వెళ్లాడు. ఇదిలాఉంటే వేడుకలు జరుగుతుండగానే.. మంజిత్ తన ఏకే47 తుపాకీతో కాల్చుకున్నాడు. అతడిని హుటాహుటిన ఆస్పత్రికి తరలించినా ఫలితం లేకపోయింది. మంజిత్ అప్పటికే చనిపోయినట్టు డాక్టర్లు నిర్ధారించారు. మంజిత్ ఆత్మహత్యకు పై అధికారుల వేధింపులే కారణమా? మరేదైనా అన్నది తెలియాల్సి ఉన్నది.

గణతంత్ర దినోత్సవ ర్యాలీలో...

వీహెచ్‌పీ, ఏబీవీపీ వర్గాల మధ్య ఘర్షణ

- ఒకరి మృతి, పలువురికి గాయాలు

కాసగంజ్ (లక్నో): గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ర్యాలీలో ఇరువర్గాల మధ్య చోటు చేసుకున్న అల్లర్లలో ఒకరు మృతి చెందగా పలువురికి గాయాలయ్యాయి. ఈ ఘటన ఉత్తర ప్రదేశ్‌లోని కాసగంజ్ ప్రాంతంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గణతంత్ర దినోత్సవం సందర్భంగా ర్యాలీ తీస్తున్న విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) సభ్యులు, అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) సభ్యుల మధ్య వివాదం తలెత్తింది. ఇరు వర్గాల సభ్యులు పరస్పరం దూషించుకుంటూ, రాళ్లు విసురుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఈ ఘటనలో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలవ్వడంతో ఆస్పత్రికి తర లించగా పరిస్థితి విషమించి మరణించాడు. పలువురు గాయాలపాల య్యారు. పోలీసులు ఇరు వర్గాలను చెదరగొట్టి ప్రాంతాన్ని అదుపులోకి తీసుకున్నారు.

ఆకాశంలో మరో అద్భుతం

- 31న సూపర్ బ్లూమూన్ సందడి..

న్యూఢిల్లీ : ఆకాశంలో అద్భుతాన్ని చూసే అవకాశం అతి త్వరలోనే రాబోతున్నది. ఈనెల 31న సూపర్ బ్లూ మూన్ కనువిందు చేయనున్నట్టు అమెరికాలోని నేషనల్ ఏరోనాటిక్స్ అండ్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్ (నాసా) వెల్లడించింది. ఈనెల 1న, గతనెల 3న సూపర్ మూన్ దర్శనమిచ్చిన సంగతి తెలిసిందే. కాగా.. ఈసారి సూపర్ మూన్‌లో మూడు ప్రత్యేకతలు ఉండనున్నందున ప్రాధాన్యతను సంతరించుకోనున్నదని నాసా తెలిపింది. సూపర్ మూన్ సిరీస్‌లో ఇది మూడోది కావడంతో పాటు చంద్రుడు భూ కక్ష్యకు దగ్గరగా రానుండటంతో సాధారణం కంటే 14 శాతం ఎక్కువ కాంతివంతంగా కనిపించనున్నాడు. అంతేకాక, ఒకే నెలలో నెలలో రెండోసారి నిండు చంద్రుడు కనిపించనున్నాడు. ఈనెల 1న చంద్రుడు పూర్తిగా కనిపించాడు. ఒకేనెలలో చంద్రుడు రెండుసార్లు పూర్తిగా కనిపించడం రెండున్నరేండ్లకోసారి జరుగుతుంది. 31న 70 నిమిషాలకు పైగా చంద్రగ్రహణం ఏర్పడునున్నది. చంద్రుడు.. భూకక్ష్య గుండా ప్రయాణిస్తున్న సమయంలో ఎరుపు రంగులో కనువిందు(బ్లడ్ మూన్) కనువిందు చేయనున్నట్టు నాసా హెడ్‌క్వార్టర్ ప్రోగ్రామ్ ఎగ్జిక్యూటివ్ జోర్డాన్ జాన్‌స్టన్ వెల్లడించారు.



ఢిల్లీలో గణతంత్ర వేడుకల్లో త్రిపుర శకటం



పెరేడ్‌లో మహిళా సైనికుల విన్యాసాలు



మైనస్ 30 డిగ్రీల ఉష్ణోగ్రతలో భారత్-టిబెట్ సరిహద్దులోని మంచుకొండలో జాతీయ పతాకాన్ని రెపరెపలాడించిన ఐటీబీపీ (ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్) జవాన్లు.

రిజర్వేషన్లు లేకుంటే..

దళితుల పరిస్థితి ముస్లింలకన్నా అధ్వాన్నంగా ఉండేది

- అంబేద్కర్‌పై పరిశోధకుడు, ఫ్రెంచ్ రాజకీయ శాస్త్రవేత్త క్రిస్టోఫే జాఫ్రేలాట్




జైపూర్: రిజర్వేషన్లు లేకపోతే దళితులకు ఏ అవకాశాలూ దక్కవని ప్రముఖ ఫ్రెంచ్ రాజకీయ శాస్త్రవేత్త క్రిస్టోఫే జాఫ్రేలాట్ అన్నారు. ఆ లెక్కన ముస్లింలకన్నా దళితులకే ఎక్కువ నష్టమని ఆయన స్పష్టం చేశారు. రాజస్థాన్‌లోని జైపూర్‌లో జరుగుతున్న 11వ సాహిత్య ఉత్సవంలో 'డా॥అంబేద్కర్, ఆయన వారసత్వం' అనే అంశంపై జాఫ్రేలాట్ ప్రసంగించారు. బీజేపీ,ఆర్‌ఎస్‌ఎస్ కూడా ఇప్పుడు దళితుల పైనా, అంబేద్కర్‌పైనా దృష్టి సారించాయని ఆయన అన్నారు. దళితుల ఓటుబ్యాంక్‌ను విస్మరించలేని పరిస్థితిని వారు గుర్తించారని, అంతేతప్ప దళితులపట్ల ఆ సంస్థలకు మంచి సంకల్పం లేదని ఆయన అన్నారు. రిజర్వేషన్లు లేకపోతే దళితుల పరిస్థితి ఏమవుతుంది..? ఓవేళ రిజర్వేషన్లు తొలగిస్తే వారు ఎక్కడ ఉండేవారు..? వారికి ఎక్కడా అవకాశాలుండేవి కాదని ఆయన అన్నారు. రిజర్వేషన్లు లేకుంటే ముస్లింలకన్నా అధ్వాన్న పరిస్థితిలో ఉండేవారని జాఫ్రేలాట్ అన్నారు. 'డా॥అంబేద్కర్ అండ్ అన్‌టచేబిలిటీ' అనే పుస్తకాన్ని జాఫ్రేలాట్ రచించారు.

1989లో ఉత్తర్‌ప్రదేశ్ ఎన్నికల్లో బీజేపీకన్నా జనతాదళ్ మంచి ఫలితాలు సాధించిందని జాఫ్రేలాట్ గుర్తు చేశారు. ఓటు బ్యాంక్ రాజకీయాలు, విభజించి పాలించు సూత్రాలను భారత్‌లోని రాజకీయ పార్టీలు అనుసరిస్తున్నాయని ఆయన విశ్లేషించారు. ప్రపంచంతో పోలిస్తే భారత్‌లో మంచి చట్టాలున్నాయని.. అయితే, అంబేద్కర్ కలలు నిజం కావాలంటే వాటిని సక్రమంగా అమలు చేయాలని ఆయన సూచించారు. విద్యా హక్కు, సమాచార హక్కు భారత రాజ్యాంగంలో ఉన్నాయి. కానీ, అవి ఏమేరకు అమలవుతున్నాయని జాఫ్రేలాట్ ప్రశ్నించారు. ఈ సాహిత్య సదస్సుకు హాజరైన ఆర్థికవేత్త సుఖ్‌దేవ్ థొరాట్, న్యాయ నిపుణుడు,రచయిత చింతన్ చంద్రచూడ్(సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్ కుమారుడు), బెంగాలీ రచయిత మనోరంజన్ బ్యాపరీ.. దళితులకు రిజర్వేషన్ల అవసరాన్ని, అంబేద్కర్ వారసత్వాన్ని గురించి తమ ప్రసంగాల్లో ప్రస్తావించారు.

త్రిపురలో లెఫ్ట్ ఫ్రంట్ ప్రభుత్వం అనివార్యం

- సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు తపన్‌సేన్




ఆగర్తల : త్రిపురలో మరోసారి లెఫ్ట్ ఫ్రంట్ ప్రభుత్వం ఏర్పడటం అనివార్యంగా కనిపిస్తోందని, ఫిబ్రవరి 18న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో రాజకీయ స్పృహ, పరిణితి కలిగిన ప్రజలు లెఫ్ట్ ప్రభుత్వాన్ని 8వ సారి ఎన్నుకోవడంతో పాటు అధికారం కోసం అనుచిత చర్యలకు దిగుతున్న బీజేపీకి తగిన గుణపాఠం చెప్పాల్సిన అవసరం ఉందని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు, సీఐటీయూ ప్రధాన కార్యదర్శి తపన్ సేన్ పేర్కొన్నారు. బీజేపీ విభజన, వేర్పాటువాద కుట్రల నుంచి రాష్ట్ర ప్రజలను కాపాడవలసి ఉంది. ప్రజల మధ్య మత విద్వేషాలను రెచ్చగొట్టడానికి కమలం పార్టీ ప్రయత్నిస్తోందని, ఈ విష సర్పం కోరలను పీకివేసి, దేశానికి విలువైన ప్రత్యామ్నాయాన్ని చూపుతారని అంబస్స వద్ద జరిగిన ఎన్నిక ప్రచార సభలో తపస్ సేన్ విశ్వాసం వ్యక్తం చేశారు. సుమ్రా, మతబారి వద్ద జరిగిన సభల్లోనూ తపన్‌సేన్ ఇదే తరహా వ్యాఖ్యలు చేశారు.

త్రిపురలో శాంతి, ఐక్యత వాటంతట అవే నెలకొనలేదని, వామపక్ష శక్తుల అవిశ్రాంత కృషి ద్వారా ప్రతిష్ఠించబడ్డాయని తపన్‌సేన్ పేర్కొన్నారు. 'అయితే బీజేపీ ఇప్పుడు వేర్పాటువాదులతో చేతులు కలిపి రాష్ట్రంలో శాంతి, ఐకమత్యాలను దెబ్బతీయాలని ప్రయత్నిస్తోంది. మత విద్వేషాలను రెచ్చగొట్టాలని చూస్తోంది. రాష్ట్ర ప్రజలు రాజకీయ పరిపక్వతతో వ్యవహరించి ఈ కుట్రలను ఖచ్చితంగా తిప్పికొడతారని భావిస్తున్నాను' అని తపన్‌సేన్ వ్యాఖ్యానించారు. అలాగే కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కొద్ది మంది ధనవంతులకు కొమ్ముకాసి, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందని తెలిపారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల అనంతరం ఈ పెట్టుబడిదారుల, కార్పొరేట్ శక్తుల ప్రభుత్వం అంతర్ధానం కావాలని, రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో లెఫ్ట్ ఫ్రంట్‌ను గెలిపించి అందుకు నాంది పలకాలని తపన్‌సేన్ ప్రజలకు పిలుపు ఇచ్చారు. కులాయి వద్ద జరిగిన సభలో తపన్‌సేన్‌తో పాటు సీపీఐ(ఎం) ధలాయి జిల్లా కార్యదర్శి పంకజ్‌చక్రవర్తి, సుమ్రా, అంబస్సా అభ్యర్థులు అంజన్ దాస్, భరత్ రీయాంగ్, స్థానిక కమిటీ కార్యదర్శి ససాంక చక్రవర్తి, తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ కుట్రే..

'పద్మావత్' నిరసనలపై ప్రఖ్యాత దర్శకుడు శ్యామ్ బెనెగల్

- 'రాజ్‌పుత్' ఓట్‌బ్యాంక్ కోసం ఇదంతా చేస్తున్నారు..!
- 1988లో నేను సీరియల్‌గా తీస్తే ఎలాంటి వ్యతిరేకత రాలేదు
- నేడు భన్సాలీ తీస్తే ఎందుకు వస్తున్నాయి?



సంజయ్ లీలా భన్సాలీ తీసిన 'పద్మావత్', 1988లో నేను సీరియల్‌గా తీసిన "భారత్ ఏక్ ఖోజ్' రెండూ దాదాపు ఒకటే. మరి ఆనాడు వ్యక్తంకాని నిరసనలు, ఈనాడు ఎందుకు ఇంతపెద్ద స్థాయిలో వస్తున్నాయో అర్థం కావటం లేదు. 'పద్మావత్'ను అడ్డుకునే శక్తుల వెనుకున్నవారికి రాజకీయ ప్రయోజనముంది. 'రాజ్‌పుత్' ఓటుబ్యాంక్ కోసం..రాజకీయ కుట్రలకు పాల్పడుతున్నారన్నది నా పరిశీలన..అని ప్రముఖ దర్శకుడు శ్యామ్‌బెనెగల్ తాజా ఇంటర్వ్యూలో చెప్పారు. సినిమా పేరు చెప్పి, రాజకీయ ప్రయోజనాల కోసం.. దేశవ్యాప్తంగా హింసరేపాలన్న కుట్ర దాగివుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇంకా ఆయన ఏమన్నారంటే...

- మీరు ఒక విషయాన్ని ఇక్కడ అర్థం చేసుకోవాలి. ఇది సహనం, అసహనానికి సంబంధించిన విషయం కాదు. దానికి మించి ఇంకా ఏదో ఉంది. 1988లో 'భారత్ ఏక్ ఖోజ్' 56 ఎపిసోడ్స్‌తో సీరియల్‌గా తీశాను. దూరదర్శన్ ద్వారా దేశవ్యాప్తంగా ప్రసారమైంది. ఇందులో ఓంపురి అల్లావుద్దీన్ ఖిల్జీ పాత్ర పోషించారు. ఇప్పుడు సంజయ్‌లీలా భన్సాలీ తీసింది కూడా ఇదే కథ. నేను తీసిననాడు ఎలాంటి నిరసనలూ రాలేదు. అంటే ఇప్పుడు వ్యక్తమవుతున్న అభ్యంతరం, చోటు చేసుకుంటున్న ఘటనలు 'పద్మావత్' కథాంశం గురించి కాదన్నమాట.
- దీనివెనుక రాజకీయంగా పెద్ద కుట్రే దాగివుందని నాకనిపిస్తోంది. 'రాజ్‌పుత్' ఓటుబ్యాంక్‌ను కొల్లగొట్టడానికే ఇదంతా చేస్తున్నారు. స్కూల్ పిల్లలు ఉన్న ఓ వాహనంపై దాడి చేస్తారా ? ఈ పని చేయటం ద్వారా దేశవ్యాప్తంగా ఉద్రిక్తతలను తీసుకురావాలన్నది నిరసనకారుల ఉద్దేశం. దాడికి పాల్పడ్డవారిని ఇంకా ఎందుకు అరెస్టు చేయలేదు?
- మాలిక్ మొహమ్మద్ జయసీ రాసిన సూఫీ కవిత ఆధారంగా 'పద్మావత్' తెరకెక్కిందనుకుంటే, నేను తీసిన 'భారత్ ఏక్ ఖోజ్' సీరియల్‌లోని కొన్ని ఎపిసోడ్స్‌కు జయసీ రాసిన కవితే స్ఫూర్తి.
- విచిత్రమైన విషయం ఏంటంటే...నేను తీసిన 'భారత్ ఏక్ ఖోజ్'కు సంజయ్ లీలా భన్సాలీ అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేశాడు. ఆయన చెల్లెలు బెలా సెహెగల్, సోదరుడు దీపక్ సెహెగల్ కూడా ఎడిటర్స్‌గా పనిచేశారు.
- భన్సాలీ సినిమాను అడ్డుకుంటామని పెద్ద సంఖ్యలో మహిళలు కత్తులు పట్టుకొని మీడియా ముందుకు వచ్చి 'అగ్నిప్రవేశం' చేస్తామని బెదిరించారు. టీఆర్‌పీ రేటింగ్స్ కోసం కొన్ని మీడియా ఛానల్స్ దీనికి ప్రాధాన్యతనిచ్చాయి.
- చట్టవ్యతిరేకమైన ఇలాంటి హింసాత్మక ధోరణిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నోరుమెదపకుండా ఉండటం దారుణం. దీనిని ఒక దేశవ్యాప్త ఆందోళనగా మార్చాలన్నదే కర్ణి సేన, ఇతర గ్రూపుల లక్ష్యం. వీరి వెనుక ఎవరున్నారన్న సంగతి పోలీసులకు తెలుసు. అంత బహిరంగంగా 'పద్మావత్' చిత్ర దర్శకునికి, ఇతర నటులకు వారు బెదిరింపులు చేస్తే పట్టించుకోరా ?
- భన్సాలీ తీసిన 'పద్మావత్' చిత్రాన్ని బెంగాలీలెవరూ చీదరించుకోవటం లేదు. అయితే ఈ చిత్రం విషయంలో జరుగుతున్నది మామూలు నిరసన కాదన్నది నా పరిశీలన. ఇది సాధారణమైన నిరసన వ్యవహారం కాదు. దీనికి మించి ఏదో ఉంది.

భన్సాలీ తల నరికి తెస్తే..

రూ. 51 లక్షలు

- ప్రకటించిన రాజ్‌పుత్ చీఫ్



న్యూఢిల్లీ : సంజయ్ లీలా భన్సాలి 'పద్మావత్' ఎట్టకేలకు థియేటర్లలో దుమ్మురేపుతోంది. దీంతో ఆ చిత్ర నటీనటులు ఊపిరి పీల్చుకుంటుంటే.. ప్రేక్షకులు సైతం సినిమాను వీక్షించేందుకు పెద్ద సంఖ్యలో థియేటర్లకు క్యూ కడుతున్నారు. మధ్యప్రదేశ్, గుజరాత్ వంటి పెద్ద రాష్ట్రాల్లో సినిమా విడుదల నిలిపివేసినప్పటికీ, విడుదలైన తొలి రోజు అంచనాలకు మించి రూ. 18 కోట్ల వసూలు చేసినట్టు తెలుస్తోంది. కానీ, ఇదంతా సంజయ్ లీలా భన్సాలీకి ఉపశమనాన్ని చేకూర్చిందనుకుంటే.. పొరపాటే. చిత్రనిర్మాత తలకు మరోసారి డిమాండ్ వచ్చింది. సంజయ్‌లీలా భన్సాలీ తల నరికిన వారికి రూ. 51 లక్షల ఇస్తామంటూ కర్ణిసేన మరోసారి బహుమానం ప్రకటించింది. 'సంజయ్ లీలా భన్సాలీ తల నరికి తెచ్చిన వారికి వెంటనే రూ. 51 లక్షలు చెల్లిస్తాం' అని ఆల్ ఇండియా భ్రజ్మండల్ క్షత్రియ రాజపుత్ర మహాసభ ఉపాధ్యక్షులు దివాకర్ సింగ్ ప్రకటించారు. 'మా ఆందోళనకు మద్దతివ్వనివారికీ, సినిమా విడుదలపై మౌనంగా ఉన్న రాజకీయ నాయకులకు ఒక గుణపాఠం నేర్పించాలనుకుంటున్నాం' అని దివాకర్ సింగ్ అన్నారు.

'గుర్‌గ్రాం స్కూల్ బస్సుపై దాడి కుట్ర'

గురుగ్రామ్‌లో స్కూల్ బస్సుపై దాడి కుట్ర అని రాజ్‌పుత్ర నేత ఆరోపించారు. బస్సుపై దాడిలో తమ పాత్ర ఏమీ లేదనీ చెబుతూ.. పద్మావత్ సినిమా నిర్మాత బన్సాలీ, ఆయన బృందమే ఈ దుశ్చర్యకు పాల్పడిందని శ్రీ రాజ్‌పుత్ కర్ణిసేన అధినేత లోకేంద్ర సింగ్ కల్వీ ఆరోపించారు.

'తప్పుడు ఆరో పణలు చేయడం ద్వారా మా ప్రతిష్ఠను దెబ్బతీస్తున్నారు. ఈ ఘటనకు సంబం ధించి ఎలాంటి దర్యాప్తునైనా ఎదుర్కొనేందుకు మేం సిద్ధంగా ఉన్నాం' అన్నారు. సినిమాను నిషేధించేవరకూ తమ ఆందోళన కొనసాగుతుందని అన్నారు.

కరువు ప్రాంతాలపై కేంద్రం దృష్టి సారిస్తుందా..?

30 ఏండ్ల క్రితం చేపట్టిన లెండి ప్రాజెక్ట్‌పై..

- రెండు రాష్ట్రాల రైతుల ఎదురుచూపులు
- అరుణ్‌జైట్లీ బడ్జెట్ ప్రసంగంపై ఆశలు

నవతెలంగాణ డెస్క్

1987లో చేపట్టిన లెండి ప్రాజెక్టును 1992లో పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. లెండి నదిలోని నీరు మంజీరాలో కలవడానికి ముందు ఈ ప్రాజెక్ట్ ద్వారా 6 లక్షల ఘనపు మీటర్ల నీటిని నిల్వ చేయాలన్నది సంకల్పం. మొదట ఈ ప్రాజెక్ట్‌ను గోదావరి మరాఠ్వాడా ఇరిగేషన్ డెవలప్‌మెంట్ లిమిటెడ్ చేపట్టినపుడు దాని అంచనా వ్యయం రూ.50 కోట్లు కాగా, 2016లో అది రూ.1400 కోట్లకు పెరిగింది. 2020కి పూర్తి చేయాలని తాజాగా నిర్ణయించారు. అంటే..మొదట అనుకున్నదానికన్నా 28 ఏండ్లు ఆలస్యం కానున్నది. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే మహారాష్ట్ర నాందేడ్ జిల్లాలోని 27,181 ఎకరాలకు నిజామాబాద్ జిల్లాలోని 22,000 ఎకరాలకు సాగునీరు అందనున్నది. లెండి ప్రాజెక్ట్‌ను త్వరగా పూర్తి చేయాలని రెండేండ్ల క్రితమే(2016 మార్చిలో) తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌కు లేఖ రాశారు. సంయుక్త భాగస్వామ్యంలో చేపట్టే ప్రాజెక్ట్‌కు అంతరాష్ట్ర బోర్డును ఏర్పాటు చేయాలని కేసీఆర్ ఆ సందర్భంగా సూచించారు. మహారాష్ట్రలో 20 ఏండ్లకుపైగా ఆలస్యమైన ప్రాజెక్టులు మరో 16 ఉన్నాయి. చేపట్టినపుడు వీటి అంచనా వ్యయం రూ.900 కోట్లు కాగా, ఇప్పుడది రూ.5000 కోట్లకు చేరింది. ఇవన్నీ కరువు ప్రాంతాలైన విదర్భ, మరాఠ్వాడాలకు చెందినవి కావడం గమనార్హం. ప్రతి ఏటా ప్రభుత్వాలు ఇచ్చే ఆర్థిక గణాంకాల్లో దేశంలోనే ధనిక రాష్ట్రంగా మహారాష్ట్ర ముందు వరుసలో ఉంటుంది. అయితే, అదే రాష్ట్రంలో కరువు, నీటి ఎద్దడి ప్రాంతాలు అధికంగా ఉండటం గమనార్హం. దాంతో, ఏటా దేశంలో జరుగుతున్న రైతుల ఆత్మహత్యల్లోనూ ఆ రాష్ట్రం ముందు వరుసలో ఉంటోంది. 2013,2015,2016 సంవత్సరాల్లో తీవ్ర కరువు పరిస్థితిని ఆ రాష్ట్రం ఎదుర్కొన్నది. కరువు వల్ల పంటలు కోల్పోయిన రైతులు 2016లో రూ.4100 కోట్లమేర బీమా కోసం దరఖాస్తు చేసుకున్నారు. ప్రధాని మోడీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం కేంద్రంలో అధికారం చేపట్టిన నాటి నుంచి రైతుల ఆత్మహత్యలు మరింత పెరిగాయని ప్రతిపక్షాలు, రైతు సంఘాలు విమర్శిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ ఫిబ్రవరి 1న పార్లమెంట్‌లో సమర్పించనున్న బడ్జెట్‌పై రైతు సంఘాలు దృష్టి సారించాయి. ఈ సందర్భంగా మహారాష్ట్రలోని కరువు ప్రాంతాలకు సంబంధించి ఆరు ప్రాజెక్టులపై కేంద్రం షెడ్యూల్ విడుదల చేయనున్నట్టు తెలుస్తోంది. అయితే, ఇవన్నీ కూడా 1997కు ముందు చేపట్టి పెండింగ్‌లో ఉన్నవన్నది గమనార్హం. 20 ఏండ్ల ఆలస్యం వల్ల ఈ ప్రాజెక్టుల అంచనా వ్యయం రూ.700 కోట్ల నుంచి రూ.2700 కోట్లకు పెరగనున్నది.



మహారాష్ట్రలో 20 ఏండ్ల క్రితం తలపెట్టిన సాగునీటి ప్రాజెక్టుల పనులు ఇప్పటికీ ప్రారంభం కాకపోవడంతో వాటి అంచనా వ్యయం తడిసి మోపెడైంది. అప్పుడు రూ.900 కోట్లుగా ఉన్న అంచనా వ్యయం ఇప్పుడు రూ.5000 కోట్లకు చేరింది. ప్రభుత్వాల అలసత్వానికి తెలంగాణ(నిజామాబాద్)-మహారాష్ట్ర సరిహద్దున ఉన్న లెండి ప్రాజెక్టు ఓ ఉదాహరణగా నిలుస్తుంది. 30 ఏండ్ల క్రితమే ఈ ప్రాజెక్ట్‌పై అంచనాలు రూపొందించారు..

త్రివర్ణ పతాకం రెపరెపలు

69వ గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి.సాధారణ జనం మొదలుకుని పార్టీ కార్యాలయాలు,ప్రభుత్వ కార్యాలయాల్లోనూ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.దేశం కోసం ప్రాణాలు త్యాగాలు చేసిన అమరులను స్మరించి,నివాళులు అర్పించారు.



ప్రగతి భవన్‌లో.. సీఎం కేసీఆర్



మొదుగుపూలు కార్యాలయంలో తమ్మినేని..



కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో.. ఉత్తమ్



సీపీఐ పార్టీ కార్యాలయంలో.. సురవరం,చాడ



అసెంబ్లీ ముందు స్పీకర్ మధుసూదనాచారి, మండలి చైర్మన్ స్వామిగౌడ్ తదితరులు..



టీజేఏసీ కార్యాలయంలో.. కోదండరామ్



జనసేన పార్టీ కార్యాలయంలో.. పవన్‌కళ్యాణ్

కిరోసిన్ పోసుకొని తల్లీకూతురు ఆత్మహత్య

- ప్రమాదం నుంచి తప్పించుకున్న మరో కుమార్తె
- అత్తింటి వారి వేధింపులే కారణం..?

నవతెలంగాణ- బీబీనగర్

కూతురిపై కిరోసిన్ పోసి.. ఆపై తానూ పోసుకొని నిప్పంటించుకొని తల్లీకూతురు ఆత్మహత్య చేసుకున్నారు. దీనికి అత్తింటి వారి వేధింపులే కారణమనే ఆరోపణలొస్తున్నాయి. ఈ ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం మదిరేగూడూరు గ్రామంలో శుక్రవారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీశైలం, నిర్మలకు ఆరు సంవత్సరాల కిందట వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు ప్రజ్ఞ, జ్యోతి. కొన్నాళ్లుగా అత్త జయమ్మకు, నిర్మలకు మధ్య గొడవలు జరుగుతున్నాయి. శుక్రవారం ఉదయం కూడా వీరిద్దరూ గొడవ పడ్డారు. దీనిపై భార్యను శ్రీశైలం మందలించాడు. మనస్తాపానికి గురైన నిర్మల ఒంటిపై కిరోసిన్ పోసుకున్నది. ఆపై ఇద్దరి కుమార్తెలపైనా పోసింది. నిప్పంటించబోతుండగా పెద్ద కూతురు దూరంగా పోయి దాక్కుంది. నిర్మల(28), రెండో కుమార్తె జ్యోతి(18 నెలలు) మాత్రం మంటల్లో కాలిపోయి అక్కడికక్కడే ప్రాణం కోల్పోయారు. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. నిర్మల తండ్రి ఫిర్యాదు మేరకు అత్త, భర్త, అతని సోదరుడిని ఎస్ఐ సురేష్‌కుమార్ అదుపులోకి తీసుకున్నారు.

గణతంత్ర వేడుకల్లో అపశృతి

- విద్యుద్ఘాతంతో సెక్యూరిటీ గార్డు మృతి
- మృతదేహంతో కార్యాలయం ఎదుట గ్రామస్తుల ఆందోళన
- సిద్దిపేట జిల్లా కోహెడలో ఘటన
- బాధిత కుటుంబానికి రూ.5 లక్షల చెక్కును అందజేసిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-కోహెడ



గణతంత్ర దినోత్సవ వేడుకల్లో అపశృతి చోటుచేసుకున్నది. అలంకరించిన ఇనుప పైపు విద్యుత్ వైర్లకు తగిలి విద్యుద్ఘాతంతో సెక్యూరిటీ గార్డు మృతి చెందాడు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా కోహెడ మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో శుక్రవారం జరిగింది. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం...ఆరెపల్లికి చెందిన గొట్టె చంద్రయ్య(42) కోహెడ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఔట్‌సోర్సింగ్ కింద 20 ఏండ్ల నుంచి సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. మార్కెట్ కార్యాలయంలో జెండా ఎగరవేసేందుకుగాను ఇనుపరాడ్‌ను అలంకరించారు. చంద్రయ్య జెండా రాడ్‌ను గద్దెలోకి దింపుతుండగా పైనున్న హైటెన్షన్ కరెంటు వైర్లకు తగిలింది. దీంతో అక్కడికక్కడే చనిపోయాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఘటనాస్థలికి చేరుకున్నారు. న్యాయం దక్కేవరకూ మృతదేహాన్ని తీయబోమని మార్కెట్ కమిటీ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు.

విషయాన్ని స్థానికులు మంత్రి హరీశ్‌రావు, స్థానిక ఎమ్మెల్యే సతీష్‌కుమార్, పోలీసులకు సమాచారమందించారు. హైదరాబాద్‌లో ఉన్న ఎమ్మెల్యే వెంటనే కోహెడకు చేరుకున్నారు. మార్కెటింగ్ శాఖ ద్వారా రూ.5 లక్షల చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు. 'ట్రాన్స్‌కో ద్వారా మరో రూ.5 లక్షలు ఎక్స్‌గ్రేషియా అందిస్తాం. మృతుడి భార్య లలితకు ఔట్ సోర్సింగ్‌లో ఉద్యోగం ఇప్పిస్తాం. మృతుడి కూతురు చెర్రి (6) పైచదువులకు సహకరిస్తాం. మూడెకరాల భూమి, డబుల్‌బెడ్‌రూం ఇల్లు ఇస్తాం. అన్నిరకాలుగా ప్రభుత్వ పరంగా ఆదుకుంటాం' అని ఎమ్మెల్యే హామీనిచ్చారు. దీంతో గ్రామస్తులు మృతదేహాన్ని తరలించేందుకు ఒప్పుకున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు పోలీసులు అప్పగించారు.

విద్యుద్ఘాతంతో ఇద్దరు యువకులు మృతి

- మరో ఇద్దరి పరిస్థితి విషమం
- నలుగురిదీ ఒకే కుటుంబం
- వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్‌లో ఘటన

నవతెలంగాణ-కొడంగల్

ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలి ఇద్దరు యువకులు మృతి చెందారు. మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ మండలంలో శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని ఊరగుంటతండాకు చెందిన ఫతే నాయక్ తన పొలంలో కాలి పోయిన బోరుమోటారును మార్చడానికి తన ఇద్దరు కొడుకులతో పాటు అల్లుడిని తీసుకుని వెళ్లాడు. బోరు మోటార్‌ను పైకి తీస్తుండగా అది ప్రమాదవశాత్తు పైన ఉన్న 11కేవీ విద్యుత్ వైర్లకు తగిలింది. ఈ ప్రమాదంలో ఫతేనాయక్ కొడుకు శ్రీశైలం (35), అల్లుడు వాల్యానాయక్ (25) అక్కడికక్కడే మృతి చెందారు. ఫతేనాయక్, ఆయన మరో కొడుకు శ్రీకాంత్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. వారి పరిస్థితి విషమంగా ఉండడంతో మహబూబ్‌నగర్ జిల్లా కోస్గి ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స నిర్వహించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు.

అప్పుల బాధతో ఇద్దరు రైతుల ఆత్మహత్య

- ఖమ్మం జిల్లాలో ఘటనలు

నవతెలంగాణ-ఖమ్మంప్రతినిధి

అప్పుల బాధ తాళలేక ఖమ్మం జిల్లాలో శుక్రవారం ఇద్దరు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. తిరుమలాయపాలెం మండలం వెదుళ్లచెరువు గ్రామానికి చెందిన యువ రైతు నేరడి అనిల్‌కుమార్(29) గతేడాది మిర్చి, పత్తి సాగు చేశాడు. పంటలకు తెగుళ్లు వచ్చి దిగుబడి సరిగా రాలేదు. పండిన కొద్దిపాటి పంటకు గిట్టుబాటు ధర కరువైంది. పంట సాగు కోసం సుమారు రూ.4లక్షల వరకు అప్పు చేశాడు. అప్పులు తీర్చలేనన్న బెంగతో శుక్రవారం ఇంట్లో పురుగుల మందు తాగాడు. గమనించిన స్థానికులు, కుటుంబ సభ్యులు ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఫలితం లేక మృతి చెందాడు. కారేపల్లి మండలం బీక్యాతం డాకు చెందిన బానోత్ శంకర్(30) రెండెకరాల్లో పత్తి సాగు చేస్తున్నా డు. మూడేండ్లుగా దిగుబడి రావడం లేదు. పంట సాగు కోసం రూ.2లక్షల వరకు అప్పు చేశాడు. అప్పులు తీర్చే మార్గం లేక వారంరోజుల కిందట చేను వద్ద పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఖమ్మంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి శుక్రవారం మృతి చెందాడు.

టీఆర్టీ దరఖాస్తుల సవరణకు నేడు ఆఖరు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ నియామక పరీక్ష (టీఆర్టీ)కి దరఖాస్తు చేసిన అభ్యర్థుల దరఖాస్తుల్లో తప్పుల సవరణకు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) మరోసారి అవకాశం కల్పించింది. ఈ మేరకు టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి ఎ వాణీ ప్రసాద్ గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. దరఖాస్తుల్లో తప్పుల సవరణకు శనివారం ఆఖరు రోజని తెలిపారు. టీఆర్టీకి దరఖాస్తు చేసిన అభ్యర్థుల్లో కొందరి బయోడేటా వివరాలు, జిల్లాల ఎంపిక అంశాన్ని తప్పుగా పొందుపరిచారని పేర్కొన్నారు. వాటిని తప్పనిసరిగా సరిచేయాలని అభ్యర్థులకు సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అభ్యర్థులకు సూచించారు. పూర్తి వివరాలకు టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

శ్రీను హత్యకు ఎమ్మెల్యే వీరేశమే కారణం

హత్యకు ప్లాన్ చేసింది డీఎస్పీనే

- సీబీఐతో విచారణ జరిపించాలి
- కేసీఆర్ సిగ్గుతో తలదించుకోవాలి : శ్రీను కుటుంబాన్ని పరామర్శించిన కాంగ్రెస్ నేతలు

నవతెలంగాణ - నల్లగొండ ప్రతినిధి

"కాంగ్రెస్ నాయకుడు బొడ్డుపల్లి శ్రీనివాస్‌ను టీఆర్ఎస్ నాయకులే హత్య చేయించారు. అందుకు నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశమే కారణం. హత్యలే చేయాలనుకుంటే మీరెవ్వరూ మిగలరు.. కానీ, అది మా పద్ధతి కాదు" అని కాంగ్రెస్ నేతలు హెచ్చరించారు. టీపీసీసీ అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీఎల్పీ నేత కె. జానారెడ్డి, ఉపనేత కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, శాసన మండలి పక్షనేత షబ్బీర్ అలీ, మాజీ ఎంపీ వి.హనుమంతరావుతో పాటు పలువురు నాయకులు బొడ్డుపల్లి శ్రీనివాస్ కుటుంబాన్ని శుక్రవారం పరామర్శించారు. శ్రీనివాస్ కుటుంబ సభ్యుల్ని ఓదార్చారు. అనంతరం విలేకర్ల సమావేశంలో టీపీసీసీ అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రాజకీయ కుట్రతోనే శ్రీనివాస్‌ను హత్య చేశారని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఆర్నెళ్లుగా తీవ్ర బెదిరింపులు వస్తున్నాయని ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఫిర్యాదు చేసినా ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. ఈ ఘటనతో కేసీఆర్ సిగ్గుతో తలదించుకోవాలన్నారు. ఎవరి అండ చూసుకుని ఎమ్మెల్యే వేముల వీరేశం క్రిమినల్ చర్యలకు పాల్పడుతున్నారని ప్రశ్నించారు. ఈ హత్య కేసును సీబీఐకి అప్పజెప్పి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. శ్రీనివాస్ కుటుంబానికి అండగా ఉంటామన్నారు. సీఎల్పీ నేత జానారెడ్డి మాట్లాడుతూ.. ఈ హత్యకు సీఎం కేసీఆర్ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. శాసనమండలి పక్షనేత షబ్బీర్ అలీ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే వీరేశానికి సీఎం మద్దతు ఉన్నట్టు తెలుస్తోందన్నారు. అధికార పార్టీకి పోలీసులు తొత్తులుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. మాజీ ఎంపీ వి.హనుమంతరావు మాట్లాడుతూ.. ఈ హత్య ఎమ్మెల్యే వీరేశమే చేయించినట్టు స్పష్టంగా తెలుస్తున్నదన్నారు. నయీమ్‌తో వీరేశానికి సంబంధాలున్నాయని, నయీమ్ ఎన్‌కౌంటర్ అయ్యాడు.. మరి వీరేశం ఎందుకు కాలేదని ప్రశ్నించారు. ఈ హత్యలో నల్లగొండ టీఆర్ఎస్ ఇన్‌ఛార్జి



మాట్లాడుతున్న ఉత్తమ్ కుమార్ రెడ్డి

కంచర్ల భూపాల్‌రెడ్డి హస్తం కూడా ఉందని ఆరోపించారు. ఈ కేసును వదిలి పెట్టేది లేదన్నారు. కేసీఆర్ పతనం ఇక్కడి నుంచే మొదలైందన్నారు. సీఎల్పీ ఉపనేత కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆరేండ్ల కింద కొడుకు చనిపోయి సగం చచ్చిపోయానని, ఇప్పుడు ప్రాణానికి ప్రాణమైన సొంత తమ్ముడి లాంటోన్ని చంపారని కన్నీరు పెట్టారు. నల్లగొండ డీఎస్పీ సుధాకర్‌ను ఇక్కడికి తీసుకొచ్చి అరాచకాలు చేయిస్తున్నారన్నారు. నిందితులు ఊట్కూరులో దాచుకున్నారన్నారు. హత్యలే చేయాలనుకుంటే మీరెవ్వరూ మిగలరని, కానీ..అది తమ పద్ధతి కాదంటూ హెచ్చరించారు. వారి వెంట ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు బూడిద బిక్షమయ్యగౌడ్, మాజీ జెడ్పీ చైర్మెన్ కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, రాష్ట్ర నాయకులు వీరయ్యవర్మ, శంకర్‌నాయక్ ఉన్నారు.

శ్రీనివాస్ హత్యకేసులో నిందితుల లొంగుబాటు

నల్లగొండ మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త, కాంగ్రెస్ పార్టీ నాయకుడైన బొడ్డుపల్లి శ్రీనివాస్ హత్య కేసులో నిందితులు ఎస్పీ శ్రీనివాస్‌రావు ఎదుట శుక్రవారం లొంగిపోయారు. హత్య జరిగిన రోజునే అనుమానితులుగా ఉన్న చక్రి, దుర్గయ్య, మోహన్, ఎం.గోపీలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మాంద్ర మల్లేశ్, చింతకట్ల రాంబాబు, శరత్‌ను 24 గంటల్లోపే అరెస్టు చేయడం, గొడవలు జరగకుండా చూడటంలో పోలీసులు చాకచక్యంగా వ్యవహరించారు. అయితే, శ్రీనివాస్‌కు రక్షణ కల్పించడంలో విఫలమయ్యారన్న విమర్శలను పోలీసులు మూటగట్టుకున్నారు. శ్రీనివాస్ హత్య అప్పటికప్పుడు జరిగిందే తప్ప ఓ పథకం ప్రకారం జరిగింది కాదని పోలీసులు ప్రాథమికంగా అంచనాకు వచ్చినట్టు సమాచారం.

యాసంగిలో 10 లక్షల ఎకరాలకు సాగునీరు

- ఎస్సారెస్పీ, నిజాంసాగర్, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల కింద చివరి ఆయకట్టుకూ అందించాలి: హరీశ్ రావు ఆదేశం



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలోని మూడు ప్రధాన ప్రాజెక్టుల కింద 10 లక్షల ఎకరాల యాసంగి పంటలకు సాగునీరందించాలని నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు ఆదేశించారు. శ్రీరాంసాగర్, నిజాంసాగర్, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల కింద చివరి ఆయకట్టు రైతులకు కూడా నీరందేలా చూడాలన్నారు. మూడు ప్రాజెక్టుల పరిధిలోని రబీ పంటలకు సాగునీటి సరఫరాను క్రమబద్ధం చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆయన ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. శక్రవారం జలసౌధలో ఈమూడు ప్రాజెక్టుల ఆయకట్టుకు జరుగుతున్న సాగునీటి సరఫరాపై మంత్రి సమీక్షించారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పరిధిలోని లోయర్ మానేర్ ఎగువన 4,07,417 ఎకరాలకు, దిగువన 1,52,588 ఎకరాలకు, నాగార్జునసాగర్ కింద 5,25,629 ఎకరాలకు, నిజాంసాగర్ కింద 1,51,666 ఎకరాలకు సాగునీరందించాలని మంత్రి టార్గెట్ నిర్ణయించారు. కాలువల వెంట సీఈ, ఎస్ఈ, ఈఈ, ఇతర సిబ్బంది నిరంతరం తిరగాలని, సాగునీటి సరఫరా తీరును క్షేత్ర స్థాయిలో పరిశీలిం చి, పర్యవేక్షించాలని ఆదేశించారు. జిల్లాకలెక్టర్ల సహకారం తీసుకోవాలని మంత్రి కోరారు. రెవెన్యూ సిబ్బందితో సమన్వయంతో పనిచేయాలన్నారు. సంబంధిత జిల్లా మంత్రులు, ప్రజాప్రతినిధులతో సత్సంబం ధాలు కొనసాగించాలన్నారు. నీరు అత్యంత విలువైనదని, చుక్క నీరు కూడా వధా పోకుండా అత్యంత పొదుపుగా వాడాలని చెప్పారు. సాగునీటి క్రమబద్ధీకరణ వ్యవహారంలో ఎలాంటి లోటుపాట్లు జరిగినా ఈఈలదే బాధ్యత అని, వారిపై చర్యలకు ప్రభుత్వం వెనుకాడబోదన్నారు. నీటిని వదిలినప్పుడు అప్రమత్తంగా ఉండాలని రాత్రీ, పగలూ పర్యవేక్షించాలని ఆదేశించారు.ఈ మూడు ప్రాజెక్టుల పరిధిలో రబీ ఆయకట్టును కాపాడవలసి ఉందన్నారు. ప్రధాన కాలువలకు ఆన్ అండ్ ఆఫ్ పద్ధతిలో సాగునీటిని సరఫరా చేస్తున్నందున దిగువ నున్న రైతులకు నీరందించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. కోరారు. శ్రీరామ్ సాగర్ లోయర్ మానేరు డ్యామ్ ఎగువ, లోయర్ మానేరు డ్యామ్ దిగువ ప్రాంతాల్లోఉన్న డిస్ట్రిబ్యూటరీలు, నాగార్జున సాగర్ ఎడమ కాలువకింద ఉన్న డీస్ట్రిబ్యూటరీలు, నిజాంసాగర్ కింద కాలువల పరిధిలోనూ ఆయకట్టు కు సాగునీటి సరఫరాపై క్షేత్ర స్థాయి పరిస్థితిని మంత్రి సమీక్షించారు. ఈ.ఎన్.సి. మురళీధరరావు, సీఈలు శంకర్, సునీల్, మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

మనువాద రాజ్యాంగం కోసం బీజేపీ యత్నం

- చరిత్రను వక్రీకరించే కుట్రలు
- విద్యావంతులు, మేధావులు తిప్పికొట్టాలి : చావ రవి

నవతెలంగాణ-మహబూబ్‌నగర్‌ప్రతినిధి

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం స్థానంలో మనువాద రాజ్యాంగాన్ని తెచ్చే కుటిల యత్నాలకు బీజేపీ పాల్పడుతోందని యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావరవి విమర్శించారు. మైనార్టీల హక్కులను కాపాడాలంటే మన రాజ్యాంగాన్ని కాపాడుకోవాలన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో 'ప్రమాదంలో భారత రాజ్యాంగం-మన కర్తవ్యం' అనే అంశంపై సెమినార్‌ను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశచరిత్రను వక్రీకరణను ప్రశ్నిస్తున్న అభ్యుదయవాదులపై హిందూత్వశక్తులు దాడులు చేస్తున్నాయని వాపోయారు. ఉపాధ్యాయులు, మేధావులు కలిసి బీజేపీ కుట్రలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగం పట్ల ఆర్ఎస్ఎస్, జనసంఘ్ మొదటి నుంచీ విముఖత చూపుతున్నాయన్నారు. మోడీ విధానా లపై వేలెత్తి చూపుతే... ఎంతటి వారినైనా నరికేస్తామంటున్నారంటే ప్రజాస్వా మ్యం ఏ స్థాయిలో ప్రమాదంలో ఉందో అర్థం అవుతుందన్నారు. పాలకుల నుంచి భరోసా దొరకక రైతులు ఆత్మహత్య చేసుకుంటుంటే..వారంతా నపుంసక త్వంతో ఆత్మహత్యలు చేసుకుంటున్నారని బీజేపీ నేతలు వ్యాఖ్యానిం చటం దుర్మార్గమన్నారు. మానవ పరిణామక్రమాన్ని తెలిపే డార్విన్ సిద్ధాంతాన్ని తప్పుపట్టిన బీజేపీ మంత్రి వాలకం చూస్తుంటే వీరికి శాస్త్రీయత పట్ల ఉన్న నమ్మకం ఏమిటో అర్థమవుతోందన్నారు. అట్టడుగున ఉన్న దళిత, బడుగు బలహీన వర్గాల వారికి ఉన్న రిజర్వేషన్లు తీసేసే కుట్రలు చేయడం దారుణమ న్నారు. కార్యక్రమానికి శ్రీధర్‌శర్మ అధ్యక్షత వహించారు. యూటీఎఫ్ సీనియర్ నాయకులు అబ్దుల్లాఖాన్, హన్మంతురెడ్డి, సత్య నారాయణరెడ్డి, లక్ష్మయ్య, బాలరాజు, జిల్లా కార్యదర్శి జంగయ్య, వహీద్‌ఖాన్, కొప్రశంకర్,రామకృష్ణ పాపయ్య పాల్గొన్నారు.

నైతిక ప్రమాణాలను నిర్దేశించేది రాజ్యం కాదు, ప్రజలే. శక్తివంతమైన వ్యవస్థలు నీతికి కట్టుబడే విధంగా నిర్దేశించగలిగేది ప్రజలే. - నోమ్ చామ్‌స్కీ

గణతంత్ర దినోత్సవం

సంపాదకీయం

దేశరాజధానిలో 69వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ మొదటిసారి ఎర్రకోటపైన త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. ఉత్సవాలకు ఆసియా సౌత్ ఈస్ట్ దేశాల నుండి పదిమంది ప్రతినిధులు పాల్గొనడం విశేషం. వివిధ రంగాలలో విశిష్టసేవలు చేసిన 85మందికి పద్మశ్రీ, పద్మభూషణ్ అవార్డులను ప్రకటించారు. తెలంగాణ నుండి ఎవరూ లేకపోవటం నిరాశ కలిగినా తెలుగువాడైన కిదంబి శ్రీకాంత్‌కు రావడం హర్షణీయం. అంతర్గత భద్రతలో వేలాదిమంది వేడుకలలో పాల్గొనడం, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకపోవటం సంతోషదాయకం. కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీని మొదటి వరుసలో కాకుండా ఆరవ వరుసలో సీటు కేటాయించడం కాంగ్రెస్ శ్రేణులకు నిరాశ కలిగించింది. నిరసన వ్యక్తం చేశారు. పాలకుల పక్షపాతానికి ఇది నిదర్శనం.

ఉద్రిక్త విద్వేషాలతో సామాజిక వాతావరణాన్ని వేడిక్కిస్తున్నారు. మత రాజ్యాంగంగా మార్చాలని కలలు కంటున్నారు. రిపబ్లిక్ దినోత్సవం సందర్భంగా పాలకుల కుటిలనీతిని గమనించాలి. ప్రతిఘటించాలి. రాజ్యాంగ విలువలైన ప్రజాస్వామ్యం, లౌకికతత్వం రక్షణకు కంకణబద్ధులు కావాలి. హద్దు మీరుతున్న సంఘ్ పరివారాన్నీ, మనువాదులనూ ప్రజలే అదుపులోపెట్టాలి.

ప్రజలనుద్దేశించి రాష్ట్రపతి మాట్లాడారు. "చారిత్రిక అంశాలు, అభిప్రాయాలపై అసంతృప్తి విభేదాలు ఉండవచ్చు. కానీ ఇతరుల గౌరవానికి భంగం కలిగించకూడదు. సంబరాలు చేసుకున్నా, నిరసన తెలిపినా పొరుగువారికి అసౌకర్యం కల్పించకూడద"న్నారు. త్వరితగతిన పేదిరిక నిర్మూలన పవిత్ర కర్తవ్యంగా భావించాలన్నారు. భారతంలో 60శాతం యువకులే ఉన్నారని తెలిపారు. 69ఏండ్ల క్రితం మొదటి రాష్ట్రపతి నూతన రాజ్యాంగ చట్టంలో సహజంగా గర్భితమై ఉన్న వైరుధ్యాలను ప్రమాదాన్ని గుర్తించారు. "మన రాజ్యాంగంలో కొందరికి అభ్యంతరకరమైన అంశాలున్న మాట నిజం. రాజకీయాలకు సంబంధించినంత వరకు మనకంత సారూప్యత కనిపిస్తుంది. ఆర్థిక జీవితాలలో అసమానత ప్రత్యక్షమౌతున్నది. రాజకీయాలలో ఒక మనిషికి ఒక ఓటు ఒక ఓటుకు ఒక విలువ ఉన్నదనే సిద్ధాంతాన్ని గుర్తిస్తున్నాం. మన సామాజిక ఆర్థిక జీవితాలలో అసమానతలు ఎంత తొందరగా తొలగిపోతే అంత మంచిది అన్నారు. కానీ, నేటికీ తొలగిపోలేదు. ప్రజల కొరకు రాజ్యాంగం ఉండాలి. కానీ రాజ్యాంగం కోసం ప్రజలు లేరన్న సంగతి పాలకులు గుర్తుంచుకోవాలి. పాలకులు మారినప్పుడల్లా రాజ్యాంగాన్ని మార్చాలనుకోవడం సరైంది కాదు. రాజ్యాంగాన్ని మార్చవచ్చు. కానీ ఎప్పుడు? అది ప్రజలకు ఆటంకం అయినప్పుడు మాత్రమే. బీజేపీ పాలకులు 2015లో సెక్యులర్, సోషలిస్టు పదాలను తొలగించాలని వివాదం లేవనెత్తారు. ఇదేమిటని ప్రశ్నిస్తే ఇవి మధ్యలో ఇరికించారని బుకాయించారు. ప్రజాస్వామ్యానికి తూట్లు పొడవటం ప్రారంభించారు. తలాక్ బిల్లు సమస్య మీద మహిళాసంఘాలూ, కోర్టులలో కొట్లాడిన స్వచ్ఛంద సంస్థల అభిప్రాయాలు తీసుకోలేదు. బిల్లును అధ్యయనం చేసేందుకు, సూచనలు చేసేందుకు పార్లమెంట్‌కు, ప్రజలకు తగిన సమయం ఇవ్వలేదు. ఏకపక్షంగా హఠాత్తుగా లోక్‌సభలో ప్రవేశపెట్టారు. స్టాండింగ్ కమిటీకి పంపాలని కోరినా పట్టించుకోలేదు. మందబలంతో



లోక్‌సభలో నెగ్గించుకున్నారు. ఈ బిల్లు పౌరహక్కులను ఉల్లంఘిస్తోంది. న్యాయ వ్యవస్థలో పౌర, నేర విభాగాలున్నాయి. వివాహం పౌరచట్టం కిందికి వస్తుంది. తలాక్ సమస్యను క్రిమినల్ సమస్యగా చూశారు. భర్తకు మూడేండ్లు జైలుశిక్ష పడితే, ఆ కుటుంబం రోడ్డుమీద పడుతుంది. ఇది అనాలోచితం, అప్రజాస్వామికం. రాజ్యసభలో బలంలేక పెండింగ్‌లో పడింది. పాలకుల పంతం నెగ్గించుకునేందుకు అనేక రకాలుగా ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తున్నది.

భావ ప్రకటనా స్వేచ్ఛను బందీ చేస్తున్నారు. గౌరీలంకేశ్‌ను పొట్టన పెట్టుకున్నారు. పద్మావత్ సినిమా తీస్తే దాని విడుదలకు అనేక ఆటంకాలు సృష్టించారు. చివరకు సుప్రీంకోర్టు జోక్యంతో విడుదలైంది. అయినా విధ్వంసకారులకు కాషాయ పాలకులు వత్తాసు పలుకుతున్నారు. బీజేపీ రాష్ట్ర ప్రభుత్వాలే సినిమాను ఆడనీయకుండా రాజ్యాంగ ఉల్లంఘనలకు పాల్పడినా కేంద్రం చోద్యం చూస్తున్నది. కోరెగావ్‌లో దళిత అమరసైనికుల స్ఫూర్తిగా ద్విశత వార్షికోత్సవాలు జరుపుకుంటే కండ్లు మండిన కాషాయకూటమి ఘర్షణలకు తెరలేపింది. అరెస్టులతో అడ్డుకోవాలని చూసింది. దళిత నాయకులపై కేసులు పెట్టింది. రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం కలిగించింది.

ఒకే దేశం ఒకే పన్ను విధానమని ముద్దుపేరు పెట్టారు. ఫెడరల్ స్ఫూర్తిని వమ్ముచేశారు. రాష్ట్రాల హక్కులను హరించారు. స్వతంత్ర సంస్థలైన రిజర్వ్‌బ్యాంక్ ప్రమేయం లేకుండానే పెద్దనోట్లను రద్దు చేశారు. ఎన్నికల సంఘం పనిలో జోక్యం చేసుకున్నారు. న్యాయవ్యవస్థ లోపాలను నలుగురు న్యాయమూర్తులు ఎత్తి చూపినా పట్టించుకోలేదు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం పాల్జేశారు. లౌకిక ప్రజాస్వామ్య విధానం మన జాతీయోద్యమ వారసత్వం. మన రాజ్యాంగానికి జీవనాడి, రాజ్యాంగ విలువలకు త్రికరణ శుద్ధిగా కట్టుబడి ఉన్నామని ప్రమాణం చేసే పాలకులు, ఉద్రిక్త విద్వేషాలతో సామాజిక వాతావరణాన్ని వేడిక్కిస్తున్నారు. మత రాజ్యాంగంగా మార్చాలని కలలు కంటున్నారు. రిపబ్లిక్ దినోత్సవం సందర్భంగా పాలకుల కుటిలనీతిని గమనించాలి. ప్రతిఘటించాలి. రాజ్యాంగ విలువలైన ప్రజాస్వామ్యం, లౌకికతత్వం రక్షణకు కంకణబద్ధులు కావాలి. హద్దు మీరుతున్న సంఘ్ పరివారాన్నీ, మనువాదులనూ ప్రజలే అదుపులోపెట్టాలి.

అంతర్గత ప్రజాస్వామ్యం బలంగా అమలవుతోంది



ప్రకాశ్ కరత్

సీపీఐ(ఎం) 22వ అఖిల భారత మహాసభ ముందుంచే ముసాయిదా రాజకీయ తీర్మానాన్ని జనవరి21న కోల్‌కతాలో జరిగిన పార్టీ కేంద్ర కమిటీ సమావేశం మెజార్టీ ఓటుతో ఆమోదించింది. దీనిపై మీడియా, రాజకీయవర్గాలు అనేక వ్యాఖ్యలు చేస్తున్నాయి. పొలిట్‌బ్యూరో ముసాయిదా తీర్మానం, మైనార్టీ ముసాయిదా తీర్మానం కేంద్రకమిటీ ముందుంచుతారనే విషయం ఈ సమావేశానికి ముందే తెలుసు. అయినా దీనిపై ప్రధాన స్రవంతి మీడియాలో

సీపీఐ(ఎం)లో సంక్షోభం, ముఠా తగాదాలు, ఘర్షణలు నెలకొన్నట్టు వస్తున్న నిరాధార, దిక్కుమాలిన ఊహాగానాలను పట్టించుకోనవసరం లేదు. పార్టీలో కేంద్రీకృత క్రమశిక్షణతో కూడిన అంతర్గత ప్రజాస్వామ్య సంప్రదాయాన్ని బలంగా అమలు జరుపుతున్నందుకు సీపీఐ(ఎం) గర్వపడుతున్నది. ఈ సంప్రదాయాన్ని పార్టీ 22వ మహాసభ స్వీకరించి, ముందుకు తీసుకెళ్తుంది.

రకరకాల కథనాలొచ్చాయి. వీటిలో చాలావరకు ఒక కమ్యూనిస్టు పార్టీగా సీపీఐ(ఎం) వ్యవహారశైలికి సంబంధించి దురుద్దేశంతో కూడుకుని రాసినవి లేదా అవకాశం వచ్చింది కదా అని పార్టీ నాయకత్వాన్ని చులకన చేసే దుర్బుద్ధితో కూడిన వ్యాఖ్యలు, వక్ర భాష్యాలే!

ఉదాహరణకు మీడియా, ప్రత్యేకించి కేరళ, పశ్చిమ బెంగాల్లో మీడియా ఈ విషయంలో కూడబలు క్కున్నట్టు ఒకే మూస పద్ధతిని అనుసరించాయి. రెండు ముసాయిదాలను రెండు 'ముఠాలు' (ఫ్యాక్షన్స్) ప్రవేశపెట్టినట్టు కొందరు చిత్రీకరించారు. ఇంకొందరు మరింత ముందుకెళ్లి దీనిని 'ఇద్దరు వ్యక్తుల మధ్య ఘర్షణ'గా చిత్రించే ప్రయత్నం చేశారు. ఇద్దరు వ్యక్తులంటే ఇక్కడ పార్టీ ప్రస్తుత ప్రధాన కార్యదర్శి, మాజీ ప్రధాన కార్యదర్శి అన్నమాట! ఈ విధమైన చిత్రీకరణలు నిరాధారమైనవి, తప్పుడివి. విభిన్న రాజకీయ అభిప్రాయాలు, వైఖరులపై పార్టీ అంతర్గత ప్రజాస్వామ్య పరిధికి లోబడి చర్చించినప్పుడు దానిని వ్యక్తిగత ఘర్షణగాను, వ్యక్తిగత విభేదాలుగాను కుదించి చూపడం తగునా! ముసాయిదా తీర్మానానికి సంబంధించి మీడియా అంతా కట్టగట్టుకుని ప్రచారంలో పెట్టిన మరో తప్పుడు భావన ఏమిటంటే ఈ తీర్మానం దృష్టంతా 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఎలాంటి ఎన్నికల ఎత్తుగడలు అనుసరించాలన్నదానిపైనే అన్నట్టుగా చిత్రించడం.

ఒక కమ్యూనిస్టు పార్టీగా సీపీఐ(ఎం) కేంద్రీకృత ప్రజాస్వామ్యం అనే నిర్మాణ సూత్రాల ఆధారంగా పని చేసే విశిష్టమైన పార్టీ. అంటే దీనర్థం పార్టీలోని అన్ని ప్రధాన కమిటీలు అంతర్గత ప్రజాస్వామ్యాన్ని తు.చ. తప్పక పాటిస్తాయి. రాజకీయ, నిర్మాణ పరమైన అంశాలన్నిటిపైన ఈ సూత్రం ప్రాతిపదికనే చర్చించడం, నిర్ణయాలు తీసుకోవడం జరుగు తుంది. రాజకీయ అంశాలపై కమిటీ ముందు ఒక సభ్యునిగా లేదా బృంద సభ్యులుగా విభిన్న మైన అభిప్రాయాలు వ్యక్తం చేయవచ్చు. దీనిపై స్వేచ్ఛగా, నిష్కర్షగా చర్చ జరిగాక కమిటీ ఒక నిర్ణయానికి వస్తుంది. నిర్ణయం చేయడానికి అవసరమైతే, ఓటింగ్ చేపడుతుంది. మెజార్టీ అభిప్రాయమే కమిటీ సమిష్టి నిర్ణయంగా పరిగణించబడుతుంది.



రాజకీయ అంశంపై కమిటీ పరిధిలో వెలిబుచ్చే మెజార్టీ అభిప్రాయం, మైనార్టీ అభిప్రాయాలను రెండు ముఠాలుగా విడిపోయినట్టు చూడరాదు. ముఠాతత్వం, ముఠాలు కట్టడాన్ని పార్టీ నిబంధనావళి అసలు సహించదు. పార్టీ సమిష్టి నిర్ణయాలను ఉల్లంఘించిన వారు, భిన్నమైన కారణాలతో గ్రూపు కట్టడం వంటివి మాత్రం ముఠాతత్వం కిందికి వస్తాయి.

నిర్దిష్టంగా ఈ అంశానికి సంబంధించినంత వరకు పార్టీ మహాసభ ముందు వుంచనున్న ముసాయిదా రాజకీయ తీర్మానాన్ని కేంద్ర కమిటీ చర్చించి, ఖరారు చేసింది. పార్టీ నిబంధనావళి కేంద్ర కమిటీకి ఈ బాధ్యతను అప్పగించింది. అలాగే కేంద్ర కమిటీపై నిబంధనావళి మరో బాధ్యత కూడా వుంచింది. అదేమిటంటే ముసాయిదాపై పార్టీలోని అన్ని శాఖలు, సభ్యులు చర్చించేందుకు తగు వ్యవధి వుండాలి. కాబట్టి పార్టీ మహాసభ జరగడానికి రెండు మాసాల ముందే ఈ ముసాయిదా రాజకీయ తీర్మానాన్ని విడుదల జేయాలని అది స్పష్టంగా పేర్కొంటున్నది. పార్టీ నిబంధనావళి కేంద్ర కమిటీపై ఇంకో బాధ్యతను కూడా పెట్టింది. తీర్మానంపై పార్టీ సభ్యులు, లేదా పార్టీ శాఖ ఎవరైనా సరే తమ సవరణలను నేరుగా కేంద్ర కమిటీకి పంపవచ్చు. అలా వచ్చిన సవరణలతో కూడిన నివేదికను కూడా మహాసభ ముందు కేంద్ర కమిటీ వుంచుతుంది.

ముసాయిదా రాజకీయ తీర్మానం రూపొందించే పనిలో పార్టీ పొలిట్‌బ్యూరో, కేంద్ర కమిటీ గత నాలుగు మాసాలుగా నిమగ్నమయ్యాయి. నాలుగు నెలలనేది ముసాయిదా ఖరారుకు అవసరమైన సాధారణ సమయం. ఆ గడువులోనే పూర్తి చేసి మహాసభకు రెండు మాసాలు ముందుగా దీనిని విడుదల చేయడం జరుగుతుంది. ఈ ముసాయిదా రాజకీయ తీర్మానం ఉద్దేశం దీనిని మహాసభ ఆమోదించాక వచ్చే మూడేండ్లలో పార్టీ అనుసరించాల్సిన రాజకీయ, ఎత్తుగడల పంథాకు దిక్సూచిగా నిలుస్తుంది. పార్టీ మహాసభ జరిగే సమయానికి మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు నాలుగేండ్లవుతుంది. కేంద్రంలో రాజ్యాధికార పగ్గాలను బీజేపీ - ఆరెస్సెస్ చేపట్టాక దేశం తీవ్ర పరిణామాలను ఎదుర్కొంటున్నది. దీంతో సహజంగానే ఈ ముప్పును ఎదిరించేందుకు పటిష్టమైన రాజకీయ-ఎత్తుగడల పంథాను రూపొందించేందుకు పొలిట్ బ్యూరో, కేంద్రకమిటీ విస్తృత స్థాయిలో చర్చించాయి. బీజేపీపై రాజకీయంగా, సైద్ధాంతికంగా పోరాడుతూ, మోడీ ప్రభుత్వాన్ని ఓడించేందుకు ప్రజలను సమీకరించాలని ఈ ఎత్తుగడల పంథా నిర్దేశిస్తోంది.

సీపీఐ(ఎం) చేపట్టనున్న రాజకీయ పంథాపై లౌకిక, ప్రజాతంత్ర వాదులు చాలా ఆసక్తిగా, ఆతృతగా ఎదురుచూస్తున్నారు. బీజేపీకి వ్యతిరేకంగా గట్టి ఐక్యతను సాధించాలన్న ఆకాంక్షను వారు వ్యక్తం చేస్తున్నారు. పార్టీ మహాసభ చేపట్టే రాజకీయ, ఎత్తుగడల పంథా దీనిని నెరవేరుస్తుంది. పార్టీ మహాసభ ఆమోదించే రాజకీయ పంథా ప్రాతిపదికనే రానున్న అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించే నిర్దిష్ట ఎత్తుగడలను పార్టీ చేపడుతుంది.

ముసాయిదా రాజకీయ తీర్మానంపై పార్టీ అంతర్గత చర్చల ప్రక్రియ హైదరాబాద్‌లో 2018 ఏప్రిల్ 18 నుంచి 22 వరకు జరిగే పార్టీ మహాసభలో ముగుస్తుంది. దీనికి పరిష్కారం కూడా అక్కడే లభిస్తుంది. ఈ మహాసభకు అన్ని రాష్ట్రాల నుంచి, వివిధ ప్రజా ఉద్యమాల్లో పని చేస్తున్న వారి నుంచి ఎన్నికైన ప్రతినిధులు హాజరవుతారు. ఇక్కడ గుర్తు చేయాల్సిన మరో అంశమేమిటంటే మహాసభ అనేది పార్టీకి అత్యున్నత నిర్ణాయక వేదిక. ముసాయిదా తీర్మానంపై స్వేచ్ఛగా తమ అభిప్రాయాలను వ్యక్తం చేసే హక్కు, తీర్మానానికి మార్పులు, సవరణలను ప్రతిపాదించే హక్కూ ప్రతినిధులు కలిగివుంటారు.

రాజకీయ తీర్మానాన్ని పార్టీ మహాసభ చర్చించి, ఆమోదించిన తరువాత అది పార్టీ ప్రస్తుత రాజకీయ, ఎత్తుగడల పంథాగా మారుతుంది. పార్టీకి చెందిన ప్రతి సభ్యులూ అతడూ లేక ఆమె అంతకు ముందు వ్యక్తిగతంగా తాము ఎలాంటి అభిప్రాయం కలిగివున్నప్పటికీ దాంతో నిమిత్తం లేకుండా పార్టీ కేంద్రీకృత ప్రజాస్వామ్య సూత్రానికి కట్టుబడి పార్టీ ఆమోదించిన రాజకీయ పంథా అమలుకు సమిష్టిగా కృషి చేయాలి.

సీపీఐ(ఎం)లో సంక్షోభం, ముఠా తగాదాలు, ఘర్షణలు నెలకొన్నట్టు వస్తున్న నిరాధార, దిక్కుమాలిన ఊహాగానాలను పట్టించుకోనవసరం లేదు. పార్టీలో కేంద్రీకృత క్రమశిక్షణతో కూడిన అంతర్గత ప్రజాస్వామ్య సంప్రదాయాన్ని బలంగా అమలు జరుపుతున్నందుకు సీపీఐ(ఎం) గర్వపడుతున్నది. ఈ సంప్రదాయాన్ని పార్టీ 22వ మహాసభ స్వీకరించి, ముందుకు తీసుకెళ్తుంది. ■



ఆర్. వెంకట్రాములు

మహాజనుల హక్కుల ఉద్యమం టీ-మాస్

తెలంగాణ సామాజిక సంఘాల ఐక్యవేదిక (టీ-మాస్) ఆధ్వర్యంలో ప్రజాసమస్యల పరిష్కారం కోరుతూ పోరాటాలు జరుగుతున్నాయి. దళిత బహుజనుల, ఆదివాసీ, మైదాన గిరిజనుల, మైనార్టీల అభ్యున్నతి, మా ప్రభుత్వాల ధ్యేయం అంటారు పాలకవర్గాలు. కానీ ఈ డెబ్బైఏండ్ల స్వాతంత్ర్యం తరువాత కూడా వీరి జీవితాల్లో మార్పు రాలేదు. వీరి జీవనస్థితి మరింతగా దిగజారుతున్నది. సంపన్నుల ఆదాయాలు ప్రతీ ఏడూ లక్షల కోట్లల్లో పెరుగుతున్నాయి. సామాన్యుల ఆదాయాలు రూపాయల్లో పడిపోతున్నాయి. ఇదీ నేడున్న పరిస్థితి. ఈ వ్యత్యాసంలో మార్పురావాలి. మనుషులను మనుషులుగా చూసే రోజులు రావాలి. కుల దురహంకార హత్యలు, లైంగిక దాడులు, అంటరానితనాన్నీ రూపు మాపాలి. సంపదలో మా వాటా మాకు కావాలని టీ-మాస్ ఆధ్వర్యంలో జనవరి నెల మొత్తం జనం దగ్గరకు వెళ్లి, మహాజనులను కదిలించి ఉద్యమాలు జరిగాయి. తప్పకుండా ఈ ఉద్యమం ఫలప్రదమవుతుందనే ఆకాంక్ష ఉంది.

దేశంలోనే తెలంగాణ రాష్ట్రం, సంపదలో, సంక్షేమ పథకాల అమలులో, పరిపాలనలో ముందుభాగాన ఉందని ముఖ్యమంత్రి కేసీఆర్ మాట్లాడుతున్నారు. అలా ఉంటే మంచిదే. కానీ యిందుకు భిన్నంగా రాష్ట్ర పరిస్థితి ఉంది. తెలంగాణ ఏర్పడిన తర్వాత రాష్ట్రం తెచ్చిన అప్పు ఎంత, వచ్చే ఆదాయం ఎంత? గ్రామాల్లో నెలకొన్న దుర్భర పరిస్థితి మాటేమిటి, రైతులకు గిట్టుబాబు ధర రాక, కూలీలకు పనులులేక, చేసిన పనులకు కూలి డబ్బులు రాక, నిరుద్యోగ యువత ఉద్యోగాలు లేక, సబ్బండ ప్రజలు సమస్యలతో బాధపడుతున్నారు. వీరి హక్కుల కోసం ఉద్యమాలు చేసి ప్రభుత్వానికి విన్నవిద్దామన్నా.. కేసీఆర్ ప్రభుత్వం వినే పరిస్థితి లేదు. ధర్నా చౌకులను ఎత్తేసింది. రాష్ట్ర మొత్తం సెక్షన్ 30, 144 విధించి ప్రజలను నిర్బంధంలో ఉంచింది. ఇదీ కేసీఆర్ పరిపాలనా తీరు. భూస్వాములు ప్రజలకిచ్చిన సీలింగ్ భూములను స్వాధీనం చేసుకుంటున్నారు. కొడంగల్ మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి, మెదక్ జెడ్‌పీటీసీ లావణ్యారెడ్డి, ప్రస్తుత మాజీ ఎమ్మెల్యేలు, ఎంపీలు నల్లు ఇంద్రసేనారెడ్డి, కేశవరావ్, డి శ్రీనివాస్, డేరాబాబాలు భూములను ఆక్రమిస్తున్నారనే ఆరోపణలున్నాయి. భూ చట్టాలను అమలు చేయరు. ముమ్మాటికీ రాష్ట్రంలో దొరల, భూస్వాముల పరిపాలన నడుస్తున్నది. తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి ఆంగీకరించినట్టు 90శాతం ప్రజలు అత్యంత వెనుకబడిన ప్రజలే. వీరు వాటా ప్రకారంగా రిజర్వేషన్లు, ప్రయివేట్‌రంగంలో రిజర్వేషన్లూ రాజ్యాధికారాన్నీ కోరుతున్నారు. పాలక బూర్జువా భూ స్వామ్య ప్రతినిధులు అంత తేలికగా ఇవ్వరు. టీ-మాస్ నాయకత్వంలో పోరాడి సాధించాలి. అన్ని తరగతులూ ఐక్యంకావాలి.

ప్రాజెక్టులూ పరిశ్రమల పేరుతో లక్షలాదిమంది పేదలు, రైతులు నిర్వాసితులు అవుతున్నారు. వీరికి సరిపడినంత పరిహారం రావడం లేదు. 2013 భూ సేకరణ పునరావాస చట్టాన్ని అమలు పర్చకుండా 2017 తెలంగాణ భూ సేకరణ బిల్లును తీసుకొచ్చింది. దీనివల్ల కూలీలు, రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారు. క్షేత్రస్థాయిలో నిర్వాసితులు వారి సమస్యలపై ఆందోళనలు నిర్వహిస్తే ప్రభుత్వం బలప్రయోగం చేస్తున్నది. ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిరసనగా నిర్వాసిత కూలీలు, వృత్తిదారులు, రైతులకు పరిహారం ఇవ్వకుండా ప్రాజెక్టుల పనులు ప్రారంభించరాదని నిలబడి పోరాడి పరిహారాన్ని పొందాలి.

మహిళలకు బతుకమ్మ చీరలు ఇచ్చి సంబరపడమంటున్నారు. స్త్రీనిధి, అభయహస్తం, లోన్స్, ఫించన్స్ ఇవ్వడం లేదు. గ్రామ సంఘాలకు రూ.5లక్షలకు మించి లోన్స్ ఇవ్వరు మహిళలను మీటింగులకు ఉపయోగించుకుంటున్నారు. గాని ప్రతి సంఘానికి వడ్డీలేని రుణం రూ.10లక్షలు ఇవ్వాలి. ఫించన్స్, అన్ని రకాల లోన్స్ ఇవ్వాలి.

జాతీయ గ్రామీణ ఉపాధిహామీ చట్టంలో పని చేస్తున్న 3లక్షల 80వేల మంది మేట్లను తొలగించి, వారి స్థానంలో అధికార పార్టీ అనుచరులను నియమిస్తున్నది. గత ఏడేండ్లుగా మేట్లు చట్టాన్ని నమ్ముకొని పని చేస్తుంటే టీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్ధాక్షిణ్యంగా తొలగిస్తున్నది. ఇప్పటికే నగర పంచాయతీల పేరుతో 2లక్షల మంది కూలీలకు ఉపాధి హామీ లేకుండా చేసింది. మేట్లను కొనసాగించి నెలవారీ జీతం నిర్ణయించాలి.

కనీస వేతనాల చట్టాన్ని పెరుగుతున్న ధరల కనుగుణంగా మార్పు చేయలేదు. వ్యవసాయ పనుల్లో యంత్రాలు రోజు రోజుకు పెరిగి పోతున్నాయి. కూలీలకు పనులు దొరకడం లేదు. కూలీలు గ్రామాల నుండి పట్టణాలకు వలసలు వెళ్ళుతున్నారు. దొరుకుతున్న అరకొర పనులకు కనీస వేతనాలు, 6గంటల పని విధానం అమలు కావడం లేదు. కనీస వేతన చట్టాన్ని రివైజ్ చేసి, గ్రామాల్లో పనులు దొరికే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. టీఆర్‌ఎస్ ప్రభుత్వం నగదు బదిలీని అమలు చేయాలని చూస్తున్నది. దీనివల్ల పేదలకు ఆహార భద్రతకే ప్రమాదం ఏర్పడుతుంది. ఈ విధానాన్ని వ్యతిరేకించాలి.

కౌలు చట్టాన్ని అమలు చేసి గుర్తింపు కార్డులు, రుణాలు, 2006 ఆదివాసి అటవీ హక్కుల చట్టం ప్రకారం పోడు రైతులకు పట్టాలు ఇవ్వాలి. పోడు, కౌలు రైతులకు పట్టాదారుడికి ఇచ్చే పంట పరిహారం రూ.8000 వీరికి కూడా వర్తింప చేయాలి. ఆత్మస్థైర్యంతో సమగ్ర భూ పంపిణీ, భూములను సాధించుకోవడం కోసం పోరాడాలి. 3ఎకరాల భూమిని సాధించాలి. అర్హత కల్గిన ప్రతి ఒక్కరికి ఫించన్స్ ఇవ్వాలి. ఇప్పుడు ఇస్తున్న రూ.1000 అలాగే 1500 కాకుండా రూ.3000 రూ.5000 ఇవ్వాలని పోరాడాలి. ఇందిరమ్మ ఇండ్లు, బాత్‌రూం పెండింగ్ బిల్లులు చెల్లించాలి. ఇంటి స్థలం ఇచ్చి అర్హత కల్గిన పేదలందరికీ డబల్‌బెడ్‌రూం ఇండ్లు ఇవ్వాలి.

సెల్: 8332975548

ఈ కోతికొమ్మచ్చిలాటలేంటీ పవన్..?!

కిరణ్


ముందంతా చీకటి, అసలే దీపం లేదు అని అంటే చీకటిలోనూ బాణాలు సంధించగల అర్జునుడు అనుకున్నారు. కాస్త గ్యాప్‌లోనే మోడీతో మీటింగ్ వేసి, ఆ తర్వాత చంద్రబాబుకూ మద్దతు పలకడంతో కర్ణుడేమో అనుకున్నాం. అమరావతిలో రైతుల తరపున నినదించి, ఆ తర్వాత ప్రత్యేకహోదా కోసం గర్జిస్తే... అమ్మో తెలివైన కృష్ణుడే అనుకున్నాం. ఇప్పుడు అటు చంద్రబాబు, ఇటు కేసీఆర్‌లను పొగుడుతూ తిట్టలేనని చెబుతుంటే కుంభకర్ణుడేమో అనిపిస్తోంది. తన పాత్రేమిటో తానే నిర్వచించుకోలేకపోతున్నాడా..? లేక కేవలం అక్షయపాత్ర కోసమే అడుగులు వేస్తున్నాడా అనేది అర్థం చేసుకోవడానికి ప్రజలు ప్రయత్నిస్తున్నారు. పవన్‌కల్యాణ్ ప్రసంగాలు ఏ శృతిలో వెళుతున్నాయో.. ఏ రాగంలో వస్తున్నాయో రాజకీయ విద్వాంసులకు అర్థం కాక, తీగలు తెంచేసుకుంటున్నారు.

జల్సా సినిమాలో బాస్ ఎంట్రీ సీన్ ఒకటుంటుంది. ఫైట్‌లో తన శిష్యుడు కిందా మీదా పడుతుంటే, వాడిని ఆపి ఒక్కటిస్తాడు. "ఒరేయ్ ఛోటూ, నేను నీకేం చెప్పానురా.. కొడితే ఒక్కదెబ్బకి అవతలోడు పడిపోవాలని చెప్పానా లేదా. మరేంట్రా ఈ కోతికొమ్మచ్చి లాటలు" అంటాడు పవన్. సరిగ్గా ఇదే ప్రశ్న ఆయనకు కూడా వేయాలనిపిస్తోంది. ముందు పార్టీ పెట్టినప్పుడు ఆవేశంగా ప్రసంగించి, అదేంటో అర్థం చేసుకునేలోపే ఎన్‌డీఏలో చేరిపోయారు. విభజించబడిన ఆంధ్రప్రదేశ్ బాగు కోసమేనంటే అందరూ సర్ది చెప్పుకున్నారు. అమరావతిలో రైతుల తరపున గట్టిగా మాట్లాడితే సూపర్ అన్నారు. తీరా ముఖ్యమంత్రితో సమావేశమయ్యాక సలసలా మరిగిన నెత్తురు సల్లబడిపోయింది. ఎక్కడ ఏ సమస్య అయినా తీవ్రరూపం దాల్చి అది బాబుగారి ప్రభుత్వానికి వ్యతిరేకత తెచ్చిపెడుతుందని అనిపిస్తున్న సమయంలో.. టక్కున పవర్‌స్టార్ ఎంటరైపోతున్నాడు. బాధితుల తరపున మాట్లాడి, ప్రభుత్వానికీ ప్రజలకూ మధ్య ఓ సంధానకర్త పాత్ర పోషించేస్తున్నాడు.

అప్పటివరకు స్పందన చూపని సర్కార్, సారు మాట్లాడగానే నిర్ణయాలు చేసేస్తుంది. ఈయన అడిగే ప్రశ్నాపత్రాలు ముందే లీకు చేసి చంద్రబాబుకు పంపిస్తారేమో అనిపించింది చాలాసార్లు. ఉద్దానం అయినా, ఈ మధ్య కాలంలో ఫాతిమా మెడికల్ కాలేజీ విద్యార్థుల వ్యవహారమైనా అన్నీ అలాగే జరిగాయి. అదేమంటే ప్రజాసమస్యలపై పవన్ బాగా స్పందిస్తున్నాడని అభిమానులు చెప్పుకున్నారు. వైసీపీ అధినేత జగన్ పాదయాత్ర మొదలుపెట్టగానే.. కాస్త స్క్రిప్ట్ స్పీడందుకుంది. ఎప్పుడూ జగన్‌పై నోరెత్తని పవన్ విమర్శలు కురిపించేశాడు. వైసీపీ నుంచి ఎదురుదాడి మొదలైంది. చంద్రబాబును ఏమీ అననంటూనే, జగన్‌ను విమర్శించడమే కాదు.. అసలు జగన్ రాకుండా చేయడానికే టీడీపీకి మద్దతిచ్చానని మరో డైలాగు వదిలాడు. దీంతో పవనం ఎటు వీచినా.. గాలి తగిలేది బాబుగారికి, దుమ్ము పడేది ఆయన ప్రత్యర్థుల మీదేనని అర్థమైంది.

కాకినాడలో మీటింగ్ పెట్టినప్పుడు ఇక రాష్ట్రమంతా తిరుగుతా, ప్రత్యేకహోదా ఇవ్వకపోతే ఏం చేస్తానో చూడండీ..! అని బాక్సులు బద్దలయ్యేలా అరిచారు. తర్వాత బాక్సాఫీసు వైపే వెళ్లిపోయారు. ఎందుకో ఏమిటో అర్థం కాలేదు. చంద్రుడు మోడీ చుట్టూ తిరిగితే, ఈ పవనుడు చంద్రుడి చుట్టూ తిరుగుతాడని.. ఆ కక్ష్య తప్పకుండా ఏదైనా మాట్లాడతాడని ఇప్పుడిప్పుడే క్లారిటీ వస్తోంది. ఒక చంద్రుడు చాలడన్నట్టు ఇప్పుడు రెండో చంద్రుడి కక్ష్యలోకి కూడా ప్రవేశించేశాడు. స్టార్టింగ్.. స్టార్టింగ్... సీఎం సాబ్ మస్తు చేస్తున్నాడు.. 24 గంటల కరెంటు రైతులకు ఇస్తున్నాడు.. భేష్ అన్నాడు. ఆ మాట అన్న తర్వాతే తెలంగాణలో యాత్ర ప్రకటించాడు. కేసీఆర్ పర్మిషన్ తీసుకునే వచ్చినట్టు అందరూ అనుకుంటున్నారు.

తెలంగాణలో సమస్యలేమీ లేవన్నట్టు, జై తెలంగాణ నినాదం తనకు బాగా నచ్చిందన్నట్టు



చెప్పుకొచ్చాడు. కొత్త సినిమా వస్తే, పాత సినిమాలు మర్చిపోతారని అనుకున్నట్టున్నాడు. స్మార్ట్ సీఎం అని కేసీఆర్‌ని పొగిడేసి, 'పొగిడితే తప్పేంటీ..?' అని జనాన్ని ప్రశ్నించాడు. కేసీఆర్ బాగానే చేస్తున్నారు.. అయినా ఇంకా ఇన్ని సమస్యలున్నాయి.. వాటి సంగతి కూడా పట్టించుకోవాలని చెబితే జనం సర్దిచెప్పుకునేవారు. కానీ పవన్ స్క్రిప్ట్ అలా లేదు. ఆయన స్క్రీన్‌ప్లే డైరెక్టుగానే ఉంది. ఎక్కడ నెగ్గాలో కాకుండా ఎక్కడ తగ్గాలో మాత్రమే తెలిసినట్టుంది.

ఆడా ఉంటా ఈడా ఉంటా అనేది.. ఆడా, ఈడా ఓట్లు చీల్చడానికేనని, ఇద్దరు చంద్రుల ముద్దుబిడ్డగా ఉండటానికేనని విమర్శలు వినపడుతున్నాయి. జనసేనాని రాజకీయం వేరనీ, మూస రాజకీయాలు ఆయన ఫాలో అవరనీ అభిమానులు సమర్థించుకుంటున్నారు. నిజంగానే పవన్‌కల్యాణ్ రాజకీయం కొత్త చాప్టర్‌లాగే ఉంది. ప్రజాసేవ కోసం పార్టీ పెట్టినోళ్లు ప్రజలకు కావాల్సిన సేవలపై పోరాడతారు. కానీ ఈయన లాబీయింగ్ చేస్తారు. అది చేస్తే పనైపోయేటట్టయితే ఇన్ని పార్టీలెందుకున్నట్టు, ఇన్ని ప్రజాపోరాటాలెందుకు జరిగినట్టు. అధికారంలో ఉన్నవారు సరిగా లేరనిపిస్తే.. మార్పు తేవడం కోసం పార్టీ పెట్టి తానే ప్రత్యామ్నాయం అని చెప్పుకుని ఎన్నికలలో పోటీ చేస్తారు. గెలిస్తే అధికారంలోకి వచ్చి మార్పు ఏమిటో చూపించాలనుకుంటారు. పవర్‌స్టార్‌కి పవర్‌లో ఉన్నోళ్లు బాగానే ఉన్నారు. అయినా ఆయన ఎన్నికల్లో పోటీ చేస్తారు. వాళ్లు బాగున్నప్పుడు జనం వాళ్లకే ఓటేయాలని చెప్పాలి కదా.. మీ పార్టీ కెందుకు ఓట్లు.. దానికి సమాధానం ఎప్పుడో ఇస్తాడు..

మాట మీద నిలబడటం పవన్‌కి అలవాటే లేదనిపిస్తోంది. ప్రత్యేకహోదా కోసం పోరాడతానన్నాడు. వదిలేశాడు. ప్రత్యేక ప్యాకేజీ పాచిపోయిన లడ్డూలన్నాడు. ఆ లడ్డూ సంగతి వదిలేశాడు. రైతుల భూములు తీసుకుంటే ఊరుకోనన్నాడు. భూసేకరణ నోటిఫికేషన్లు ఇచ్చినా సైలెంట్ మోడ్‌లోనే ఉన్నాడు. దక్షిణ భారతానికి అన్యాయం జరుగుతుందని.. ఆత్మగౌరవ సభ చెన్నైలో పెడతానన్నాడు. అదీ మర్చిపోయాడు. ఒకప్పుడు కత్తులు నూరుకున్న చంద్రులిద్దరూ పరస్పరం వెన్నెల కురిపిస్తున్నారు. ప్రజల్లో విద్వేషాలు రగలించి చలి కాచుకున్నవాళ్లు ఇప్పుడు హాయ్.. హాయ్.. అనుకుంటున్నారు. కేసీఆర్‌ని పొగిడితే ఆంధ్రా ప్రజలకు గిట్టదు, చంద్రబాబును పొగిడితే తెలంగాణ ప్రజలకు నచ్చదు. మరి ఈ లాజిక్ ఎలా మిస్సయ్యాడో పవన్‌బాబు అర్థం కావడం లేదు.

సినిమాలకు త్రివిక్రమ్‌ను పెట్టుకుని.. రాజకీయాలకు మాత్రం తిక్క విక్రమ్‌ని ఎవరినో పెట్టుకున్నట్టున్నాడు. అందుకే ఎప్పుడు ఎందుకు ఎలా ప్రవర్తిస్తాడో.. ఏం మాట్లాడతాడో అర్థం కాని పరిస్థితిలో ఉన్నాడు. ఒక్కటి మాత్రం నిజం. ప్రజాసేవ నిస్వార్థంగా చేసే నాయకులకు ఫాలోయింగ్ లేదు. వారు పిలిస్తే పలికే నాథులు లేరు. కానీ పవన్ అంటే ప్రాణమిచ్చే ఫాలోవర్స్ ఉన్నారు. ఏం చెబితే అది చేయడానికి సిద్ధంగా ఉన్న జనసేన ఉంది. సైన్యం సిద్ధంగా ఉన్నా, సేనాని మాత్రం యుద్ధం చేయకుండా బ్రేక్‌డాన్సులేస్తున్నాడు. ఇప్పటికైనా పవన్ తన బలాన్ని ఏంటో గుర్తించి.. తప్పటడుగులు వేయకుండా చీకటిలోనూ దీపం లేకుండా కూడా సరైన అడుగులు వేస్తే నీరాజనాలు అందుకుంటాడు. లేదంటే ప్రజారాజ్యంలో అల్లు అరవింద్ కంటే గొప్ప పేరు తెచ్చుకుంటాను.. అన్నయ్యే నయం అనిపించుకునేలా చేస్తాడో మరి ఆయనిష్టం. కంటికి కనపడని శత్రువుతో బయటికి కనపడని యుద్ధం చేస్తానంటే.. ఓటమి మాత్రమే పలకరిస్తుంది. పవన్‌జీ వీలైతే వీరుడిలా గర్జించు, కుదరకపోతే విమర్శించు.. దయచేసి ప్రజల మనోభావాలను గుర్తించు. ■

ఆస్పత్రి నుంచి మృత్యు ఒడిలోకి..

దక్షిణ కొరియా దవాఖానాలో ఘోర అగ్నిప్రమాదం

- 41 మంది మృతి, 70 మందికి గాయాలు



సియోల్: : దక్షిణకొరియాలోని ఓ ఆస్పత్రిలో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో 41 మంది మృతి చెందారు. 70 మంది తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను దగ్గరలోని మరో ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. 16 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం. మృతుల సంఖ్య పెరిగే అవకాశముంది. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు.

అగ్నిమాపక అధికారి చోయ్ మన్వూ తెలిపిన వివరాల ప్రకారం...దక్షిణ కొరియా రాజధాని సియోల్‌కు 270 కిలోమీటర్ల దూరంలో ఉన్న మిర్యాంగ్ నగరంలోని సెజాంగ్ ఆస్పత్రిలో శుక్రవారం భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఆస్పత్రిలోని అత్యవసర వార్డులో చెలరేగిన మంటలు క్రమక్రమంగా ఆరో అంతస్తుకు దావానలంలా వ్యాపించాయి. ఎమర్జెన్సీ వార్డు నుంచి అకస్మాత్తుగా మంటలు వ్యాపించడం తాము చూసి భయభ్రాంతులకు లోనైనట్టు ప్రత్యక్ష సాక్ష్యులు తెలిపారు. ఘటనాస్థలికి చేరుకున్న అగ్నిమాపక బృందాలు మంటలను ఆర్పేందుకు ప్రయత్నిస్తున్నాయి. అగ్ని ప్రమాదం సంభవించిన ప్రాంతం దట్టమైన పొగతో కమ్ముకుని ఉంది.

అయితే, మొదటి, రెండో అంతస్తుల్లోని ఎక్కువ మంది రోగులే ప్రాణాలు కోల్పోయారని, తీవ్రంగా గాయపడిన కొందరు వైద్యం కోసం మరో ఆస్పత్రికి తరలిస్తున్న మార్గం మధ్యలో మృతిచెందారని అధికారులు వెల్లడించారు. ప్రమాదం జరిగిన సమయంలో ఆస్పత్రిలో దాదాపు 200 మంది వరకు ఉన్నట్టు సమాచారం.

భారీగా మంటలు ఎగిసిపడి పొగ వ్యాపించడంతో చాలా మంది ప్రాణాలు కోల్పోయారు. ఆస్పత్రిని పూర్తిగా ఖాళీ చేసి, రోగులందరినీ బయటకు తీసుకొచ్చినట్టు అధికారులు తెలిపారు. మూడో అంతస్తు ఎమర్జెన్సీ వార్డులో ఉన్న పదిహేను మంది రోగులను వైద్యుల పర్యవేక్షణతో బయటకు తీసుకురావడానికి చాలా సమయం పట్టిందన్నారు.

సెజాంగ్ ఆస్పత్రిలో అగ్ని ప్రమాదం ఘటనపై ఉత్తరకొరియా అధ్యక్షుడు మూన్ జే ఇన్ విచారం వ్యక్తం చేశారు. సమాచారం అందిన వెంటనే అందుబాటులో ఉన్న అధికారులతో అత్యవసర సమావేశం ఏర్పాటుచేశారు. సహాయ కార్యక్రమాలు ముమ్మరం చేయాలని, క్షతగాత్రులకు మెరుగైన చికిత్సను అందజేయాలని ఆదేశించారు. 2008 నాటి సబ్‌వే‌స్టేషన్ అగ్నిప్రమాదం తర్వాత దక్షిణ కొరియాలో చోటుచేసుకున్న ఘోర ప్రమాదం సెజాంగ్ ఆస్పత్రిదే కావడం గమనార్హం. నాటి సబ్‌వే ప్రమాదంలో 192 మంది మృతి చెందారు.

ఇస్లాం వ్యతిరేక వీడియోలను రీట్వీట్

- ట్రంప్ క్షమాపణలు



లండన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ క్షమాపణలు చెప్పారు. ప్రపంచ ఆర్థిక సదస్సు ముగింపు ప్రసంగం ఇచ్చేందుకు ఆయన దావోస్ వెళ్లారు. అక్కడ బ్రిటన్‌కు చెందిన ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ ఇటీవల ముస్లిం వ్యతిరేక వీడియోలను రీట్వీట్ చేసినందుకు గాను క్షమాపణలు కోరారు. వాళ్లు నిజంగా జాత్యాంహకార ప్రజలయితే.. ఆ వీడియోలు రీట్వీట్ చేసినందుకు గాను క్షమాపణలు చెబుతానని ట్రంప్ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. బ్రిటన్ ఫస్ట్ అనే జాతీయవాద గ్రూపు డిప్యూటీ లీడర్ జైడా ఫ్రాన్సెస్ గతేడాది నవంబర్‌లో తన ట్విటర్ ఖాతాలో మూడు వీడియోలను పోస్టు చేశారు. ముస్లిం వలసదారులు ఓ చిన్నారిని చితకబాదడం, వర్జిన్ మేరీ విగ్రహాన్ని ధ్వంసం చేయడం, ఓ టీనేజీ కుర్రాడిని ముస్లిం యువత కొట్టి చంపడం.. ఇవి ఆ మూడు వీడియోల సారాంశాలు. ఆమె చేసిన ఈ వీడియోలను ట్రంప్ తన ట్విటర్ ఖాతా నుంచి రీట్వీట్ చేశారు.అప్పట్లో ఈ విషయం వివాదాస్పదమైంది. అటువంటి వీడియోలను ట్రంప్ తన ట్విటర్ ఖాతాలో రీట్వీట్ చేసి వాటికి ప్రచారం కల్పించడం ఉద్రిక్తతను సృష్టించిందని బ్రిటన్ ప్రధాని థెరిసా మే విమర్శించారు. అనంతరం థెరిసా మే, ట్రంప్ మధ్య వాగ్వివాదం కొనసాగింది. ఈ నేపథ్యంలోనే ట్రంప్ అప్పట్లో తన బ్రిటన్ పర్యటనను వాయిదా వేసుకున్నారు.

సెనెగల్‌లో అరాచకం

- ఐరోపా పర్యాటకులపై లైంగికదాడి

డాకర్ : సెనెగల్‌లో ముగ్గురు ఐరోపా పర్యాటకులపై లైంగికదాడి జరిగింది. స్థానిక అధికారులు తెలిపిన వివరాల ప్రకారం...సెనెగల్ దక్షిణ ప్రాంతంలోని డియౌలవులూ నగరంలో ఐరోపా పర్యాటకులు ప్రయాణిస్తున్న కారును భద్రతా సిబ్బంది దుస్తుల్లో ఉన్న కొందరు వ్యక్తులు అడ్డగించారు. కారులో తనిఖీలు నిర్వహించాలని అందరినీ కిందికి దింపారు. కారులో ప్రయాణిస్తున్నవారి సామానులు, వస్తువులు దోచుకున్నారు. అనంతరం మహిళలపై లైంగికదాడికి పాల్పడి పరారయ్యారు. కేసు నమోదు చేసుకొని ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టినట్టు పోలీస్ అధికారులు తెలిపారు. లైంగిక దాడి బాధితులను వైద్య పరీక్షలకు పంపామని అన్నారు. కాగా, ఈనెల 6న కసామన్స్ ప్రాంతంలో దోపిడి దొంగలు బీభత్సం సృష్టించారు. 14 మంది మహిళలపై లైంగిక దాడికి పాల్పడి హతమార్చారు. ఈ ఘటన జరిగిన అనంతరం ఈ ప్రాంతంలో భారీగా బలగాలు మోహరించాయి. కట్టుదిట్టమైన భద్రతా ప్రమాణాలు పెంపొందించినప్పటికీ లైంగికదాడి ఘటన చోటుచేసుకోవడం పట్ల స్థానిక ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

బద్దలైన మేయాన్ అగ్నిపర్వతం,

- భారీగా ఎగిసిపడుతున్న లావా



లెగజ్పీ : ఫిలిప్పీన్స్‌లో బద్ధలైన అగ్నిపర్వతం స్థానిక ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నది. దీని తీవ్రత కారణంగా ప్రభుత్వం మూడు నెలలపాటు పలుప్రాంతాల్లో అత్యవసర పరిస్థితి విధించింది. దాదాపు 81వేల మంది ఆశ్రయం కోసం ఇతర ప్రాంతాలకు తరలివెళ్లారు. స్థానిక అధికారులు తెలిపిన వివరాల ప్రకారం..ఫిలిప్పీన్స్‌లోని సెంట్రల్ ఆల్బే ప్రావిన్స్‌లోగల మేయాన్ అగ్ని పర్వతం బద్ధలైంది.నాలుగో నెంబర్ ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. దీని ప్రకారం అతి ప్రమాదానికి కొద్ది దూరంలోనే ఉన్నట్టు అర్థం. అందులో నుంచి భారీ ఎత్తున లావా ఎగిసిపడుతోంది. దాని తీవ్రత ఎక్కువగా ఉండటంతో ముందస్తు భద్రతా చర్యల్లో ప్రభుత్వం లీనమైంది. అగ్నిపర్వతం చుట్టుపక్కల నుంచి ఖాళీ చేయించిన వారిని దాదాపు మూడు నెలలపాటు సంరక్షించాల్సిన బాధ్యత తమపైనే ఉందని, అందుకోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆ దేశ విపత్తు నిర్వహణా అధికారులు తెలిపారు. శిబిరాల్లో ఉన్నవారికి ఆహారం అందిస్తున్నామన్నారు. 69 పునరావాస శిబిరాల్లో దాదాపు 80వేలమంది ఉన్నారని అన్నారు.

హెచ్-1బీ వీసాలు పెంచాలి: సెనెట్‌లో బిల్లు



వాషింగ్టన్ : హెచ్-1బీ వీసాదారులను పెంచాలంటూ యూఎస్ సెనెట్‌లో ఇద్దరు సెనెటర్లు ఓ బిల్లును ప్రవేశపెట్టారు. ఒకప్రక్క హెచ్-1బీ వీసాదారుల సంఖ్యను తగ్గించుకోవాలంటూ ట్రంప్ సర్కార్ కసరత్తు ప్రారంభించగా... మరోపక్క ప్రతిభావంతులైన వారి సేవలు అమెరికాకు ముఖ్యమని కొందరు సెనెటర్లు అభిప్రాయపడుతున్నారు. వార్షికంగా మంజూరు చేసే హెచ్-1బీ వీసాలను పెంచాలంటూ ఓ బిల్లును సెనెట్‌లో ప్రవేశపెట్టారు. ఆరిన్ హాచ్, జెఫ్ ఫ్లాక్ అనే సెనెటర్లు 'ది ఇమ్మిగ్రేషన్ ఇన్నోవేషన్ 70(ఐ స్క్వేర్డ్) యాక్ట్ 2018 పేరుతో దీన్ని ప్రవేశపెట్టారు. చట్టబద్ధమైన స్టేటస్‌ను కోల్పోకుండానే హెచ్-1బీ వీసా హోల్డర్స్ తమ ఉద్యోగాన్ని మార్చుకునేలా కూడా ఈ బిల్లు ప్రతిపాదిస్తోంది. మైక్రోసాఫ్ట్, ఫేస్‌బుక్ లాంటి టాప్ అమెరికన్ ఐటీ కంపెనీలు, యూఎస్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఇండస్ట్రీ కౌన్సిల్ లాంటి టాప్ ట్రేడ్ బాడీలు కూడా ఈ బిల్లుకు మద్దతు ఇస్తున్నాయి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అమెరికా పోటీని ఇలానే కొనసాగించడాన్ని ఈ బిల్లు ఎక్కువగా దోహదం చేస్తుందని హాచ్, ఫ్లాక్ తెలిపారు. ఎక్కడైతే అమెరికా శ్రామికుల సంఖ్య తక్కువగా ఉంటుందో అక్కడ పరిశ్రమల కోసం హెచ్-1బీ వీసా అందుబాటులో ఉందని పేర్కొన్నారు. హెచ్-1బీ ప్రోగ్రామ్‌లో సంస్కరణలు.. మోసపూరితాలను తగ్గించి, వర్కర్లను కాపాడుతుందని, ఎక్కువ ప్రతిభావంతులైన వర్కర్లకు గ్రీన్ కార్డు సౌలభ్యాన్ని పెంచుతుందని తెలిపారు.

హెచ్-1బీ వీసాలు, గ్రీన్‌కార్డుల నుంచి వసూలు చేసిన ఫీజులను ఎస్‌టీఈఎం వర్కర్ల శిక్షణ, విద్యను ప్రమోట్ చేయడానికి ఉపయోగించాలని సెనెటర్లు కోరారు. ప్రతిభావంతమైన ఇమ్మిగ్రేషన్, మెరిట్ ఆధారిత ఇమ్మిగ్రేషన్ అని... తమకు ఎక్కువ నైపుణ్యమైన ఇమ్మిగ్రేషన్ సిస్టమ్ కావాలని హాచ్ అభిప్రాయపడ్డారు. వీసా ఫీజులను పెంచడం ద్వారా వచ్చిన మొత్తాన్ని ఎస్‌టీఈఎం విద్యకు, వర్కర్ శిక్షణ కార్యక్రమాలకు 1 బిలియన్ డాలర్ల కొత్త ఫండింగ్‌ను అందించామని చెప్పారు. అన్ని వైపుల నుంచి ఈ బిల్లు గెలుస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు. డిమాండ్‌ను అందిపుచ్చుకోవడానికి హెచ్-1బీ వీసాల సరఫరాకు అనుమతి ఇవ్వాలని ఈ బిల్లు ప్రతిపాదిస్తుందని చెప్పారు.

ఫ్రాన్స్‌లో భారీ వర్షాలు



పారిస్: ఫ్రాన్స్‌లో భారీ వరదలు పోటెత్తాయి. నదులు పొంగిపొర్లుతుండటంతో స్థానిక ప్రజలు ఇబ్బందులుపడుతున్నారు. ప్రధానంగా పారిస్‌లోని సీనె నది ఉధృతంగా ప్రవహిస్తుండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. పారిస్‌లో లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్నవారంతా సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని హెచ్చరించారు. వరదలు సంభవించే అవకాశాలు ఉండడంతో దేశవ్యాప్తంగా 13 విభాగాల సిబ్బందిని అప్రమత్తం చేశారు. కాగా ఇంకా పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తూనే వున్నాయి. తూర్పు, ఉత్తర ప్రాంతాల్లో కూడా ఇలాంటి పరిస్థితులే నెలకొన్నాయి. ఈ శీతాకాలంలో భారీ వర్షాలు కురియడమే ఆకస్మిక వరదలకు కారణమని అధికారులు పేర్కొన్నారు. పారిస్‌లో వర్షాలు సాధారణ స్థాయి కన్నా రెండు రెట్లు ఎక్కువగా కురిశాయి. గురువారం నాటికి సీనె నది నీటిమట్టం 18 అడుగులకు చేరుకుందని, శనివారం నాటికి 20 అడుగులకు చేరుకునే ప్రమాదముందని అధికారులు హెచ్చరిస్తున్నారు.

క్రీడల్లో గెలిస్తే.. ఉద్యోగాలు, ఇండ్లు

- అథ్లెట్లకు ఉ.కొరియా అధ్యక్షుడు కిమ్ బంపర్ ఆఫర్!



ప్యాంగ్యాంగ్ : ఉత్తర కొరియా అథ్లెట్లకు ఆ దేశాధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ బంపర్ ఆఫర్ ప్రకటించారు. ఫిబ్రవరి 9 నుంచి దక్షిణ కొరియాలో శీతాకాల ఒలింపిక్స్ జరగనున్న సంగతి తెలిసిందే. ఈ ఒలింపిక్స్‌లో గెలిచిన ఉత్తర కొరియా అథ్లెట్లకు ఇండ్లు మెర్సిడెస్ బెంజ్ కార్లు, ఉద్యోగాలు బహుమతిగా ఇస్తామని కిమ్ తాజాగా ప్రకటించారు. అయితే బంగారు పతకం గెలిస్తే బెంజ్ కారు, ఓ ఫ్లాట్ బహుమతిగా ఇస్తానన్నారు. సాధారణ పతకాలు గెలిచిన వారికి జ్ఞాపికలతో పాటు క్రీడల నుంచి రిటైర్ అయ్యాక ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించారు.

మిషన్ లక్ష్యానికి గండి

మధ్యలోనే ఆగిన మిషన్ కాకతీయ పనులు

- రెండు, మూడు విడతలు పూర్తవ్వకముందే మళ్లీ ప్రతిపాదనలు
- వర్షాభావంతో అడుగంటుతున్న భూగర్భజలాలు
- పెద్దపల్లి జిల్లాలో దయనీయంగా చెరువుల దుస్థితి



నవతెలంగాణ-పెద్దపల్లి ప్రతినిధి

పెద్దపల్లి జిల్లాలో మిషన్ కాకతీయ పథకం లక్ష్యానికి గండిపడుతున్నది. మొదటి మూడు విడతలు పూర్తయినా ఇసుమంత లక్ష్యం కూడా నెరవేరలేదు. రెండు, మూడు విడతలకు సంబంధించిన చెరువుల పునరుద్ధరణ పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయి. మరోవైపు అధికారులు నాలుగో విడత పనుల కోసం ప్రతిపాదనలు పంపగా..ప్రభుత్వం 150 చెరువుల పునరుద్ధరణకు అనుమతులు మంజూరు చేసింది.

పెద్దపల్లి జిల్లాలో మొత్తం 1185 చెరువులున్నాయి. వాటి పరిధిలో గతంలో 52,381 ఎకరాల ఆయకట్టు ఉండేది. ఈ చెరువులను విడతల వారీగా పునరుద్ధరించి ఒక్కో నియోజకవర్గంలో లక్ష ఎకరాలకు సాగునీరందించాలని మిషన్ కాకతీయ పనులు అమలు చేస్తున్నారు. మొదటి విడత మినహా రెండు, మూడో విడత మిషన్ కాకతీయ పనులు అధ్వానంగా మారాయి. రెండో విడత కింద 235 చెరువుల పనులకు రూ.78.81కోట్ల నిధులు మంజూరయ్యాయి. 158 చెరువులు మాత్రమే పూర్తిచేసి రూ.44.86 కోట్లు ఖర్చు చేశారు. 77 చెరువులు పెండింగ్‌లో ఉన్నాయి. మూడో విడతలో 134 చెరువుల పనులు మొదలు పెట్టగా రూ.47.67 కోట్లు మంజూరయ్యాయి. అందులో 27 చెరువులు మాత్రమే పూర్తిచేసి, కేవలం రూ.7.74 కోట్లు ఖర్చు చేశారు. ఈ రెండు విడత పనులకు ఆలస్యంగా టెండర్లు, అగ్రిమెంట్ చేయడం, అప్పటికే వర్షాలు కురవటంతో మధ్యలోనే పనులు ఆగిపోయాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో నాలుగో విడత చెరువుల పునరుద్ధరణ పనులకు నీటిపారుదల శాఖ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. జిల్లాలో 179 చెరువుల పనులకుగానూ రూ.57.47 కోట్ల ప్రతిపాదనలకు పంపించారు. ప్రభుత్వం నుంచి 150 చెరువులకు అనుమతులు మంజూరయ్యాయి. ఈ పనులకు రూ.12.52 కోట్లు విడుదల చేసింది. ఏప్రిల్ వరకు టెండర్లు పూర్తి చేసి మే నెలలో పనులు చేపట్టేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

ఒక్క ఎకరాకూ నీరందని దుస్థితి

మిషన్ కాకతీయ చెరువుల పునరుద్ధరణతో ఒక్కో నియోజకవర్గానికి లక్ష ఎకరాలకు సాగునీరందించాలని లక్ష్యంగా ఉన్నప్పటికీ జిల్లాలో పనులు పూర్తికాక ఇప్పటివరకు ఎకరానికి కూడా నీరందించలేని పరిస్థితి. మొదటి విడతలో 10,125 ఎకరాల ఆయకట్టుకుగానూ పనులు పూర్తయ్యాక 7,487 ఎకరాలు, రెండో విడతలో 15,232 ఎకరాలకు 10,125 ఎకరాలు, మూడో విడతకు 10,750 ఎకరాలకు 7,170 ఎకరాల ఆయకట్టు పునరుద్ధరణ పనుల ద్వారా పెరిగిందని అధికారులు చెబుతున్నారు. కానీ చెరువుల పనులు పూర్తిస్థాయిలో చేయకపోవడంతో వాటి కిందున్న ఒక్క ఎకరానికీ సాగునీరందట్లేదని రైతులు చెబుతున్నారు. మరోవైపు భూగర్భ జలాలు క్రమంగా అడుగంటి పోతున్నాయి. గత డిసెంబర్ వరకే జిల్లాలో 9.20 మీటర్ల లోతుల్లోకి నీరు పడిపోయింది. జిల్లాలో మొత్తం 1185 చెరువులుండగా, డిసెంబర్ వరకు 40 శాతం నీటి నిల్వ ఉన్న 106 చెరువులు కూడా ప్రస్తుతం ఎండిపోతున్నాయి.

రెండు, మూడో విడత పనులు మే లోపు పూర్తి

రెండో విడత పనులు ప్రారంభం లోనే ఆలస్యమయ్యాయి. మూడో విడతలో టెండర్లు, అగ్రిమెంట్ ఆలస్యంగా జరిగాయి. అప్పటికే వర్షాలు కురవటంతో పనులు ప్రారంభించలేదు. పెండింగ్‌లోని చెరువులన్నింటినీ ఈ ఏడాది మే లోపు పూర్తిచేస్తాం. ఇప్పటి వరకు పూర్తిచేసిన చెరువుల కింద సాగు విస్తీర్ణం పెరిగింది. భూగర్భ జలాలు అడుగంటిపో వడంతో నీరున్న కొన్ని చెరువులు కూడా ఎండి పోతున్నాయి.

- రమేష్‌బాబు,
పెద్దపల్లి ఈఈ.

ఆ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలి

- పద్మ పురస్కారంలో తెలంగాణకు అన్యాయం
- తెలంగాణ గురించి తప్పుగా మాట్లాడిన వారితో దోస్తానా?: టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పొన్నం ప్రభాకర్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పొన్నం

నవతెలంగాణ-కంఠేశ్వర్

మాట్లాడే హక్కును హరించేలా రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టాన్ని వెంటనే వెనక్కు తీసుకోవాలని టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ భవన్‌లో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ప్రభుత్వాన్ని విమర్శిస్తే కోర్టుల అనుమతి తీసుకోకుండా జైలులో పెట్టేందుకు వీలుగా చట్టాన్ని తీసుకురావడమేంటని ప్రశ్నించారు. 'గతంలో ప్రతిపక్షాలను సన్నాసులు, దద్దమ్మలు అన్నావాడివే కదా..' అని సీఎం కేసీఆర్‌ను ఉద్దేశించి అన్నారు. ఈ చట్టంపై ప్రజలు, మేధావులు, ప్రజాసంఘాలతో కలిసి ఉద్యమిస్తామని చెప్పారు. సీఎం కేసీఆర్ సినిమా నటులు నాగార్జున, పవన్‌కల్యాణ్‌లతో స్నేహం పెంచుకుంటున్నారని, తెలంగాణ గురించి తప్పుగా మాట్లాడిన వారితో దోస్తానా ఏంటని ప్రశ్నించారు. ప్రభుత్వం చేసే ప్రజా వ్యతిరేక పనులపై సోషల్ మీడియా, మీడియా ద్వారా విమర్శిస్తామని, ఏం చేస్తారో చూస్తామని సవాల్ విసిరారు. పద్మ పురస్కారాల విషయంలో తెలంగాణకు అన్యాయం జరిగిందని, పురస్కారాలు వచ్చే అర్హత తెలంగాణలో ఎవరికీ లేదా? అని ప్రశ్నించారు. 20 మంది పేర్లు పంపించామని కేసీఆర్ చెప్పడం పచ్చి అబద్ధమని ఆరోపించారు. ఈ విషయంపై కేటీఆర్, కవితలు ఎందుకు మాట్లాడడం లేదని అన్నారు. ఈ సమావేశంలో టీపీసీసీ సభ్యులు మహేష్‌కుమార్ గౌడ్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు తాహెర్ బిన్ హందాన్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగం అమోఘం... నిర్వహణ లోపం

- సమీక్షించుకోవాల్సిన అవసరం ఉంది : సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి. సుదర్శన్‌రెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం అమోఘమని సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి. సుదర్శన్‌రెడ్డి అన్నారు. అయితే రాజ్యాంగం పేర్కొన్న విధంగా వ్యవస్థ పని చేయడం లేదని, నిర్వహణ మొత్తం లోపభూయిష్టంగా ఉన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. గణతంత్ర దినోత్సవ సందర్భంగా ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఎఎల్), ప్రొగ్రెసివ్ ఫోరం సంయుక్త ఆధ్వర్యంలో 'రాజ్యాంగ పరిరక్షణ' అనే అంశంపై శుక్రవారం హైదరాబాద్‌లో సదస్సు నిర్వహించారు.

ఈ సదస్సుకు బొమ్మగాని ప్రభాకర్ అధ్యక్షత వహించారు. ముందుగా సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ రాజ్యాంగం అమలు చేయడంలో ఉన్న లోపాలను సమీక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాజ్యాంగం ప్రమాదంలో పడిందా? లేక పదిలంగానే ఉందా అనే అంశాన్ని పరిశీలించినప్పుడు రాజ్యాంగానికి ఢోకాలేదన్నారు.సౌత్ ఆఫ్రికా తప్పా ఆఫ్రికా దేశాలన్నింటిలోనూ రాజ్యాంగం ఉందన్నారు. వివిధ దేశాలు, వివిధ రకాలుగా రాజ్యాంగాన్ని రూపొందించుకున్నాయని వివరించారు. ప్రసారమాధ్యమాల ఉనికి ప్రశ్నార్థకమైందని ఆవేదన వ్యక్తం చేశారు. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, భావ ప్రకటన స్వేచ్ఛపై చర్చ జరగాలన్నారు.మన దేశానికి స్వాతంత్రం వచ్చినప్పటి స్థితిగతులు, ప్రస్తుత పరిస్థితులు ఏవిధంగా ఉన్నాయి, వృద్ధిరేటులో అత్యంత పేదరికలోఉన్న వారి శాతమెంత? తదితర విషయాలను పు:నపరిశీలించుకోవాల్సిన అవసరం ఉన్నదని చెప్పారు. ఒక వ్యవస్థ మరో వ్యవస్థను నియంత్రించలేదు కానీ అన్ని వ్యవస్థలను రాజ్యాంగం అమలుతీరు చురుగ్గా ఉంటేనే మాత్రం నియంత్రించగలదని తెలిపారు.

భావప్రకటన స్వేచ్ఛకు భంగం వాటిల్లుతుందన్నారు. రాజ్యాంగం మీద ప్రమాణం చేసి, ఉల్లంఘనలకు పాల్పడుతున్నారని చెప్పారు. సభలు, సమావేశాలు నిర్వహించుకునే పరిస్థితి లేకుండా ఎందుకు పోయిందని, నలుగురు వ్యక్తులు కలిసి మాట్లాడుకునే స్వేచ్ఛ ఎందుకు లేకుండా పోయిందని ప్రశ్నించారు. వీక్షణం సంపాదకులు ఎన్. వేణుగోపాల్ రాజ్యాంగానికి ప్రమాదం అంతర్గతంగా వస్తుందా? బాహ్యంగా వస్తుందా అని ఆలోచించుకోవాలన్నారు. రాజ్యాంగం ఏర్పడి అమలైనప్పటి నుంచి 123 సవరణలు జరిగాయని, అందులో తొలి సవరణ భావ ప్రకటన స్వేచ్ఛమీద జరిగిందని, రాజ్యాంగానికి ప్రమాదం అప్పుడే ఏర్పడిందని చెప్పారు. రాజ్యాంగంపై తమకు నమ్మకం లేదని, రాజ్యాంగాన్ని రద్దు చేస్తామని, సంఘపరివార్ సంస్థలు 1949లోనే ప్రకటించాయని గుర్తు చేశారు.

రాజ్యాంగం నిర్మించిన శాసనసభ, న్యాయ వ్యవస్థను పాలక వర్గాలు ధ్వంసం చేసేందుకు కుట్ర చేస్తున్నాయి కనుక రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సి ఉందన్నారు.

మీడియా మొత్తం మాఫియా అయిందని, రాజ్యాంగ మౌలిక పునాదికి ప్రమాదం పొంచి ఉందని, ఆర్టికల్ 38 ధ్వంసం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ సమానత్వమే కాకుండా, ఆర్థిక సామాజిక సమానత్వం వచ్చినప్పుడే రాజ్యాంగం అమలైనట్టు భావించాలంటూ అంబేద్కర్ ఆనాడే చెప్పారని గుర్తు చేశారు.

రాజ్యాంగంలో ఉన్న లొసుగులను సవరించుకోవాల్సిన అవసరం ఉన్నదని సీనియర్ సంపాదకులు సీ. రాఘవాచారి చెప్పారు. ఈ సదస్సులో సీపీఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపీ అజీజ్‌పాషా, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి, పశ్యపద్మ తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా తెప్పోత్సవం, శేషవాహన సేవ

- కొనసాగుతున్న చెర్వుగట్టు బ్రహ్మోత్సవాలు



నవతెలంగాణ-నార్కట్‌పల్లి

నల్లగొండ జిల్లా నార్కట్ పల్లి మండలం చెర్వుగట్టులోని శ్రీపార్వతీ జడల రామ లింగేశ్వరస్వామివార్షిక బ్రహ్మో త్సవాలు వైభవంగా కొనసాగు తున్నాయి. స్వామి వారి కల్యాణం అనంతరం గురు వారం రాత్రి గట్టుపైన పుష్క రణి, తెప్పోత్సవం నిర్వహించారు. ఈ మహోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు లక్షలాదిగా తరలొచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. శుక్రవారం తెల్లవారుజామున స్వామి వారిని శేషవాహనంపై ఉంచి సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, ఆలయ చైర్మెన్ నల్ల వెంకన్న, దేవాలయ సహాయ కమిషనర్ సులోచన, ఈవో సైకం అంజనారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నవచిత్రం

భరత్ ప్రమాణ స్వీకారం !


'భరత్ అనే నేను'లో మహేష్

'శ్రీమంతుడు' తర్వాత మహేష్‌బాబు, కొరటాల శివ కాంబినేషన్‌లో 'భరత్ అనే నేను' సినిమా రూపొందుతున్న విషయం విదితమే. కైరా అద్వాని కథానాయికగా నటిస్తుండగా, డి.పార్వతి సమర్పణలో డి.వి.వి.ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై దానయ్య డి.వి.వి నిర్మిస్తున్నారు. తాజాగా గణతంత్ర దినోత్సవం సందర్భాన్ని పురస్కరించుకుని ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. మహేష్ ప్రమాణ స్వీకారం చేస్తున్న ఆడియోను సైతం రిలీజ్ చేశారు. ఆడియోలో సీఎంగా ప్రమాణ స్వీకారం చేస్తున్నట్టుగా తనదైన స్టయిల్‌లో మహేష్ చెప్పడం హైలైట్‌గా నిలిచింది. ఫస్ట్‌లుక్‌లో మహేష్‌బాబు సూట్‌కేసు పట్టుకుని నడుచుకుంటూ రావడం ఆకట్టుకుంటోంది. ఈ సందర్భంగా దర్శకుడు కొరటాల శివ మాట్లాడుతూ, 'ఆంధ్రప్రదేశ్ విడిపోక ముందు జరిగే ఫిక్షనల్ పొలిటికల్ డ్రామా చిత్రమిది. సినిమా ప్రమోషన్‌కి గణతంత్ర దినోత్సవం మంచి సందర్భం అని మేమంతా భావించాం. అందుకే ఈ చిత్ర ఫస్ట్ ఓత్, ఫస్ట్‌లుక్‌లను విడుదల చేశాం. ఇలాంటి కంటెంట్‌కి వీడియో కంటే ఆడియోను రిలీజ్ చేస్తే మంచి ఇంపాక్ట్ ఉంటుందని మేమంతా భావించాం. అందుకే మహేష్ వాయిస్‌తో ఫస్ట్ ఓత్‌ను విడుదల చేశాం' అని అన్నారు. 'ఈ ఫస్ట్‌లుక్‌కు ట్రెమండస్ రెస్పాన్స్ వస్తోంది. సినిమాకు సంబంధించి రామ్‌లక్ష్మణ్ నేతృత్వంలో క్లైమాక్స్ చిత్రీకరణ జరుగుతోంది. మహేష్, కొరటాల శివ కాంబినేషన్‌లో ఇంత భారీ చిత్రం చేయడం చాలా ఆనందంగా ఉంది. మా బ్యానర్‌లో ఇదొక ప్రతిష్టాత్మక చిత్రమవుతుంది' అని నిర్మాత దానయ్య డి.వి.వి తెలిపారు. ప్రకాష్‌రాజ్, శరత్ కుమార్ ముఖ్య పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: దేవిశ్రీ ప్రసాద్, సినిమాటోగ్రఫీ: రవి కె.చంద్రన్, ఎస్.తిరునవుక్కరసు. ఎడిటర్: శ్రీకర్ ప్రసాద్.

పాట ప్రభంజనం


అల్లు అర్జున్

అల్లు అర్జున్, అను ఇమ్మాన్యుయెల్ జంటగా వక్కంతం వంశీ దర్శకత్వంలో కె.నాగబాబు సమర్పణలో రామలక్ష్మీ సినీ క్రియేషన్స్ పతాకంపై శిరీష శ్రీధర్ నిర్మిస్తున్న చిత్రం 'నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా'. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈ చిత్రంలోని 'ఓ సైనిక' అనే ఫస్ట్ సాంగ్‌ను విడుదల చేశారు. ఈ పాటకు మంచి స్పందన వస్తున్న నేపథ్యంలో గీత రచయిత రామజోగయ్య శాస్త్రి మాట్లాడుతూ, 'గణతంత్ర దినోత్సవం సందర్భంగా విడుదలైన ఈ పాట ప్రభంజనమనే చెప్పాలి. ఈ పాట సరైన సందర్భంగా విడుదల కావడం, ఆ పాటకు మాస్ బీట్ ఉన్న హీరో స్టామినా తోడైతే ఎలా ఉంటుందో అర్థమైంది. బాలీవుడ్ సంగీత దర్శకులు విశాల్ శేఖర్ చాలా సంవత్సరాల తర్వాత తెలుగులో ఈ సినిమాకు మ్యూజిక్ అందించారు. ఇలాంటి పాట రాసే అవకాశం నాకు రావడం చాలా హ్యాపీగా ఉంది. పాటలోని ఒక్కో లైన్ గురించి ట్విట్టర్, ఫేస్‌బుక్‌లో అభిమానులు మాట్లాడుతుండటం, మాకు మెసేజ్‌లు పంపడం ఆనందంగా ఉంది. మంచి పాట వస్తే తెలుగు ప్రేక్షకులు ఎలా అక్కున చేర్చుకుంటారో అర్థమైంది. చంద్రబోస్ అవార్డుల పంట పండినట్టే అన్నారు. అవార్డులు పక్కన పెడితే నాకు వచ్చే ప్రతి మెసేజ్ ఓ అవార్డుతో సమానమే. వక్కంతం వంశీ కథా బలం గొప్పది' అని అన్నారు.

రవితేజను టీజ్ చేశా !


సీరత్ కపూర్

'సాధారణంగా తన ప్రతి సినిమాలో రవితేజ హీరోయిన్లను డామినేట్ చేస్తుంటారు. కానీ దానికి భిన్నంగా 'టచ్ చేసి చూడు'లో నేను రవితేజను డామినేట్ చేస్తాను' అని అంటోంది సీరత్ కపూర్. రవితేజ, రాశీఖన్నా, సీరత్ కపూర్ హీరోహీరోయిన్లుగా విక్రమ్ సిరికొండ దర్శకత్వంలో బేబీ భవ్య సమర్పణలో లక్ష్మీ నరసింహ ప్రొడక్షన్స్ పతాకంపై నల్లమలుపు శ్రీనివాస్(బుజ్జి), వల్లభనేని వంశీ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం 'టచ్ చేసి చూడు'. ఫిబ్రవరి 2న ఈ సినిమా విడుదల కానుంది. శుక్రవారం సీరత్ కపూర్ మీడియాతో మాట్లాడుతూ, 'పోలీస్ నేపథ్యంలో సాగే కథ ఇది. ఇందులో నా పాత్ర భిన్నంగా ఉంటుంది. హీరోని డామినేట్ చేసే పాత్రను పోషించాను. రవితేజ టీజ్ చేస్తుంటాను. రియల్ లైఫ్‌లో ఇలా ఉండను. ఫస్ట్‌టైమ్ ఇలాంటి మాస్ రోల్ చేస్తున్నాను. సినిమాలో నా పాత్ర సెకండాఫ్‌లో వస్తుంది. రాశీఖన్నాతో నాకు సీన్స్ లేవు. ఇద్దరు హీరోయిన్లు ఉండటం నాకు ఇబ్బందేం లేదు. రవితేజ వంటి పెద్ద హీరోతో నటించడం ఆనందంగా ఉంది. సెట్‌లో ఆయన చాలా సింపుల్‌గా, సరదాగా ఉంటారు. అంత పెద్ద హీరో ఇలా ఉండటం మామూలు విషయం కాదు. ఎప్పుడూ ఎనర్జిటిక్‌గా ఉంటూ జీవితాన్ని ఎంజాయ్ చేస్తుంటారాయన. ఇప్పటి వరకు గ్లామర్ పాత్రలు పోషించాను. అగ్ర కథానాయికలకు స్ఫూర్తిగా తీసుకుని ముమ్ముందు నటనకు ప్రాధాన్యత ఉన్న పాత్రలు చేయాలనుకుంటున్నా. ప్రస్తుతం సురేష్ ప్రొడక్షన్‌లో ఓ సినిమా చేస్తున్నా' అని తెలిపింది.


నాగశౌర్య, చిరంజీవి, సాగర్ మహతి, వెంకీ కుడుముల, ఉషా ముల్పూరి, రష్మిక మండన్నా తదితరులు

నాగశౌర్యలో నన్ను నేను చూసుకున్నా


- 'ఛలో' ప్రీ రిలీజ్ వేడుకలో చిరంజీవి

'ఇటీవల రెండు మూడేండ్లుగా పెద్ద హీరోల సినిమాలు ఎంత హిట్ అయ్యాయో, యువ కథానాయకుల సినిమాలు అంతకంటే పెద్ద విజయం సాధించాయి. ఇది చాలా హెల్దీ వాతావరణం' అని అన్నారు చిరంజీవి. నాగశౌర్య, రష్మిక మండన్నా జంటగా వెంకీ కుడుముల దర్శకత్వంలో శంకర్ ప్రసాద్ ముల్పూరి సమర్పణలో ఉషా ముల్పూరి నిర్మిస్తున్న చిత్రం 'ఛలో'. ఈ చిత్ర ప్రీ రిలీజ్ ఫంక్షన్ గురువారం హైదరాబాద్‌లో జరిగింది. అతిథిగా విచ్చేసిన చిరంజీవి మాట్లాడుతూ, 'ఈ ఫంక్షన్‌కి నేను రావడానికి ఓ కారణముంది. కెరీర్ ప్రారంభంలో నా సినిమా వంద రోజుల ఫంక్షన్‌కి నేను అభిమానించే ఓ పెద్ద స్టార్ వస్తే బాగుంటుంది. ఆ ఉత్సాహం, ప్రోత్సాహం వేరు అని అడిగితే ఆయన బిజీగా ఉండి రాలేకపోతున్నాను. ఏమీ అనుకోవద్దు అని చెప్పారు. కానీ ఆయన లేకుండా ఆ ఫంక్షన్ తూ.. తూ.. మంత్రంగా చేసుకున్నాం. ఆ రోజు నాకు చాలా డిజప్పాయింట్‌గా అనిపించింది. ఆ సంఘటన గుర్తుకొచ్చినప్పుడు నాగశౌర్యలో నన్ను నేను చూసుకున్నాను. నన్ను రమ్మని కోరుతున్నాడు అంటే ఆ ఉత్సాహం, ప్రోత్సాహం వేరు కాబట్టి. నాగశౌర్యకి ప్రోత్సాహం ఇవ్వాలి, ఉత్సాహపర్చాలి. అది ఒక ఆర్టిస్ట్‌ని ఎంత మోటివేట్ చేస్తుందనేది నాకు తెలుసు. అలాంటి ఫీలింగ్ నాగశౌర్యకి ఇవ్వాలని వెంటనే వస్తానని చెప్పడంతో అతను చాలా ఆనందించాడు. మా నిహారికతో తను నటించిన సినిమాను టీవీలో చూశా. అందులో శౌర్య హ్యాండ్‌సమ్‌గా, స్పార్క్‌గా ఉన్నాడు. ఇలాంటి హీరోలు ఇండస్ట్రీకి అవసరం. అప్పుడే ఇండస్ట్రీకి ఒక ఫ్రెష్‌నెస్, కొత్త ఉత్సాహం ఉంటుంది. ఒలింపిక్స్‌లో కొత్త ఉత్సాహంతో ఆటగాళ్లు ఎలా పరుగెడతారో అదే రకంగా ఈ పరిశ్రమకి నాగశౌర్య లాంటి కొత్త నటులు కావాలి. కొత్త వారిని అక్కున చేర్చుకునే ఇండస్ట్రీలో మంచి స్థానాన్ని ఇచ్చే గొప్ప మనసున్న ప్రేక్షకులు తెలుగు ఆడియెన్స్. ఈ సినిమా పెద్ద రేంజ్‌లో విజయం సాధించి నాగశౌర్య కెరీర్‌లోనే బెస్ట్ సినిమాగా నిలవాలని కోరుకుంటున్నా. ఈ చిత్ర ట్రైలర్ చూస్తే ఆంధ్ర, తమిళనాడు బోర్డర్‌లో జరిగే ప్రేమ కథా చిత్రంలా కనిపిస్తుంది. సినిమా కోసం ఆతృతగా వెయిట్ చేస్తున్నా. వెంకీ కుడుముల ఒక దర్శకుడిలా కనిపించలేదు, అభిమానుల్లో ఒకడిగా అనిపిస్తున్నాడు. తన ఎమోషన్ చూస్తుంటే నా అభిమాని డైరెక్టర్ అయ్యారనిపిస్తుంది. ఈ చిత్రం అందరినీ అలరించి తమ బ్యానర్‌లో శంకర్ ప్రసాద్, ఉషాలకు మంచి సినిమాగా నిలవాలని కోరుకుంటున్నా' అని అన్నారు.

'ట్రైలర్ చూస్తుంటే సినిమాను దర్శకుడు వెంకీ ఎంత కాన్ఫిడెంట్‌గా తీశారో అర్థమవుతుంది. సాగర్ ఫెంటాస్టిక్ మ్యూజిక్ ఇచ్చాడు. నాగశౌర్య ఇండస్ట్రీలో హీరోగా మంచి స్థానాన్ని సంపాదించుకున్నాడు. నాగశౌర్య లాంటి ఫ్యామిలీ ఉన్నవారందరూ అదృష్టవంతులే' అని వంశీ పైడిపల్లి తెలిపారు. నాగశౌర్య చెబుతూ, 'నేను చాలా చిన్నవాడిని. చిరంజీవి చెయ్యి నా భుజం మీద పడింది. ఇది చాలు నాకు. ఎప్పటికైనా మెగాస్టార్ కుర్చీ మెగాస్టార్‌దే. మళ్ళీ జన్మంటూ ఉంటే మా అమ్మా, నాన్నలకే పుడతాను. మెగాస్టార్ అభిమానిగానే పుడతాను. నన్ను సపోర్ట్ చేయడానికి వచ్చిన చిరంజీవికి థ్యాంక్స్. వెంకీ అద్భుతమైన డైరెక్టర్. రెండేండ్లలో ఆయన పెద్ద దర్శకుడై చిరంజీవితో సినిమా చేయాలని కోరుకుంటున్నా' అని చెప్పారు. 'చిరంజీవి అభిమానుల్లో నేనొకడిని. ఆయన నటించిన ఎన్నో సినిమాలకి కటౌట్‌లు కట్టాను. కానీ ఆయన్ని కలిసే అవకాశం రాలేదు. ఈ ప్రీ రిలీజ్ వేడుకలో కలుస్తానని అస్సలు ఊహించలేదు. అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఉన్న నాకు దర్శకుడిగా ఛాన్స్ ఇచ్చిన ఐరా క్రియేషన్స్ నిర్మాతలకు థ్యాంక్స్. సాయిశ్రీరామ్ వండర్‌ఫుల్ విజువల్స్ ఇచ్చారు. సినిమా ఆకట్టుకోవడం ఖాయం' అని దర్శకుడు వెంకీ కుడుముల తెలిపారు. ఈ కార్యక్రమంలో సి.కళ్యాణ్, శంకర్ ప్రసాద్, ఉషా, రష్మిక మండన్నా, నందిని రెడ్డి, కళ్యాణ్ మాలిక్, ప్రగతి, చిత్ర తదితరులు పాల్గొన్నారు.

కామెడీ ఎంటర్‌టైనర్‌గా జంబలకిడి పంబ

హాస్యనటుడు శ్రీనివాస్‌రెడ్డి హీరోగా 'జంబలకిడి పంబ' చిత్రంలో నటిస్తున్నారు. జె.వి.మురళీకృష్ణ దర్శకత్వం వహిస్తున్నారు. శివమ్ సెల్యు లాయిడ్ అండ్ మెయిన్‌లైన్ ప్రొడక్షన్స్ పతాకాలపై రవి, జోజో జోష్, శ్రీనివాస్‌రెడ్డి ఎన్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. హీరో శ్రీనివాస్‌రెడ్డి కూతురు ఈ సినిమాలో కనిపించనుంది. పుట్టి నెల రోజులైన తన కూతురు తన సినిమాలో కెమెరా ముందు కనిపించడం చాలా థ్రిల్లింగ్‌గా, హ్యాపీగా ఉందని, ఈ సినిమా సూపర్ హిట్ అవుతుందని శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ప్రస్తుతం చిత్ర షూటింగ్ హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో జరుగుతోంది. 'కంప్లీట్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. ఈ ఏడాదిలో బెస్ట్ కామెడీ చిత్రమవుతుంది' అని దర్శకుడు మురళీ కృష్ణ తెలిపారు. పోసాని, వెన్నెల కిశోర్, సత్యం రాజేష్, ధన్‌రాజ్, షకలక శంకర్, హిమజ, రాజ్యలక్ష్మి తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సతీష్ ముత్యాల, ఎడిటర్: తమ్మిరాజు, సంగీతం : గోపీ సుందర్.


తనయతో శ్రీనివాస్‌రెడ్డి

చేతిలోన చెయ్యేసి చెప్పు బావా ప్రారంభం


అంజనా, అరుణ్ రాహుల్

అరుణ్ రాహుల్, అంజనా హీరోహీరోయిన్లుగా కట్ల రాజేంద్రప్రసాద్ దర్శకత్వంలో కె.జె.రాజేష్ నిర్మిస్తున్న చిత్రం 'చేతిలోన చెయ్యేసి చెప్పు బావా'. ఈ చిత్రం శుక్రవారం హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోలో ప్రారంభమైంది. హీరోహీరోయిన్లపై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి సాయివెంకట్ క్లాప్ నిచ్చారు. సుమన్, భానుచందర్ దర్శకుడికి స్క్రిప్ట్ అందించారు. ఈ సందర్భంగా సాయి వెంకట్ మాట్లాడుతూ, 'టైటిల్ చాలా బాగుంది. మంచి కథ, కథనంతో కమిట్‌మెంట్‌తో సినిమా తీస్తే తప్పకుండా విజయం సాధిస్తుంది' అని అన్నారు. 'నిర్మాత రాజేష్ మంచి కథ అందించారు. టైటిల్ బాగుందంటున్నారు. ప్రేమను దక్కించుకోలేని ఓ ప్రేమ జంట మరు జన్మలో తమ ప్రేమను ఎలా దక్కించుకున్నారు. వారి పగను ఎలా తీర్చుకున్నారనే కథాంశంతో రూపొందిస్తున్న చిత్రమిది. ఫిబ్రవరి చివరిలో రెగ్యులర్ షూటింగ్‌ను ప్రారంభించి ఏప్రిల్ వరకు పూర్తి చేస్తాం. సమ్మర్ స్పెషల్‌గా విడుదల చేస్తాం' అని దర్శకుడు రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. హీరో అరుణ్ చెబుతూ, 'గతంలో మలయాళం, తమిళంలో పలు సినిమాలు చేశా. తెలుగులో నాకిది తొలి చిత్రం. ఇక్కడ మంచి హీరోగా గుర్తింపు తెచ్చుకోవాలనుకుంటున్నా. మంచి కథతో వస్తున్న మా ప్రయత్నాన్ని ఆదరించాలి' అని అన్నారు. 'ఈ చిత్రంతో నిర్మాతగా మారాం. కథ కూడా నేనే అందిస్తున్నా' అని నిర్మాత రాజేష్ తెలిపారు. 'ఈ సినిమాతో తెలుగులో హీరోయిన్‌గా పరిచయమవుతున్నందుకు ఆనందంగా ఉంది. హీరోయిన్‌గా నాకిది మంచి గుర్తింపు తెచ్చిపెడుతుందని ఆశిస్తున్నా' అని హీరోయిన్ అంజనా తెలిపారు.

చైనాలో రికార్డు కలెక్షన్లు !

అమీర్ ఖాన్ నటించిన 'సీక్రెట్ సూపర్‌స్టార్' చైనాలో కాసుల వర్షం కురిపిస్తోంది. ఇప్పటి వరకు సుమారు రూ.295కోట్లు కలెక్ట్ చేసిందని బాలీవుడ్ సినీ విశ్లేషకుడు తరణ్ ఆదర్శ్ తెలిపారు. అమీర్ సతీమణి కిరణ్‌రావు నిర్మించిన ఈ చిత్రంలో అమీర్ ఖాన్‌తోపాటు జైరా వసీం ప్రధాన పాత్రల్లో నటించగా, అద్వైత్ చందన్ దర్శకత్వం వహించారు. గతేడాది అక్టోబర్ 17న ఇండియాలో విడుదలై రూ.135కోట్లు వసూలు చేసింది. ఈ సినిమా కేవలం రూ.15కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కడం ఓ విశేషమైతే, ఇప్పటి వరకు ఇది ప్రపంచ వ్యాప్తంగా రూ.450కోట్ల కలెక్షన్లను రాబట్టడం మరో విశేషం.



సరికొత్త సందడికి ఫిబ్రవరి సినిమాలు



సాధారణంగా ఫిబ్రవరి నెలలో సినిమాలు తక్కువగా విడుదలవుతుంటాయి. విద్యార్థులకు పరీక్షలు, ఎలాంటి పండుగలు లేకపోవడం వల్ల ఈ నెలలో సినిమాలను విడుదల చేసేందుకు దర్శకనిర్మాతలు ఆసక్తి చూపరు. కానీ ఈ ఏడాది అందుకు భిన్నమైన పరిస్థితి నెలకొంది. ఈ సంక్రాంతికి, గణతంత్ర దినోత్సవం సందర్భంగా 'జై సింహా', 'అజ్ఞాతవాసి', 'భాగమతి' వంటి పెద్ద సినిమాల రిలీజ్‌లుండటంతో ఇతర చిత్రాలన్నీ తప్పని పరిస్థితుల్లో ఫిబ్రవరికి వెళ్ళాల్సి వచ్చింది. దీంతో దాదాపు పదికిపైగా సినిమాలు ఫిబ్రవరికి క్యూ కట్టాయి. మరి వచ్చే నెలలో విడుదల కాబోతున్న సినిమాల విశేషాలు తెలుసుకుందాం.

అగ్ర హీరోలతోపాటు యువ కథానాయకుల చిత్రాలు కూడా ఫిబ్రవరిలో విడుదల కాబోతున్న సినిమాల జాబితాలో ఉండటం విశేషం. మొదటి వారం(2వ తేదీన) రవితేజ **'టచ్ చేసి చూడు'**, నాగశౌర్య **'ఛలో'** చిత్రాలున్నాయి. విక్రమ్ సిరికొండను దర్శకుడిగా పరిచయం చేస్తూ రవితేజ 'టచ్ చేసి చూడు' లో నటిస్తున్నారు. రాశీఖన్నా, సీరత్ కపూర్ హీరోయిన్లు. నల్లమలపు బుజ్జి, వల్లభనేని వంశీ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇందులో రవితేజ పోలీస్ ఆఫీసర్‌గా మెరవనున్నారు. ఇదే రోజు విడుదలవుతున్న యంగ్ హీరో నాగశౌర్య నటించిన 'ఛలో' చిత్రానికి వెంకీ కుడుముల దర్శకత్వం వహించారు. ఐరా క్రియేషన్స్ పతాకంపై ఉషా ముల్పూరి నిర్మించారు.

ఫిబ్రవరి 9న ఏకంగా నాలుగు పెద్ద సినిమాలు **'గాయత్రి'**, **'తొలిప్రేమ'**, **'ఇంటిలిజెంట్'**, **'కిర్రాక్ పార్టీ'** పోటీపడుతున్నాయి. 'మామ మంచు అల్లుడు కంచు' చిత్రం తర్వాత మోహన్‌బాబు ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'గాయత్రి'. మంచు విష్ణు, శ్రియా, నిఖిలా విమల్, అనసూయ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. మదన్ రామిగాని దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని మోహన్‌బాబు నిర్మిస్తున్నారు. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రాబోతుంది. 'ఖైదీ నెంబర్ 150' తర్వాత వి.వి.వినాయక్ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ఇంటిలిజెంట్'. సాయిధరమ్ తేజ్, లావణ్య త్రిపాఠి జంటగా నటించిన ఈ చిత్రాన్ని సి.కళ్యాణ్ నిర్మించారు. వినాయక్ మార్క్ మాస్ కమర్షియల్ ఎలిమెంట్స్, వినోదం మేళవింపుగా యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిందీ చిత్రం.

అలాగే వరుణ్ తేజ్ నటిస్తున్న 'తొలిప్రేమ' సైతం ఇదే రోజు ప్రేక్షకుల ముందుకు రానుంది. వెంకీ అట్లూరి దర్శకత్వం వహించిన ఈ సినిమాను బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్ నిర్మించారు. కొత్త రకమైన ప్రేమ కథతో ఈ చిత్రం రూపొందుతుంది. పవన్ నటించిన 'తొలిప్రేమ' టైటిల్‌తో వస్తున్న ఈ సినిమాపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. వీటితోపాటు నిఖిల్ హీరోగా రూపొందిన 'కిర్రాక్ పార్టీ' ఇదే రోజు విడుదల కానుంది. కన్నడ చిత్రానికి రీమేక్ ఇది. శరణ్ కొప్పిశెట్టి దర్శకత్వం వహిస్తున్నారు. కాలేజ్ బ్యాక్ డ్రాప్‌లో రొమాంటిక్ కామెడీగా రూపొందుతున్న ఈ సినిమాను రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్నారు. ఇక వాలెంటైన్స్ డే సందర్భంగా ఫిబ్రవరి 14న తరుణ్, ఓవియా జంటగా నటించిన **'ఇది నా లవ్‌స్టోరీ'** చిత్రం విడుదల కానుంది. అలాగే ఫిబ్రవరి 16న **'మనసుకు నచ్చింది'**, **'అ'**, **'రాజరథం'**, **'రచయిత'** చిత్రాలు రిలీజ్ కానున్నాయి. కృష్ణ తనయ ఘట్టమనేని మంజుల దర్శకురాలిగా మారి రూపొందించిన చిత్రం 'మనసుకు నచ్చింది'. సందీప్ కిషన్, అమైరా దస్తూర్ జంటగా నటించారు. ప్యూర్ లవ్ స్టోరీగా ఈ చిత్రం తెరకెక్కింది. నాని నిర్మాతగా మారి రూపొందిస్తున్న చిత్రం 'అ'. నూతన దర్శకుడు ప్రశాంత్ వర్మ దర్శకత్వం వహిస్తున్నారు. కాజల్, నిత్య మీనన్, రెజీనా, అవసరాల శ్రీనివాస్ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. నాని, రవితేజ వాయిస్ ఇస్తున్నారు. ఫాంటసీ నేపథ్యంలో డిఫరెంట్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతుందీ చిత్రం. అనూప్ బండారి రూపొందించిన 'రాజరథం' కూడా ఇదే రోజు విడుదలకు సిద్ధమవుతుంది. 'రచయిత' చిత్రానికి విద్య సాగర్ రాజు దర్శకత్వం వహిస్తున్నారు. ఒక రచయిత ప్రేమకథా నేపథ్యంలో సాగే చిత్రమిది. ఇక మంచు విష్ణు, జి.నాగేశ్వర్‌రెడ్డి కాంబినేషన్‌లో వస్తున్న **'ఆచారి అమెరికా యాత్ర'** సినిమాను ఫిబ్రవరిలోనే రిలీజ్‌కు సన్నాహాలు చేస్తున్నారు. ప్రగ్యా జైశ్వాల్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రాన్ని కీర్తి చౌదరి, కిట్టు నిర్మిస్తున్నారు. కామెడీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కింది. అలాగే **'దండుపాళ్యం 3'**, **'చల్తే చల్తే'** ఫిబ్రవరిలోనే రిలీజ్‌కు రంగం సిద్ధం చేసుకుంటున్నాయి. ఇలా పదికిపైగా సినిమాలతో ఫిబ్రవరి నెలంతా సినిమా పండగ వాతావరణాన్ని, సినిమాల సందడిని తీసుకొస్తుంది.

ప్రజాస్వామ్య విలువలకు పునరంకితమవుదాం

గణతంత్రవేడుకల్లో గవర్నర్

- దేశ నిర్మాణంలో రాష్ట్రానిది కీలక పాత్ర
- జాతీయ సగటు కంటే మిన్నగా 18 శాతం వృద్ధి రేటు
- సంక్షేమానికి ఏటా రూ.40వేల కోట్లు

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

రాష్ట్ర ప్రజలు ప్రజాస్వామ్య విలువలకు పునరంకితమవ్వాలని గవర్నర్ నరసింహన్ పిలుపునిచ్చారు. నూతనంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం అవకాశాలను అనుకూలంగా మలుచుకుంటూ అభివృద్ధి పథంలో దూసుకెళ్తూ దేశ నిర్మాణానికి చేయూత నిస్తున్నదన్నారు. 69వ గణతంత్రదినోత్సవ వేడుకల్లో భాగంగా శుక్రవారం సికిందరాబాద్ లోని పరేడ్ గ్రౌండ్స్‌లో ఆయన జాతీయ పతాకాన్ని ఎగుర వేశారు. ఈ సందర్భంగా గవర్నర్ రాష్ట్ర ప్రభుత్వ ప్రగతి నివేదికను చదివి వినిపించారు.

వృద్ధి రేటులో పరుగు

"జాతీయ సగటు కంటే మిన్నగా 18శాతం వృద్ధి రేటుతో పరుగులు పెడుతున్న తెలంగాణ రాష్ట్రం దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్నది. బంగారు తెలంగాణ సాధనే లక్ష్యంగా ప్రజల ఆకాంక్షలకు అనుకూలంగా పని చేస్తున్నది. నూతనంగా ఏర్పడిన తెలంగాణ అన్ని రంగాల్లోను అభివృద్ధి పథంలో దూసుకు వెళ్లుతున్నది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడకముందు 6,574 మెగావాట్లుగా ఉన్న విద్యుత్ ఉత్పత్తి ప్రస్తుతం 14,845 వేల మెగావాట్లకు చేరుకుంది. త్వరలోనే 28వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తిని సాధించి తెలంగాణ మిగులు విద్యుత్ రాష్ట్రంగా అవతరించబోతుంది. వ్యవసాయరంగానికి ఈ ఏడాది జనవరి నుంచి 23లక్షల పంపు సెట్లకు 24 గంటలు ఉచిత విద్యుత్‌ను సరఫరా చేస్తున్నది.



రూ.40వేల కోట్లతో సంక్షేమ పథకాలు అమలు

పేదలకు అండగా ఉండటం కోసం ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం. ఇందుకుగాను ప్రతి సంవత్సరం రూ.40వేల కోట్లు ఖర్చు పెడుతున్నాం. ఆసరా పేరుతో సుమారు 38లక్షల మంది వృద్ధులతో పాటు వికలాంగులు, బీడీ కార్మికులకు పెన్షన్లు అందిస్తూ చేయూతనిస్తున్నాం. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటు అగ్రకులాల్లోని ఆర్థికంగా వెనుకబడిన యువతుల వివాహాల కోసం కోసం కళ్యాణలక్ష్మి పథకాన్ని అమలు చేస్తున్నాం. గొల్ల, కురుమల కోసం ఇప్పటికే 40 లక్షల గొర్రెలు పంపిణీ చేసాం. ఈ ఏడాది చివరి నాటికి 2.65 లక్షల డబుల్ బెడ్ రూం ఇండ్లను పూర్తి చేసి లబ్దిదారులకు అందజేస్తాం.

వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్

రాష్ట్రం ప్రధానంగా వ్యవసాయం మీద ఆధారపడి ఉన్నందున వచ్చే బడ్జెట్‌లో వ్యవసాయానికి నా ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్‌ను ప్రవేశపెట్టబోతుంది. ఇదివరకే రూ.17వేల కోట్ల రైతు రుణాలను మాఫీ చేయడంతో పాటు, ఇన్‌పుట్ సబ్సిడీ అందిస్తున్నాం. సాగు నీటి ప్రాజెక్టుల కోసం ప్రతి సంవత్సరం రూ.25 వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం. దేవాదుల, బీమా, కల్వకుర్తి, నెట్టంపాడు, కోయిల్ సాగర్ ప్రాజెక్టులు త్వరలోనే అందుబాటులోకి రాబోతున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టును కూడా వీలైనంత త్వరగా అందుబాటులోకి తెస్తున్నామని గవర్నర్ తెలిపారు.

పారిశ్రామిక రంగంలో అద్భుతమైన ప్రగతి

దేశంలోనే రాష్ట్రం పారిశ్రామికరంగంలో అద్భుతమైన ప్రగతి సాధిస్తున్నది. టీఎస్‌ఐపాస్ ద్వారా ఇప్పటి వరకు 6070 పరిశ్రమలకు అనుమతులు ఇచ్చాం. తద్వారా రాష్ట్రానికి రూ. 1,18,000 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. కొత్తగా స్థాపించిన పరిశ్రమల ద్వారా సుమారు 2లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించాం. ఐటీ ఎగుమతుల్లోను 12 శాతం వృద్ధి సాధించాం. ఈ గణతంత్రవేడుకల్లో ముఖ్యమంత్రి కేసీఆర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీసింగ్, స్పీకర్ మధుసూధనాచారి, శాసనమండలి చైర్మెన్ స్వామిగౌడ్, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎంఎల్సీలు, ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

అధికారుకుల ప్రశంసా పత్రాలు అందజేత

గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా పౌర సేవల్లో ప్రతిభ కనబర్చిన ప్రభుత్వాధికారులకు గవర్నర్ ప్రశంసా పత్రాలు అందజేశారు. యాదాద్రి భువనగిరి కలెక్టర్ అనితా రామచంద్రన్, షీ టీమ్స్ ఇంచార్జి స్వాతిలక్రా, ఐఎఫ్ఎస్ అధికారులు ఆర్ శోభ, స్వర్గం శ్రీనివాస్‌వాస్‌తో పాటు టీఎస్ ఐపాస్ కింద సత్వర అనుమతులు ఇచ్చిన అధికారులకు అవార్డులు అందజేశారు.

సీఎం ఘన నివాళులు

గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా ముఖ్యమంత్రి కె చంద్రశేఖరావు సికిందరాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లోని అమరవీరుల స్థూపం వద్ద ఘన నివాళులు అర్పించారు.

మిషన్ భగీరథ గుంతలో పడి కార్మికుడు మృతి

నవతెలంగాణ-జోగిపేట

మిషన్ భగీరథ పైప్‌లైన్ కోసం తీసిన కందకంలో పడి కార్మికుడు మృతిచెందాడు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా ఆందోల్ మండలంలో శుక్రవారం జరిగింది. ఎస్ఐ పరమేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్ రాష్ట్రానికి చెందిన హీరాకుమార్(19) నాలుగు నెలలుగా కాంట్రాక్టర్ శంకర్‌రెడ్డి దగ్గర భగీరథ పనులు చేస్తున్నాడు. తాడ్మనూర్ శివారులో మిషన్ భగీరథ పనుల్లో భాగంగా పైప్‌లైన్ తీశారు. పనులు చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు పైప్‌లైన్ గుంతలో పడటంతో హీరాకుమార్ తలకు తీవ్రగాయాలయ్యాయి. తోటి కార్మికులు అతడిని జోగిపేట ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతను మృతిచెందినట్టు డాక్టర్లు నిర్ధారించారు. కేసు దర్యాప్తులో ఉంది.

దళితవాడకు వెళ్లకుండా హెచ్‌ఎంకు బెదిరింపులు

- జెండావిష్కరణకు అడ్డంకులు సృష్టించిన పెత్తందార్లు
- రేకులపల్లిలో మరోసారి బయటపడిన వివక్ష
- పోలీసుస్టేషన్ వద్ద ధర్నా

నవతెలంగాణ-ధర్పల్లి

అంబేద్కర్ విగ్రహం కోసం ఆత్మగౌరవ పోరాటం చేసి గెలిచిన రేకులపల్లి గ్రామ దళితులకు మరో అవమానం ఎదురైంది. గణతంత్ర వేడుక సాక్షిగా పెత్తందార్లు తమ కులదురహంకారాన్ని ప్రదర్శించారు. దళితవాడలో జెండావిష్కరణకు వెళ్లకుండా ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయున్ని కట్టడి చేసిన వైనం నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండలంలో శుక్రవారం జరిగింది. రేకులపల్లి గ్రామంలో ప్రతియేటా పాఠశాల విద్యార్థులతో గణతంత్ర దినోత్సవం సందర్భంగా దళితవాడ (మాదిగ సంఘం)లో జెండా ఆవిష్కరణ చేస్తారు. అనంతరం మాల సంఘం, యూత్ జెండా, గ్రామ పంచాయతీ, హనుమాన్ మందిరం వద్దగల గాంధీ విగ్రహం ఎదుట, తర్వాత రెడ్డి సంఘం, చివరగా పాఠశాలకు వెళ్లి జెండా ఆవిష్కరణ చేసి మిగతా కార్యక్రమాలు నిర్వహించేవారు. ఈసారి మాత్రం అలా జరగలేదు. కొందరు పాఠశాల ఉపాధ్యాయులను బెదిరించి తమ జెండా ఆవిష్కరణకు రాకుండా చేశారని దళితులు చెబుతున్నారు. ఉదయం 9 గంటల వరకు వేచి ఉన్నప్పటికీ ప్రధానోపాధ్యాయులు రాకపోవడంతో అసలు సంగతి తెలిసి, ఎవరికి వారే జెండాలు ఎగరేశారు. ఐక్యంగా పోరాడి అంబేద్కర్ విగ్రహాన్ని ప్రతిష్టించుకున్నందుకే పెత్తందారులు జీర్ణించుకోలేక ఇలా చేశారంటూ దళితులు ఆరోపిస్తున్నారు. దీంతో బెదిరిం పుల విషయమై శుక్రవారం రాత్రి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సుమారు వంద మందికిపైగా ధర్నా చేపట్టారు. దానిపై సీఐ గ్రామానికి వెళ్లి విచారణ చేపట్టారు. హెచ్‌ఎంను బెదిరించిన కొందరిపై పోలీసులకు ఫిర్యాదు చేశామని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని దళితులు కోరారు.

467 ఎంఆర్‌సీలకు కంప్యూటర్లు

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

రాష్ట్రంలోని 467 మండల విద్యావనరుల కేంద్రాలకు కంప్యూటర్లను పాఠశాల విద్యాశాఖ అందిస్తున్నది. కంప్యూటర్‌తో పాటు స్కానర్, ప్రింటర్స్‌నూ ఇస్తున్నారు. ఈ మేరకు జిల్లా అధికారులకు పాఠశాల విద్యాశాఖ కమిషనరేట్ అధికారులు సమాచారం అందించారు. ఇప్పటివరకు ఎంఆర్‌సీల్లో వివిధ పాఠశాలలకు చెందిన కంప్యూటర్లను వినియోగిస్తున్నారు. అవి పాతవికావడంతో నిత్యం మొరాయించడంతో పాటు పలు సమస్యలు ఎదురవుతున్నాయి. కొత్త కంప్యూటర్లు వస్తుండ టంతో ఆ సమస్య తీరనుంది. అయితే పాత మండలాలకు మాత్రమే వీటిని కేటాయించారు. కొత్త మండలాలకూ వీటిని ఇవ్వకపో వడంతో కొన్ని సమస్యలు తలెత్తే అవకాశం ఉందని సిబ్బంది చెబుతున్నారు.

'ఘన'తంత్రం

నవతెలంగాణ-న్యూఢిల్లీబ్యూరో

భారతదేశ 69వ గణతంత్ర వేడుకలు దేశ రాజధాని ఢిల్లీలో ఘనంగా జరిగాయి. దేశ చరిత్రలో మొట్టమొదటిసారిగా పది ఆసియన్ దేశాల అధినేతలు హాజరైన ఈ వేడుకల్లో... సైనిక బలగాల ప్రదర్శనలు, వివిధ రాష్ట్రాల శకటాలు దేశంలోని భిన్న సంస్కృతిని, సైనిక సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటాయి. ఇక మొట్టమొదటి సారిగా సరిహద్దు భద్రతా దళం మహిళా సైనికులు నిర్వహించిన మోటారు సైకిల్ ప్రదర్శన రాజ్‌పథ్‌లో ఆహూతులను ఆకట్టుకుంది. ఉగ్రదాడులు జరగొచ్చన్న నిఘా వర్గాల హెచ్చరికల నేపథ్యంలో కట్టుదిట్టమైన భద్రత నడుమ వేడుకలు జరిగాయి. నూతన రాష్ట్రపతి రామ్‌నాథ్‌కోవింద్ త్రివిధ దళాల గౌరవ వందనం స్వీకరించారు. అంతకముందు భారతదేశ అత్యున్నత శౌర్య పతకం అశోకచక్ర అవార్డును ఉగ్రదాడుల్లో ప్రాణాలు కోల్పోయిన ఐఎఎఫ్ కమాండో జ్యోతిప్రకాశ్ నరాలా భార్య, తల్లికి రాష్ట్రపతి అందజేశారు. ఇండియా గేట్ వద్ద ఉన్న అమర్ జవాన్ జ్యోతి వద్ద నివాళులు అర్పించి ప్రధానమంత్రి నరేంద్రమోడీ గణతంత్ర వేడుకలను శుక్రవారం ఉదయం ప్రారంభించారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన సైనికులకు ప్రధాని శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం రాజ్‌పథ్‌లోని సభా వేదిక వద్దకు వచ్చిన ప్రధాని... గణతంత్ర వేడుకులకు హాజరైన పది దేశాల అధినేతలకు, రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతికి స్వయంగా సాదర స్వాగతం పలికారు. ఈ వేడుకలకు మయాన్మార్ స్టేట్ కౌన్సెలర్ ఆంగ్‌సన్ సూకీ, వియత్నాం ప్రధాని గుయెన్ జుయన్ ఫుక్, బ్రునాయి సుల్తాన్ హాజీ హస్నల్ బోల్కియా, ఇండోనేషియా అధ్యక్షులు జోకే విడోడో, ఫిలిప్పైన్స్ అధ్యక్షులు రోడ్రిగో దుతెర్తే, కంబోడియా ప్రధాని హున్‌సేన్, మలేషియా ప్రధాని నజీబ్ రజాక్, థాయ్‌లాండ్ పీఎం ప్రయుత్ చాన్-ఓ-చా, లావోస్ పీఎం థొన్‌గ్లోన్ సిసోలిథ్, సింగపూర్ పీఎం లీ సీన్ లుంగ్ తదితరులు హాజరయ్యారు. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ జెండా వందనం చేశారు. సైనిక బలగాల పరేడ్‌కు ముందు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అశోక చక్రా అవార్డును అందజేశారు. ఆసియన్ దేశాల జెండాల ప్రదర్శనతో రాజ్‌పథ్‌లో పరేడ్ ప్రారంభమైంది.

ఆకట్టుకున్న రాష్ట్ర శకటాలు...

గణతంత్ర వేడుకల సందర్భంగా రాజ్‌పథ్‌లో ప్రదర్శించిన వివిధ రాష్ట్రాల, కేంద్ర మంత్రిత్వశాఖల శకటాలు ఆకట్టుకున్నాయి. మేక్‌ఇన్ ఇండియా, ఖేలో ఇండియా, ఆదాయపు పన్ను, గిరిజన మంత్రిత్వశాఖ, ఆలిండియా రేడియో, సరిహద్దు దళాలకు సంబంధించిన శకటాలను మంత్రిత్వశాఖల తరపున ప్రదర్శించారు. చేతివృత్తుల ఇతివృత్తంగా త్రిపుర, రాష్ట్ర సంస్కృతిని ప్రతిబింబిస్తూ కేరళ తమ శకటాలను ప్రదర్శించాయి.



మహిళా సైనికుల ద్విచక్రవాహన స్టంట్‌లు...

మొట్టమొదటిసారిగా మహిళా సైనికులు రాజ్‌పథ్‌లో ద్విచక్రవాహనంపై స్టంట్‌లు నిర్వహించారు. భారత సరిహద్దు దళం 'సీమా భవాని' బృందం ద్విచక్రవాహనంపై స్టంట్‌లు నిర్వహించడం ఆహూతులను ఆకట్టుకుంది. కేంద్రమంత్రులు తమ స్థానాల్లో నిల్చుని చప్పట్లతో అభినందనలు తెలిపారు. 350 సీసీ రాయల్ ఎన్‌ఫీల్డ్ ద్విచక్రవాహనాలపై ఫ్లాగ్ మార్చ్ పిరమిడ్‌తో పాటు వివిధ స్టంటులు నిర్వహించారు. అలాగే ఆర్మీకి చెందిన టీ-90 యుద్ధ ట్యాంకులు, బ్రహ్మోస్ క్షిపిణులు, వెపన్ లోకేటింగ్ రాడార్(స్వాతి) ప్రదర్శించారు. వీటితో పాటు హిందూస్థాన్ ఎయిరోనాటిక్స్ లిమిటెడ్ మొట్టమొదటిసారి రూపొందించిన ఆయుధ వ్యవస్థతో కూడిన హెలికాప్టర్‌ను ప్రదర్శించారు. 90 నిమిషాల పాటు సాగిన ఈ ప్రదర్శనలో చివరన భారత వాయుసేన తేజాస్ తదితర యుద్ధ విమానాల ప్రదర్శన జరి గింది. సుఖోయ్-30 ఎంకేఐ ఎయిర్‌క్రాఫ్టులు గాలిలో త్రిశుల్ ఆకారంలో దూసుకెళ్లాయి. జాతీయ సాహస బాలుర అవా ర్డులు గెలుపొందిన 18 మందిలో 15 మంది చిన్నారులు ఈ పరేడ్‌లో పాలుపంచుకున్నారు.

ప్రధానమంత్రి ప్రోటోకాల్ ఉల్లంఘన...

మోడీ మరోసారి ప్రోటోకాల్ ఉల్లంఘించారు. గణతంత్ర వేడుకలు పూర్తయిన తరువాత అతిథులకు వీడ్కోలు పలికిన ప్రధానమంత్రి.. అనంతరం రాజ్‌పథ్‌లో నడిచారు. పరేడ్‌కు వీక్షించేందుకు వచ్చిన వారికి అభివాదం చేస్తూ ఇండియాగేట్ సమీపం వరకు నడుచుకుంటూ వెళ్లారు.



వికేంద్రీకృత ఎమర్జెన్సీ

మొదటిపేజీ తరువాయి

అన్నారు. ఎమర్జెన్సీ కాలంలో పోరాడిన వ్యక్తులతో నేటి నేతలను పోలిస్తే చాలా తేడా కనిపిస్తుందని అరుణ్‌శౌరీ విశ్లేషించారు. దేశంలోని 100 కోట్ల ప్రజల కోసం పాలకులను ఎంచుకుంటున్న తీరు సరిగ్గా లేదని ఆయన అన్నారు. రాజకీయాల్లోకి సరైన వ్యక్తులు రావడానికి నిర్మాణాత్మక అడుగులు పడాలని ఆయన సూచించారు. చట్టసభల్లోకి వెళ్లాల్సినవారికి కఠినమైన అర్హతలను నిర్దేశించాలని ఆయన సూచించారు.

సీబీఐలో అధికారులు ఎవరు ఉన్నా అది పాలకుల చేతిలో పనిముట్టుగా మారిందని అరుణ్‌శౌరీ స్పష్టం చేశారు. మన్మోహన్‌సింగ్ నేతృత్వంలోని గత యూపీఏ ప్రభుత్వం తనపై సీబీఐ ద్వారా మూడు దర్యాప్తులు జరిపించినా ఏ ఒక్కటీ రుజువు చేయలేకపోయిందని శౌరీ తెలిపారు. ఇప్పుడు మోడీకి చెందిన ఇద్దరు-ముగ్గురు అనుచర బృందానికి అటువంటి సంస్థలను ఉపయోగించుకోవడంలో ఏమాత్రం బెరుకూ, పరిమితులూ లేవని శౌరీ దుయ్యబట్టారు. వరల్డ్ బ్యాంక్ మాజీ ఆర్థికవేత్త అయిన శౌరీ..మోడీ హయాంలో ప్రభుత్వరంగ బ్యాంకుల్లో పేరుకుపోయిన మొండి బకాయిల గురించి ప్రస్తావించారు. గుట్టలుగా పేరుకుపోయిన మొండి బకాయిల వసూళ్లపై దృష్టి సారించకుండా మరింత మూలధనాన్ని ఇవ్వజూపడం అంతులేని నూతిలోకి పోసినట్టేనని అన్నారు. ఈ చర్య స్టాక్ మార్కెట్‌కు లాభాలు చేకూర్చినా మన పొదుపు ఖాతాలకు ప్రమాదకరమని శౌరీ అన్నారు. వ్యవస్థలో భాగమై పాలకుల చేతిలో పనిముట్టుగా మారిందంటూ మీడియాపైనా ఆయన విమర్శలు గుప్పించారు. అందుకు పలు కారణాలున్నాయి. బడా కార్పొరేట్ సంస్థలు మీడియాలోకి ప్రవేశించడంతో వాటి వ్యాపార ప్రయోజనాలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నదని శౌరీ అన్నారు. సంపూర్ణ వాస్తవాలు వెలుగు చూడకపోవడానికి అది ఓ ప్రధాన కారణమని ఆయన అన్నారు. మీడియా ఆలోచనా విధానం మారిందన్నారు. గతంలో ప్రజా సమస్యలపై మీడియా ఆసక్తి చూపేది, ఇప్పుడు డబ్బు సమకూర్చుకోవడంపై దృష్టి సారించిందని ఆయన అన్నారు.

గవర్నర్ తేనీటి విందు

- హాజరైన సీఎం కేసీఆర్
- కాంగ్రెస్ బహిష్కరించినా హాజరైన దానం, రాపోలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని రాజ్‌భవన్‌లో గవర్నర్ నరసింహన్ తేనీటి విందు ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి కేసీఆర్, ఉప ముఖ్యమంత్రులు కడియం శ్రీహరి, మహమూద్ అలీ, మంత్రులు నాయిని నర్సింహారెడ్డి, హరీశ్‌రావు, ఈటల రాజేందర్, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీలు వినోద్, దత్తాత్రేయ హాజరయ్యారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విదేశీ పర్యటనలో ఉన్నందున ఆయన హాజరుకాలేకపోయారని గవర్నర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ పనితీరు, ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి హరీశ్‌రావుపై గవర్నర్ ప్రశంసలు కురిపించి గవర్నర్ పదవికే మచ్చ తెచ్చారంటూ కాంగ్రెస్ నేతలు గవర్నర్ "ఎట్ హోం" కార్యక్రమాన్ని బహిష్కరించారు. అయినా ఆ పార్టీ సీనియర్ నేతలు దానం నాగేందర్, రాపోలు ఆనంద భాస్కర్ ఎంట్ హోం కార్యక్రమానికి హాజరుకావడం గమనార్హం.

చేయిచ్చి...కారెక్కుతారా?

- పార్టీని ధిక్కరించిన దానం, రాపోలు
- వద్దన్నా...'ఎట్ హోం'లో ప్రత్యక్షం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర గవర్నర్ నరసింహన్ గణతంత్రదినోత్సవ వేడుకలను పురస్కరించుకుని రాజ్‌భవన్‌లో నిర్వహించే ఎట్‌హోం కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ బహిష్కరించింది. ఆయన అధికార టీఆర్ఎస్‌కు కొమ్ముకాస్తున్నారన్న కారణంగా ఈ నిర్ణయం తీసుకుంది. ఈ విషయాన్ని పార్టీ బహిరంగంగా ప్రకటించలేదు. కానీ ఆ పార్టీ ముఖ్యమైన నేతలు లీకులిచ్చారు. ఈ విషయాన్ని పార్టీ సీనియర్ నేతలుకు సమాచారం అందించారు. అయినప్పటికీ మాజీ మంత్రి దానం నాగేందర్, ఎంపీ రాపోలు ఆనంద భాస్కర్ గవర్నర్ ఎట్ హోం కార్యక్రమానికి హాజరు కావడంతో పార్టీ నేతల్లో గందరగోళం నెలకొంది. పార్టీ వద్దన్నా కూడా వారు ఎట్ హోంకు హాజరు కావడం, అక్కడ టీఆర్ఎస్ నేతలతో ఎంతో కలివిడిగా ఉండటంతో వారు కాంగ్రెస్ పార్టీకి చేయిచ్చి...కారెక్కుతారనే ప్రచారం జరుగుతున్నది. పార్టీ నిర్ణయాన్ని ధిక్కరించిన దానం, రాపోలు పార్టీ మారుతారనే చర్చ మొదలైంది. ఉదయం గాంధీభవన్‌లో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొని, సాయంత్రం రాజ్‌భవన్ ఎట్ హోం కార్యక్రమానికి హాజరయ్యారు. ఉదయాన్నే ఎట్ హోం కార్యక్రమాన్ని పార్టీ బహిష్కరిస్తున్నట్టు నేతలు తెలిపారు. అయినప్పటికి వారు రాజ్‌భవన్‌కు వెళ్లారని పార్టీ వర్గాలు చెబుతున్నారు.

పార్టీ గీత దాటారని, దీంతో వారు పార్టీలో ఉంటారా? పోతారా? అనే చర్చ జరుగుతున్నది. హైదరాబాద్‌కు చెందిన నేతలు అంటున్నారు. అటువంటి నాయకులపై చర్యలు తీసుకోవాలని చెబుతున్నారు. అధిష్టానం పెద్దలతో సన్నిహితంగా ఉంటున్న దానం...పార్టీ అధ్యక్షుడి మాట కూడా వినడం లేదని విమర్శలు ఉన్నాయి.

ఎట్ హోంకు హాజరైన విషయాన్ని ప్రస్తావించగా ఈ కార్యక్రమాన్ని పార్టీ బహిష్కరించినట్టు తమకు సమాచారం లేదని, ప్రతి ఏడాది వచ్చినట్టుగానే ఈసారి వచ్చామని తెలిపారు. క్రమశిక్షణ కార్యకర్తలమని, పార్టీ మారే ప్రసక్తే లేదని వారు చెప్పారు.

ఎఫ్‌ఆర్‌డీఐతో సొమ్ము మాయం

(మొదటిపేజీ తరువాయి)

కేవలం ప్రభుత్వరంగ బ్యాంకులు, అక్కడి ఉద్యోగులది మాత్రమే కాదని, అసంఖ్యాకమైన డిపాజిటర్లది కూడా అని చెప్పారు. పెద్దనోట్లరద్దు, జీఎస్టీ వంటి చర్యలవల్ల సామాన్య ప్రజలపై ఏ విధంగా భారం పడిందో, ఎఫ్ఆర్‌డీఐ చట్టరూపంలోకి వస్తే తిరిగి అదే ప్రజల పెట్టుబడులపై ప్రభావాన్ని చూపుతుందని స్పష్టం చేశారు. ఆర్థికరంగం, రిటైల్‌రంగ సంస్కరణలను కేంద్రప్రభుత్వం కీలకంగా భావిస్తోందని, ప్రభుత్వరంగాన్ని ధ్వంసం చేయడం, చట్ట సవరణల పేరుతో కార్మికుల హక్కుల్ని కుదించడం, శ్రమదోపిడీకి మార్గం సుగమం చేయడమే లక్ష్యంగా కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం విధానపర నిర్ణయాలను బలవంతంగా ప్రజలపై రుద్దేందుకు ప్రయత్నిస్తోందన్నారు. దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ వాణిజ్య సదస్సులో పెట్టుబడులు పెట్టమని ప్రధాని నరేంద్రమోడీ, ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ దేహీ అని ప్రాధేయపడుతున్నారని విమర్శించారు. వ్యవసాయరంగంలో 2013 నిర్వాసితుల చట్టాన్ని సవరణ చేయడం సాధ్యం కాదని భావించిన కేంద్రం ఆ బాధ్యతల్ని రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించి మరో రూపంలో ప్రజలకు ముప్పు తెచ్చేలా వ్యవహరించిందన్నారు. అయితే ఆర్థికరంగ చట్ట సవరణల్ని కేంద్రప్రభుత్వమే చేపట్టాల్సి ఉన్నందున ఎఫ్ఆర్‌డీఐ బిల్లు ఆమోదానికి త్వరపడుతోందన్నారు. దీనికి వ్యతిరేకంగా బ్యాంకింగ్ ఉద్యోగులతో పాటు దేశ ప్రజానీకాన్ని పోరాటాల్లో భాగస్వామ్యం చేయాలని, అందుకోసం అన్ని రాజకీయపక్షాలను ఏకతాటిపైకి తేవాల్సిన అవసరం ఉన్నదని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో 'బెఫీ' ప్రధాన కార్యదర్శి పి వెంకట్రామయ్య, డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఆర్ అజయ్‌కుమార్, ఆర్‌బీఐ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షులు జి క్రాంతి, యూనియన్ బ్యాంక్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎమ్‌వి మాధవరావు, నాబార్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు కె కైలాష్‌పతి తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు కొవ్వొత్తులు వెలిగించి, ఎఫ్ఆర్‌డీఐ బిల్లును రద్దు చేయాలని, డిపాజిటర్ల సొమ్ముకు రక్షణ కల్పించాలని, ప్రభుత్వరంగ బ్యాంకుల్ని కాపాడాలని వివిధ బ్యాంకుల నుంచి వచ్చిన ఉద్యోగులు పెద్దఎత్తున నినాదాలు చేశారు.

రాజ్యాంగం పరిరక్షిద్దాం

(మొదటిపేజీ తరువాయి)

29న ఢిల్లీలో ఆ పార్టీల అధి నాయకులు భేటీ కానున్నట్టు ఎన్‌సీపీ నేత ప్రకటించారు. బీజేపీకి వ్యతిరేకంగా లెఫ్ట్ పార్టీలు సహా ప్రతిపక్షాలన్నీ ఒక ఉమ్మడి వేదిక మీదకు రానున్నట్టు ఆయన చెప్పారు. రాజ్యాంగంపై దాడి జరుగుతోందని, ఈ నేపథ్యంలో మన వాణి వినిపించకపోతే రాజ్యాంగానికి ముప్పు వాటిల్లే ప్రమాదముందని పవార్ అన్నారు. రాజ్యాంగం హామీ ఇచ్చిన ప్రాథమిక హక్కులపై సైతం దాడి జరుగుతోందని ఆయన విమర్శించారు.

నీట్‌కు ఒకే ప్రశ్నాపత్రం

(మొదటిపేజీ తరువాయి)

ధర్మాసనం.. సీబీఎస్ఈ తీరును తప్పుబట్టింది. వేర్వేరు ప్రశ్నాపత్రాలు తయారు చేయడం లాజికల్ కాదని వెల్లడించింది. ఇదే విషయంపై న్యాయమూర్తులు అరుణ్ మిశ్రా, నజీర్ నేతృత్వంలోని ధర్మాసనం గురువారం విచారణ చేపట్టగా.. ఇక నుంచి ఇంగ్లీషులో రూపొందించిన ప్రశ్నాపత్రాన్ని ఇతర భాషల్లోకి తర్జుమా చేయనున్నట్టు సీబీఎస్ఈ తరపు న్యాయవాది తారాచంద్ శర్మ.. కోర్టుకు విన్నవించారు.

కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యూలరైజ్ చేయాలి

- లెక్చరర్ల సంఘం అధ్యక్షులు దామోదర్‌రెడ్డి

నవతెలంగాణ-అశోక్‌నగర్

కాంట్రాక్టు అధ్యాపకులను వెంటనే రెగ్యూలరైజ్ చేయాలని కాంట్రాక్టు లెక్చరర్ల సంఘం కామారెడ్డి జిల్లా అధ్యక్షులు దామోదర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఈఎస్ఆర్ గార్డెన్‌లో ఆ సంఘం ఆధ్వర్యంలో ముద్రించిన డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...17 ఏండ్ల కాలంలో మొదటిసారిగా డైరీ ఆవిష్కరణ కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టు ఉద్యోగులు కాశయ్య, హలీం, సలాం, సురేశ్, శోభన్, తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన జర్నలిస్టులకు ఇండ్లస్థలాలు ఇవ్వాలి

- హౌజింగ్ కో-ఆర్డినేషన్ కమిటీ తీర్మానం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అర్హులైన జర్నలిస్టులందరికి ఇండ్లస్థలాలు ఇవ్వాలని జర్నలిస్ట్ హౌజింగ్ కో-ఆర్డినేషన్ కమిటీ తీర్మానించింది. శుక్రవారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జర్నలిస్టుల ఇండ్ల స్థలాల విషయమై కమిటీ కన్వీనర్, సాక్షి దినపత్రిక ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ ఆర్.దిలీప్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం జరిగింది. కో-ఆర్డినేటషన్ కమిటి ఏర్పాటు ఉద్దేశ్యాలు, లక్ష్యాల గురించి చర్చించారు. ఈ వత్తిలో పని చేస్తున్న జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వాల్సిన అవసరం ఉండటం, అది గుర్తించిన రాష్ట్ర ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు సానుకూలంగా మాట్లాడుతూ పలు సందర్భాల్లో ఇస్తామని ప్రకటించటం కమిటి కార్యాచరణకు సానుకూల అంశంగా ఏకాభిప్రాయం వ్యక్తమైంది. ఈ విషయంలో ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపింది. కో-ఆర్డినేషన్ కమిటీ సభ్యులంతా ఆయా విషయాలపై చర్చించిన అనంతరం పలు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. అర్హులైన జర్నలిస్టులు అందరికి ఇళ్ళ స్థలాలు ఇచ్చేలా క షి చేయాలని కమిటీ నిర్ణయించింది. హౌజింగ్ సొసైటీలు ఎన్ని ఉన్నా, వాటికి అతీతంగా అర్హులైన జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని, జవహర్‌లాల్ నెహ్రు సొసైటీకి సంబంధించి న్యాయస్థానంలో ఉన్న వివాదం సత్వరం పరిష్కారమయ్యేలా ప్రభుత్వం చొరవ చూపి సభ్యులకు న్యాయం చేయాలని తీర్మానించింది. జర్నలిస్ట్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ అధీనంలో ఉన్న 9.14 ఎకరాల భూమిని సదరు సొసైటీకి ప్రభుత్వం అప్పగించాలని విజ్ఞప్తి చేసింది. ఇండ్లస్థలాల విషయంలో సుప్రీంకోర్టులో ఉన్న వివాదానికి సంబంధించి ఇద్దరు న్యాయవాదులతో చర్చించారు. సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఈ సమవేశంలో కమిటీ కో-కన్వీనర్లు, తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విరాహత్ అలీ, జర్నలిస్ట్ కో-ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షులు వెంకటాచారి, హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు రాజమౌళిచారి, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.బసవపున్నయ్య, కో-ఆర్డినేటర్లు విజయ్‌కుమార్‌రెడ్డి, ఎం.ఎస్ హష్మీ, మీడియా కో-ఆర్డినేటర్ ఎం.సోమయ్య, సలహాదారులు కె.రంగయ్య, వేణుగోపాలరావు, సభ్యులు రేహానా, గుడిగ రఘు తదితరులు పాల్గొన్నారు.

'వాకో' కిక్ బాక్సింగ్ పోటీలు ప్రారంభం

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

వరల్డ్ అసోసియేషన్ ఆఫ్ కిక్ బాక్సింగ్ చాంపియన్‌షిప్(వాకో)-2018 పోటీలు హైదరాబాద్‌లో ప్రారంభమయ్యాయి. తెలంగాణ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎల్‌బీస్టేడియంలో జరుగుతున్న ఈ పోటీలను శుక్రవారం సాట్స్ చైర్మెన్ అల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. పోటీలు ఈనెల 28 వరకూ కొనసాగుతాయి. ఈ పోటీల్లో 19 రాష్ట్రాలకు చెందిన సుమారు 800 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారు. వాకో ఇండియన్ అధ్యక్షులు ఆల్బర్ట్ లిమ్, తెలంగాణ అసోసియేషన్ అధ్యక్షులు సమ్యద్ అక్రమ్ ఉల్లా పాల్గొన్నారు.

శిక్షణా శిబిరాల సందర్శన : గచ్చిబౌలి స్టేడియంలో జరుగుతున్న అథ్లెటిక్స్, స్విమ్మింగ్, బాస్కెట్‌బాల్ శిక్షణా శిబిరాలను తెలంగాణ సాట్స్ చైర్మెన్ వెంకటేశ్వర్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా క్రీడాకారులతో మాట్లాడి, శిక్షణకు సంబంధించిన వివరాలు తెలుసుకున్నారు. ఢిల్లీలో ఈనెల 31 నుంచి ఫిబ్రవరి 8 వరకు న్యూఢిల్లీలో జరిగే 'ఖేలో ఇండియా' పోటీలకు వీరంతా సన్నద్ధమవుతున్నారు.

పేరోల్ లేక పరేషాన్

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నారు. వీరంతా రాష్ట్రంలో సుమారు 450 మంది వరకూ పనిచేస్తున్నారు.

వేతనాలు రావాలంటే..

మండలాలు, సెక్టోరల్ పరిధిలో పనిచేసే ఉద్యోగులకు ప్రతినెలా 28 వరకు వేతనాల ఫైల్స్‌ను ఎస్ఎస్ఏ జిల్లా కేంద్రం నుంచి రాష్ట్ర కేంద్రానికి పంపిస్తున్నారు. దీంతో వారికి ప్రతినెలా 1, 2 తేదీల్లో వేతనాలు అందుతున్నాయి. కానీ వీరిందరి వేతనాలను సకాలంలో అందించేందుకు తోడ్పతున్న డీపీఓ ఆఫీస్‌లో పనిచేసే వారికి మాత్రం ప్రతినెలా వేతన తిప్పలు తప్పడం లేదు. వీరి వేతనాల ఫైల్స్‌ను ఆ సెక్షన్ అధికారులు, ఇష్టమైనప్పుడు డీఈఓలకు, కలెక్టర్‌కు పంపుతు న్నారు. కలెక్టర్లు ఎప్పుడు ఆమోదం తెలిపితే.. అప్పుడు వీరికి వేతనాలు అందనున్నాయి. డీఈఓలకు కోపం వచ్చినా, కలెక్టర్లకు కోపం వచ్చినా కాంట్రాక్టు ఉద్యోగులకు మరింత తిప్పలు వచ్చిపడుతున్నాయి. హైదరాబాద్ జిల్లాలో ప్రత్యేక పరిస్థితులు నెలకొన్నాయి. ముందు వేతనాల ఫైల్‌నోట్ కలెక్టర్‌కు పంపిన తర్వాత, దాన్ని కలెక్టర్ ఆమోదం తెలిపితే, వేతనాల చెక్‌పై సంతకాల కోసం మరో సారి కలెక్టరేట్‌కు వెళ్లాల్సి వస్తుంది. ఈ ప్రాసెస్‌కు దాదాపు 15 నుంచి 20 రోజుల సమయం పడు తుంది. ఎక్కడైనా ఫైల్ ఆగితే ఇక అంతే. చాలీ చాల ని వేత నాలతో జీవితాలను నెట్టుకొస్తున్న సగ టు కాంట్రాక్టు ఉద్యోగులు ఈ విధానం మరింత ఇబ్బందిగా మారింది.

ఔట్‌సోర్సింగ్ పేరుతో...

డీపీఓల్లో పనిచేసే వారిలో హైదరాబాద్, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లోని ఉద్యోగులు ఔట్‌సోర్సింగ్ విధానంలో, మిగిలిన వారంతా కాంట్రాక్టు విధానంలో పనిచేస్తున్నారు. గతంలో 'పేరోల్' వెబ్‌సైట్‌లో డీపీఓ ఉద్యోగుల పేర్లు నమోదు చేశారు. కానీ ఈ మూడు జిల్లాల్లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులన్నారనే పేరుతో, అన్ని జిల్లాల్లోనూ పాత విధానాన్ని కొనసాగిస్తున్నారు. గతంలో ఔట్‌సోర్సింగ్ విధానం మార్చేయాలని ఉద్యోగులందరినీ ఒకే గొడుగు కిందికి తీసుకురావాలని విద్యాశాఖ నిర్ణయించినా, అది కాగితాలకే పరిమితమైంది.

ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, ఈ సమస్యను పరిష్కరించాలని ఉద్యోగులు కోరుతున్నారు.

పేరోల్ పరిధిలోకి తేవాలి: ఓ కాంట్రాక్టు ఉద్యోగి

డీపీఓ ఆఫీసుల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుందరినీ 'పేరోల్' వెబ్‌సైట్ పరిధిలోకి తీసుకురావాలి.

మండల, పాఠశాల స్థాయిల్లో పనిచే సే వారికీ నెలనెలా వేతనాలు వస్తున్నాయి. కానీ వారి వేతనాలను రాష్ట్ర ఆఫీసుకు పంపించ డంలో కీలకపాత్ర పోషిస్తున్న మాకు మాత్రం రెండు, మూడు నెలలకోసారి వేతనాలు అందుతు న్నాయి. కొద్దిమంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు న్నారనే కారణంతో, అందరినీ ఇబ్బందులకు గురిచేయడం సరికాదు. ఉన్నతాధికారులు ఈ సమస్యపై వెంటనే

సెన్సెక్స్ ▼111	నిఫ్టీ ▼16	డాలరుకు రూపాయి విలువ	బంగారం(10.గ్రా)	వెండి (కేజీ)
36,050	11,070	63.54	రూ. 31,251	రూ. 42,200

గురువారం స్టాక్ మార్కెట్లు ముగిసే సమయానికి

సీపీఐ(ఎం)లోనే ప్రజాస్వామ్యం

- విభేదాలు కార్పొరేట్ మీడియా దుష్ప్రచారం
- బడాబాబుల అప్పులు రికవరీ చేయాలి
- బీజేపీ పాలిత రాష్ట్రాల్లో రైతాంగ ఉద్యమాలు
- కాంగ్రెస్, బీజేపీలకు ప్రత్యామ్నాయ ఎజెండా
- త్రిపురలో మరోసారి లెఫ్ట్ కూటమిదే గెలుపు
- చీఫ్ జస్టిస్ అభిశంసనపై 29న నిర్ణయం : సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి



బయ్యు దామోదర్

'సీపీఐ(ఎం)లోనే ప్రజాస్వామ్యం ఉంది. మా పార్టీలో అనేక అంశాలపై చర్చిస్తాం. మెజార్టీ అభిప్రాయాన్నే పార్టీ నిర్ణయిస్తూ ఉంటుంది. దీన్ని మీడియా గుర్తించాలి. పాలకవర్గ దోపిడీ పార్టీలు కాంగ్రెస్, బీజేపీలు.. ఈ దేశంలో చేసే దోపిడీకి ప్రతినిధులుగా ఈ పార్టీలు మారాయి. బీజేపీ మాత్రం మతోన్మాద రాజకీయాలను చేస్తూ దేశంలో గందరగోళ వాతావారణాన్ని సృష్టిస్తోంది. కాంగ్రెస్‌తో పొత్తు అంశం మా పార్టీలో చర్చకు రాలేదు. కానీ ఓ వర్గపు మీడియా దుష్ప్రచారానికి దిగింది. రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. యువతకు ఉద్యోగాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇవేమీ పట్టించుకోకుండా సీపీఐ(ఎం)పై అనవసరమైన వార్తలను సృష్టిస్తున్నారు. వాస్తవాలను గ్రహిస్తే బాగుంటుంది. త్రిపురలో మరోసారి లెఫ్ట్ కూటమి అధికారంలోకి రానుంది. సుప్రీంకోర్టులోని న్యాయమూర్తుల మధ్య జరుగుతున్న వివాదంపై, చీఫ్ జస్టిస్ అభిశంసనంపై 29న ప్రారంభమయ్యే పార్లమెంట్ సమావేశాల్లో అన్ని పార్టీలతో కలిసి నిర్ణయం తీసుకుంటాం.' అని సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అన్నారు. హైదరాబాద్ నేషనల్ బుక్ ఫెయిర్‌ను గురువారం సందర్శించిన ఆయన నవతెలంగాణ ప్రతినిధితో మాట్లాడారు.

'రీక్లైమింగ్ ఐడియా ఆఫ్ ఇండియా' పుస్తకంలోని ప్రధాన అంశాలు..?

11ఏండ్లు తాను హిందుస్తాన్ టైమ్స్‌కు రాసిన వ్యాసాలతో ఇప్పటికే మొదటి భాగాన్ని ప్రజాశక్తి బుక్ హౌస్ ఆధ్వర్యంలో లెఫ్ట్ హ్యాండ్ డ్రైవ్' అనే పుస్తకాన్ని తీసుకొచ్చారు. రెండో భాగాన్ని నవతెలంగాణ పబ్లిషింగ్ హౌస్ 'రీక్లైమింగ్ ఐడియా ఆఫ్ ఇండియా'గా తీసుకొచ్చింది. ఇందులో యూపీఏ ప్రభుత్వం అవలంభించిన విధానాలు, విధించిన భారాలు, ప్రజల్లో పెరిగిన అసంతృప్తులు, దాన్ని ఆధారంగా బీజేపీ ప్రభుత్వ అధికారంలోకి రావడం, ప్రస్తుతం బీజేపీ, ఆర్ఎస్ఎస్ అవలంభిస్తున్న విధానాలపై అనేక అంశాలు ఈ పుస్తకంలో ఉన్నాయి. ప్రస్తుత పరిస్థితులను అర్థం చేసుకోవడానికి ఈ పుస్తకం ఉపయోగపడుతుంది.

కార్పొరేట్ సంస్థలు బ్యాంకులకు ఎగ్గొడుతున్న డబ్బులపై పార్లమెంట్‌లో చర్చిస్తారా..?

కార్పొరేట్ సంస్థలు తీసుకున్న అప్పులను రికవరీ చేయాలని ఇప్పటికే పలుమార్లు పార్లమెంట్‌లో డిమాండ్ చేశాం. లేకుంటే ఆ సంస్థల ఆస్తులను జప్తు చేయాలన్నాం. కార్పొరేట్ సంస్థలు బ్యాంకుల దగ్గర తీసుకున్న అప్పులు సుమారు వడ్డీతో కలుపుకుంటే 11 లక్షల కోట్ల రూపాయలున్నాయి. ఆ డబ్బును వెనక్కి బ్యాంకులకు తీసుకొస్తే దేశంలో డబ్బులకు కొదవే ఉండదు. ఈ డబ్బులను మౌలిక వసతుల అభివృద్ధికి వాడితే ఉద్యోగుల వేతనాలు పెరుగుతాయి. నిరుద్యోగ సమస్య తీరుతుంది. నిలకడమైన ఆర్థికాభివృద్ధి పెరుగుతుంది. ఇదీ సాధ్యం. ఈ పని ప్రభుత్వం చేయట్లేదు. అశ్రిత పెట్టుబడిదారి విధానం మరింత ఎక్కువైంది. ఏడుగురు పారిశ్రామికవేత్తలు పెద్దఎత్తున బ్యాంకులకు అప్పులను ఎగ్గొడుతున్నారు. వారిపై చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం వెనుకడుగేస్తోంది. వారితో కలిసే ప్రభుత్వం వెళ్తుంది. కార్పొరేట్ సంస్థలు బ్యాంకులకు ఎగ్గొడుతున్న డబ్బులపై పటిష్టమైన చట్టం చేయాలని రాజ్యసభలో డిమాండ్ చేశాం. కానీ ప్రభుత్వం అంగీకరించడం లేదు.

రైతు సమస్యలపై చేస్తున్న ఉద్యమాలు..?

రైతులకు పండించిన పంటకు సరైన ఆదాయం రావాలి. బతుకుదెరువు ఉండాలి... తాను ప్రధానినైతే రైతులకు పండించిన పంటకు గిట్టుబాటు ధర దొరుకుతుందని మోడీనే వాగ్దానం చేశారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించకపోవడం వల్ల రైతులు పంటలు పండిస్తే ఖర్చులే మిగులుతున్నాయి. దాంతో రైతు అప్పుల పాలవుతున్నారు. దీనికి పరిష్కారమేమిటీ..? మోడీ చేసిన వాగ్దానాన్ని అమలు చేయాలి. గిట్టుబాటు ధరను రైతులకు నిర్ణయించాలి. అందుకు కొత్త చట్టం తీసుకురావాలి. కానీ ప్రస్తుత పరిస్థితేందీ..? మార్కెట్‌కు రైతు ధాన్యం తీసుకెళ్తే గిట్టుబాటు దొరకడం లేదు. దీంతో రుణభారంతో రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారు. దేశవ్యాప్తంగా పెద్దఎత్తున రైతు ఉద్యమాలు పెరిగాయి. వామపక్షాల కిసాన్ సంఘాలు, మేధాపాట్కర్‌తో కలిసి ఐక్య ఉద్యమాలవుతున్నాయి. మహారాష్ట్ర, గుజరాత్, మధ్యప్రదేశ్, యూపీ, రాజస్థాన్‌లలో రైతు ఉద్యమాలవుతున్నాయి.

బీజేపీ అనుసరిస్తున్న కాషాయీకరణ విధానాలను ఎదుర్కోవడానికి 2019లో ఎలాంటి ఐక్య సంఘటనను కూడగడుతున్నారు..?

దీన్ని ఆపాలంటే ఏదో పదిమంది కలిస్తే అవుతుందనుకుంటే పెద్ద భ్రమ. దీన్ని ఆపాలంటే ప్రత్యామ్నాయ విధానాలు అవసరం. ఈ విధానాలకు ఆధారపడి ఎవరు వస్తారో.. అనే దానిపై ఉంటుంది. రాజకీయాలు లెక్కలు కాదు. రెండు రెండు కలిస్తే నాలుగు అనేది రాజకీయాల్లో జరగదు. రాజకీయాల్లో 22 కావచ్చు. జీరో కావచ్చు. అందుకోసమే విధానమనేది ముఖ్యం. దేశ్ కో నేత నహీ..! దేశ్ కో నీతి చాహి హే..!(దేశానికి నాయకులు కాదు..విధానాలు కావాలి) ఎన్నికలకు ఇంకా సమయం ఉంది. చర్చలు జరుగుతాయి.

సీపీఐ(ఎం)లో విభేదాలున్నాయని మీడియాలో, సోషల్ మీడియా దుష్ప్రచారమవ్వడంపై..!

మా పార్టీలో ఉన్న అంతర్గత ప్రజాస్వామిక విధానం చాలామందికి అర్థం కాదు. ఇక మీడియాకు తెలిసిందే..! రాజకీయ పార్టీ అంటే హైకమాండ్ అనే భ్రమలోనే పలు మీడియా సంస్థలున్నాయి. ప్రజాస్వామ్య రాజకీయాల గురించి అర్థమవదు. మా పార్టీలో పలు సమస్యలపై అనేక చర్చలు జరుగుతాయి. దాని ఆధారంగా మెజార్టీ అభిప్రాయానికి మా పార్టీ కట్టుబడి ఉంటుంది. అది మా పద్ధతి. అది మా పార్టీలోనే ఉంది. ఈ పద్ధతికే మీడియా అలవాటు పడాలి. ఇది దేశానికి మంచిది.

త్రిపుర ఎన్నికలు ఏ విధంగా ఉండబోతున్నాయి..?


త్రిపుర ఎన్నికల్లో బీజేపీ పూర్తిగా అధికార దుర్వినియోగం చేస్తోంది. గతంలో కాంగ్రెస్ ఏవిధంగా వ్యవహరించిందో.. ఇప్పుడు బీజేపీ అదే అనుసరిస్తోంది. లెఫ్ట్ వ్యతిరేక శక్తులన్నింటినీ కూడగడుతున్నది. లెఫ్ట్‌ను ఓడించేందుకు ప్రయత్నం చేస్తున్నారు. ఆ ప్రయత్నాలేవి సాధ్యం కాదు. మరోసారి లెఫ్ట్ కూటమి అధికారంలోకి రానుంది.

2019లో ఎజెండా ఏంటి?

2019 ఎజెండా ముఖ్యంగా ప్రత్యామ్నాయ విధానాలు, ప్రజానుకూలంగా దేశ ఐక్యత, సమైక్యతను కాపాడే ప్రత్యామ్నాయ విధానాల గెలుపునకు కృషి చేస్తాం.

బ్యాంకుల మూలధనీకరణ

18 ప్రభుత్వ బ్యాంకులు 'స్థిరం'



• నెగటివ్ రేటింగ్‌ను సవరించిన క్రిసిల్ • సర్కారు దన్నుతో విత్త సంస్థలకు మేలని వ్యాఖ్య

న్యూఢిల్లీ: దేశంలో బ్యాంకింగ్ వ్యవస్థను బలోపేతం చేసేందుకు గాను సర్కారు ఇటీవల రూ.88,139 కోట్ల మూలధనీకరణ సాయం ప్రకటించిన నేపథ్యంలో క్రిసిల్ 18 ప్రభుత్వ రంగ బ్యాంకుల రేటింగ్స్‌ను సవరించింది. ఈ బ్యాంకుల రేటింగ్స్‌ను 'నెగటివ్' నుంచి 'స్టెబుల్'కు మార్చింది. సర్కారు సాయం నేపథ్యం ఆయా బ్యాంకుల ఆస్తిఅప్పుల పట్టిక బలోపేతం కావడంతో పాటు కీలక మూలధనం పెరిగేందుకు దోహదం చేస్తుందని క్రిసిల్ పేర్కొంది. సర్కారు దన్నుతో అలహాబాద్ బ్యాంక్, ఆంధ్రాబ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, కెనరా బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్, కార్పొరేషన్ బ్యాంక్, దేనా బ్యాంక్, ఐడీబీఐ బ్యాంక్, ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్, ఓరియంటల్ బ్యాంక్, పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, సిండికేట్ బ్యాంక్, యూకో బ్యాంక్, యూనియన్ బ్యాంక్, యునైటెడ్ బ్యాంక్‌ల రేటింగ్‌ను క్రిసిల్ సవరించి భవిష్యత్ దృక్కోణం 'స్థిరం' అని ప్రకటించింది. సర్కారు దన్ను కారణంగా బ్యాంకుల రుణ డిమాండ్ పెరుగుతుందని ఫలితంగా ఆయా బ్యాంకుల మొత్తం పని తీరు మెరుగయ్యేందుకు వీలు పడగలదని వెల్లడించింది. అయితే ఈ బ్యాంకుల జాబితాలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లేకపోవడం విశేషం.

CRISIL A STANDARD & POOR'S COMPANY

నిజాయితీ పరులకు సులభంగా రుణం..

బ్యాంకింగ్ రంగంలో సర్కారు చేపట్టిన సంస్కరణ మూలంగా ఇకపై నిజాయితీ పరులకు ఎలాంటి అవరోధాలు లేకుండా సులభంగా బ్యాంకు రుణాలు లభించనున్నా ఆర్థిక సేవల శాఖ కార్యదర్శి రాజీవ్ కుమార్ తెలిపారు. చిన్న మొత్తంలో రుణాలు అవసరమైన వారికి, నిజాయితీ పరులకు ఇక సులువుగా రుణాలు అందుతాయని అన్నారు. బ్యాంకింగ్ రంగంలో స్థిరత్వాన్ని తీసుకువచ్చేందుకు సర్కారు పలు చర్యలు చేపడుతున్నట్టుగా తెలిపారు.

'ఫ్యూచర్'లోకి స్నాప్‌డీల్ లాజిస్టిక్స్



న్యూఢిల్లీ: రిటైల్ రంగ దిగ్గజం ఫ్యూచర్ గ్రూపు చిన్న సంస్థలను విలీనం చేసుకొనే ప్రక్రియను కొనసాగిస్తోంది. తాజాగా ఆ సంస్థ స్నాప్‌డీల్ లాజిస్టిక్స్ విభాగం వల్కన్ ఎక్స్‌ప్రెస్‌ను సొంతం చేసుకొంది. స్నాప్‌డీల్ మాతృసంస్థ జాస్పర్ ఇన్ఫోటెక్ నుంచి వల్కన్ ఎక్స్‌ప్రెస్‌కు చెందిన 100 శాతం వాటాను తాము సొంతం చేసుకున్నట్టుగా ఫ్యూచర్ గ్రూపు వెల్లడించింది. ఈ ఒప్పందం విలువ రూ.35 కోట్లుగా తెలిపింది. ఈ ఒప్పందం మొత్తాన్ని తాము నగదు రూపంలోనే పూర్తి చేయనున్నట్టు సంస్థ వివరించింది. స్నాప్‌డీల్, ఎయిర్‌టెల్, యూపీఎస్ సంస్థలతో పాటు వల్కన్ ఎక్స్‌ప్రెస్ ప్రధానంగా ఈ-కామర్స్ విభాగంపై దృష్టి సారించి పని చేస్తోంది. దీనికి తోడు అత్యధిక విలువ కలిగిన బిజినెస్ టు బిజినెస్ సంస్థలకు కూడా లాజిస్టిక్స్ సేవలను అందిస్తోంది. వల్కన్‌ను సొంతం చేసుకోవడం ద్వారా సమాజంలో అనుసంధానతకు దూరంగా ఉన్న వారికి కూడా ఫ్యూచర్ చేరువయ్యే సామర్థ్యం పెరుగుతుందని ఆయన అన్నారు. దీనికి తోడు కొత్త సంస్థ కారణంగా రిటైల్, ఈ-కామర్స్ వినియోగదారులు అత్యాధునికంగా తదుపరి తరం రిటైల్ సేవలను చేరువ చేసేందుకు వీలుకుదురుతుందని ఫ్యూచర్ గ్రూప్ ఛైర్మెన్, వ్యవస్థాపకులు కిషోర్ బియాని తెలిపారు.

ఐబీఏ ఛైర్మెన్‌గా ఉషా ఎన్నిక



కోల్‌కతా: ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఐబీఏ) ఛైర్మెన్‌గా అలహాబాద్ బ్యాంక్ సీఈవో, ఎండీ ఉషా అనంత సుబ్రహ్మనియన్ (71) ఎన్నికయ్యారు. 2017-18 సంవత్సరానికి ఆమె ఐబీఏ ఛైర్మెన్‌గా వ్యవహరించనున్నారు. ఐబీఏకు ఒక మహిళ ఛైర్మెన్‌గా ఎంపికవడం ఇదే తొలిసారి. దేశంలోని బ్యాంకులు ఇతర ఆర్థిక సంస్థల సంఘంగా ఐబీఏ ముంబయి కేంద్రంగా సేవలందిస్తున్న సంగతి తెలిసిందే. తదుపరి ఛైర్మెన్ ఎన్నిక కోసం సమావేశమైన మేనేజింగ్ కమిటీ ఉషాకు ఆ బాధ్యతలను అప్పగిస్తూ నిర్ణయం తీసుకుందని ఐబీఏ తెలిపింది. ప్రస్తుతం ఆమె ఐబీఏ డిప్యూటీ ఛైర్మెన్‌గా సేవలందిస్తున్నారు. ఐబీఏ ఛైర్మెన్‌గా ఉన్న పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్ ఛైర్మెన్, ఎండీ జితేందర్ బీర్ సింగ్ పదవీ కాలం డిసెంబరుతో ముగియడంతో ఆయన స్థానం ఖాళీ అయింది. ఇప్పుడు ఆస్థానాన్ని ఉషా భర్తీ చేయనున్నారు.

యూఎస్ఐబీసీ బోర్డులోకి మజుందార్



వాషింగ్టన్: బయోటెక్నాలజీ రంగ దిగ్గజం కిరణ్ మజుందార్‌షా భారత అమెరికా బిజినెస్ కౌన్సిల్ (యూఎస్ఐబీసీ) బోర్డు సభ్యులుగా నియమితులయ్యారు. అబోట్ ఫార్మా సీఈవో మైక్‌వైట్, సీఐఏ మాజీ డైరెక్టర్ మైఖేల్ హైడెన్, మాజీ జాతీయ భద్రతా సలహాదారు స్టీఫెన్ హాడ్లీలతో పాటు కొత్తగా 24 మందిని బోర్డులోకి తీసుకున్నట్టుగా యూఎస్ఐబీసీ వెల్లడించింది. ఇరు దేశాలకు చెందిన దాదాపు 350 మేటి కంపెనీలు యూఎస్ఐబీసీలో సభ్యులుగా ఉన్నాయి. ప్రస్తుత సంవత్సరం భారత్- అమెరికాల మధ్య వ్యూహాత్మక వాణిజ్య సంబంధాలు మరింత బలోపేతం చేసేలా యూఎస్ఐబీసీ కొత్త బోర్డు పని చేయనుంది. పెట్టుబడులు పెరిగేందుకు, మేటి వృద్ధిని అందుకొనేందుకు అవరోధంగా నిలిచే విధానపరమైన మార్పులను సమీక్షించడంతో పాటు వాటిలో మార్పు నిమిత్తం ప్రభుత్వాలతో చర్చలు జరిపేందుకు యూఎస్ఐబీసీ కృషి చేయనుంది.

గూగుల్, ఫెస్‌బుక్‌లతో చేటు!



దావోస్: ఇంటర్‌నెట్ దిగ్గజ సంస్థలైన గూగుల్, ఫెస్‌బుక్ సంస్థలు కొత్త ఆవిష్కరణలకు ఆటంకంగా నిలుస్తున్నాయని ప్రముఖ బిలియనీర్ ఇన్వెస్టర్ జార్జ్ సొరోస్ అన్నారు. సోషల్ మీడియా కంపెనీలతో ప్రజాస్వామ్య పనితీరుపై ప్రతికూల పరిణామాలు చూపుతాయని సొరాస్ ఆవేదన వ్యక్తం చేశారు. వరల్డ్ ఎకనామిక్ ఫోరంలో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. అమెరికా కేంద్రంగా పనిచేస్తున్న ఐటీ దిగ్గజాలకు రోజులు లెక్క పెట్టే సమయం వచ్చిందన్నారు. ప్రస్తుతం సోషల్ మీడియా కంపెనీలు సమగ్రమైన విషయ అవగాహన లేకుండానే ప్రజల అభిప్రాయాలను ప్రభావితం చేస్తున్నాయని అన్నారు. ఎన్నికలపై, ప్రజాస్వామ్య పనితీరుపై నెట్ దిగ్గజ సంస్థలు దుష్ప్ర ప్రభావం చూపుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. 2016లో అమెరికా అధ్యక్ష ఎన్నికలపై రష్యా జోక్యంతో ఫెస్‌బుక్, ట్వీట్టర్‌లు పోషించిన పాత్రపై వ్యక్తమవుతున్న అనుమానాల నేపథ్యంలో సొరోస్ వ్యాఖ్యలకు ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రపంచవ్యాప్తంగా దేశాల్లో ప్రజాస్వామ్యం, మానవ హక్కుల మద్దతుకు ఓపెన్ సొసైటీ ఫౌండేషన్స్‌ను సొరోస్ ఏర్పాటు చేశారు. సోషల్ మీడియా కంపెనీలు అవి అందించే సేవలకు యూజర్లను ఉద్దేశపూర్వకంగానే కట్టిపడేస్తున్నాయన్నారు. మరి ముఖ్యంగా ఈ పరిమాణాలు యుక్త వయసు వారికి తీవ్ర హానికరమని ఆయన తెలియజేశారు.

మూడేండ్లు.. మూడు ముఖ్య ఘట్టాలు...

మహాజన పాదయాత్ర, టీ మాస్, బీఎల్ఎఫ్... సీపీఐ (ఎం) చరిత్రలో మైలురాళ్లు

- తెలంగాణలో ప్రత్యామ్నాయ శక్తికి పురుడుపోసిన ఎర్రజెండా
- నూతన రాష్ట్రంలో ప్రజా ఉద్యమాలకు ఊపిరిలూదిన అరుణ పతాకం
- కార్మిక, కర్షక మైత్రికి, సామాజిక శక్తుల ఐక్యతకు పునాదేసిన మార్క్సిస్టు పార్టీ
- ఫిబ్రవరి 4 నుంచి 7 వరకు రాష్ట్ర ద్వితీయ మహాసభ
- పోరుగడ్డ నల్లగొండ వేదికగా రణ నినాదం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వేయి మైళ్ల ప్రయాణమైనా ఒక్క అడుగుతోనే మొదలవుతుందన్నది జగమెరిగిన సత్యం. ఈ అక్షర సత్యాన్ని ఒంటబట్టించుకున్న సీపీఐ (ఎం).. ఒంటరిగా కాదు.. సమాజంలోని నలుగుర్ని కలుపుకుని తెలంగాణలోని నలుదిక్కులా విస్తరించేందుకు యోచించింది. ఈ క్రమంలో నూతన రాష్ట్రమైన తెలంగాణలో 2015 మార్చిలో హైదరాబాద్ మహానగరం వేదికగా జరిగిన తొలి మహాసభ దగ్గర్నుంచి.. నేటి వరకు సమాజ మార్పుకోసం తాను నడుస్తూ.. తనతోపాటు నలుగుర్ని నడిపిస్తూ ముున్ముందుకు సాగిపోతున్నది.

ఈ ఒరవడిలో మహాసభ అనంతరం తీసుకున్న నిర్ణయం ప్రకారం 2016 అక్టోబరులో మహాజన పాదయాత్రకు శ్రీకారం చుట్టింది. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో ప్రారంభమైన ఈ యాత్ర.. లక్షలాది మంది జనాన్ని తన వెంట నడిపించింది. యాత్ర ముగింపు సందర్భంగా 2016 మార్చిలో హైదరాబాద్‌లో నిర్వహించిన సమర సమ్మేళనం సభ సాక్షిగా టీఆర్ఎస్ సర్కారుపై సామాజిక శంఖారావాన్ని మోగించింది. ఆ సభకు ముందు, ఆ తర్వాత వచ్చిన సూచనలు, సలహాల ఆధారంగా వివిధ ప్రజా, వర్గ, సామాజిక సంఘాలు, శక్తులను కలుపుకుని 2017 జులైలో తెలంగాణ సామాజిక ప్రజా సంఘాల ఐక్య వేదిక (టీ మాస్ ఫోరం)ను ఏర్పాటు చేసింది. తద్వారా తెలంగాణలో కొనసాగుతున్న సామాజిక అణచివేత, ఆర్థిక దోపిడీపై రణభేరీ మోగించింది. ఇదే ఊపుతో అణగారిన వర్గాల వారి ఆత్మగౌరవం, సంక్షేమమే లక్ష్యంగా జనవరి 25న బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బీఎల్ఎఫ్)కు పురుడుపోసింది. ఈ మూడు ప్రధాన ఘట్టాలు.. సీపీఐ (ఎం) తెలంగాణ చరిత్రలో మూడు మైలురాళ్లుగా నిలిచిపోనున్నాయి. తద్వారా మార్క్సిస్టు పార్టీ రాష్ట్ర రాజకీయాలపై తనదైన ముద్రను వేసింది. అంతేకాకుండా తానెత్తుకున్న సామాజిక న్యాయం, రాష్ట్ర సమగ్రాభివృద్ధి అనే విషయాన్ని రాష్ట్ర రాజకీయ రంగంలో ఎజెండా చేయగలిగింది. ఇప్పుడు ఇదే నినాదాన్ని సాక్షాత్తూ ముఖ్యమంత్రి కేసీఆర్ సైతం చెప్పక తప్పని పరిస్థితిని ఆ పార్టీ కల్పించింది.

మూడు ప్రధాన ఘట్టాల స్ఫూర్తితో.. సమరోత్సాహాన్ని నింపుకుని ద్వితీయ మహాసభకు సన్నద్ధమవుతున్నది.

వీరోచిత తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి ఊపిరులూదిన పోరాటాల గడ్డ నల్లగొండ వేదికగా ఫిబ్రవరి 4 నుంచి 7 వరకు మహాసభ జరగనున్నది. ప్రతినిధులు, ఆహ్వానితులు, పరిశీలకులు మొత్తం 650 మంది ఈ మహాసభకు హాజరుకానున్నారు. సీపీఐ (ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, అగ్రనేతలు ప్రకాశ్ కరత్, బివి రాఘవులు, వి.శ్రీనివాసరావు తదితరులు ముఖ్య అతిథులుగా హాజరవుతారు.

అరుణ పతాకల వేదిక..

మరోవైపు రాష్ట్రాన్ని పాలిస్తున్న టీఆర్ఎస్.. కేంద్రంలోని బీజేపీ, వీటితోపాటు కాంగ్రెస్, టీడీపీ తదితర బూర్జువా పార్టీలకు భిన్నంగా రాష్ట్రంలో ఒక బలమైన వామపక్ష ఉద్యమాన్ని నిర్మించాలని, తద్వారా కమ్యూనిస్టు పార్టీలు బలోపేతం కావాలని సీపీఐ (ఎం) ప్రగాఢంగా విశ్వసించింది. ఈ క్రమంలో అనేక ప్రజా సమస్యలపై సీపీఐ, సీపీఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ, ఎంసీపీఐ (యు), ఆరెస్పీ, ఫార్వర్డ్‌బ్లాక్, సీపీఐ (ఎం-ఎల్), ఎస్‌యుసీఐ (సీ) తదితర పార్టీలతో కలిసి ఉద్యమాలు నిర్మించింది.

ధర్నాచౌక్ నుంచి జంతర్ మంతర్ దాకా...




ఉమ్మడి రాష్ట్రం నుంచి విడిపోయిన తర్వాత నూతన తెలంగాణలోనూ సీపీఐ (ఎం) తన ఉద్యమ వారసత్వాన్ని కొనసాగించింది. అనేక ప్రజా, వర్గ, సామాజిక సమస్యలను వెలికితీసి వాటిపై రాజీలేని పోరు సల్పింది. మల్లన్నసాగర్, ఇతర భూ నిర్వాసితులకు అండగా నిలబడి.. తెలంగాణ ప్రజల్లో ప్రశ్నించే శక్తిని పాదుకొల్పింది. ప్రజా ఉద్యమాల గొంతుక ధర్నాచౌక్‌ను ఎత్తేసిన టీఆర్ఎస్ సర్కారు అప్రజాస్వామిక పోకడలను ధర్నాచౌక్ నుంచి ఢిల్లీలోని జంతర్‌మంతర్ దాకా ఎండగట్టటంలో కీలక పాత్ర పోషించింది. ఆత్మహత్యలు చేసుకుంటున్న రైతుల గుండెల్లో ధైర్యం నింపి.. వారికి అండగా నిలబడింది. మున్సిపల్, గ్రామ పంచాయతీ వర్కర్లు, అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు, మధ్యాహ్న భోజన కార్మికులు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల పక్షాన సర్కారును నిలదీసింది. మేధావులు, కవులు, కళాకారులపై జరుగుతున్న దాడులను ఎప్పటికప్పుడు ఖండించి.. నేనున్నానంటూ వారికి మనోధైర్యాన్నిచ్చింది. నేరెళ్ల ఇసుక మాఫియా లోగుట్టును బయటపెట్టి సర్కారును ఇరకాటంలో పడేసింది. అక్కడి బాధితులకు భరోసానిచ్చింది. మంథని మధుకర్ హత్యను, యాదాద్రి జిల్లా పల్లెర్లలో ప్రేమ వివాహ జంటను హతమార్చిన అగ్రకుల ఆధిపత్యంపై తిరుగుబాటు బావుటానెగరేసింది. తద్వారా సామాజిక వివక్ష, అణచివేతపై అధికార టీఆర్ఎస్‌తోపాటు కాంగ్రెస్, టీడీపీ, బీజేపీ తదితర బూర్జువా పార్టీలను నిలేసింది. రాజకీయ ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్న అధికార పార్టీని అడుగడుగునా ప్రశ్నిస్తూ.. స్వచ్ఛ రాజకీయాల కోసం పిలుపునిచ్చింది. తద్వారా రాష్ట్ర రాజకీయ యవనికపై సీపీఐ (ఎం) తనదైన.. ముద్రను వేసింది.

లాల్-నీల్ ఐక్యత..



ఇదే సమయంలో దేశంలో కమ్యూనిస్టులు, పూలే, అంబేద్కరిస్టులు కలిసి ముందుకు సాగటం ద్వారా ఒక ప్రత్యామ్నాయ శక్తిగా అవతరించవచ్చని సీపీఐ (ఎం) భావించింది. ఈ క్రమంలో మహాజన పాదయాత్రకు ముందు, ఆ తర్వాత వివిధ సామాజిక, ప్రజా, వర్గ సంఘాలు, సంస్థలు, శక్తులతో కొన్ని వందలసార్లు మేధోమథనం సాగించింది. మేధావులను సైతం ఇందులో భాగస్వాములను చేసింది. రాష్ట్రంలో అత్యధికంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు, అగ్రకుల పేదలందరికీ సామాజిక న్యాయం దక్కినప్పుడే తెలంగాణ అభివృద్ధి సాధ్యమనే విషయాన్ని అనేక వేదికల మీద నొక్కి చెప్పింది. వీరందర్నీ ఐక్యం చేయటం ద్వారానే అట్టడుగు వర్గాల వారికి రాజ్యాధికారం దక్కుతుందనే విషయాన్ని స్పష్టం చేసింది. అందువల్ల లాల్, నీల్ జెండాల కలయిక అనివార్యమని చెప్పింది. ఈ క్రమంలో దేశంలోనే మొట్టమొదటిసారిగా బీఎల్ఎఫ్‌కు రూపకల్పన చేసింది. నల్లగొండలో నిర్వహించబోయే ద్వితీయ మహాసభలో ఈ ఫ్రంట్‌ను బలోపేతం చేసే అంశంపై ప్రధానంగా చర్చలు నిర్వహించి, కార్యాచరణ రూపొందించనున్నారు.

టెక్‌ప్లస్
నవతెలంగాణ



జ్ఞాపకాలు పదిలం..!

చిన్ననాటి స్నేహితులు, కలిసి చదువుకున్న క్లాస్‌మేట్స్, ఒకేచోట పనిచేసిన కోలిగ్స్.. ఇలా అందరినీ మరోసారి కలుసుకునే వీలు కల్పిస్తున్నవాటిలో సోషల్‌మీడియాది ప్రత్యేకస్థానం. యాది చేసుకునే వారందరికీ, ఆనాటి జ్ఞాపకాలను పంచుకునే వేదికగా వాట్సాప్, ట్విట్టర్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ లాంటివి ఎంతో ఉపయోగపడుతున్నాయి. అయితే ఈ సామాజిక మాధ్యమాల్లో అప్‌లోడ్ చేసిన ఫొటోలను తిరిగి మరోసారి చూడాలన్నా.. జ్ఞాపకాలను నెమరువేసుకోవాలన్నా పాత ఆల్బమ్స్‌ను అటకపై నుంచి దించాల్సిన అవసరం లేదు. మీరు గతంలో ఆ ఫొటోలను ఫేస్‌బుక్‌లో అప్‌లోడ్ చేసి ఉంటే..వాటిని సులభంగా మళ్లీ చూడవచ్చు..

ప్రతిరోజూ సోషల్‌మీడియాలో అప్‌లోడ్ అవుతున్న ఫొటోల సంఖ్య లక్షల్లో ఉంటుంది. ఇందులో కొన్నేండ్ల కిందట ఫేస్ బుక్ లో అప్‌లోడ్ చేసిన ఫోటోలను మళ్లీ చూడాలనుకుంటే ఎక్కువగా శ్రమపడకుండానే వాటిని చూసేయవచ్చు. ఇందుకోసం ఫేస్‌బుక్ కొత్త యాక్టివిటీ లాగ్ ను అప్‌డేట్ చేసింది. దీనిద్వారా కొన్నేండ్ల క్రితం పోస్టు చేసిన ఫోటోలను, లైక్స్, కామెంట్స్ మరోసారి సులభంగా చూసే వీలుంటుంది. దీనిని స్మార్ట్‌ఫోన్‌లోనూ, ల్యాప్, డెస్క్ టాప్‌లోనూ యాక్టివేట్ చేసుకోవచ్చు.



ఇందుకోసం ముందుగా మీ స్మార్ట్ ఫోన్‌ల్లో , కంప్యూటర్‌లో ఫేస్ బుక్‌ను ఓపెన్ చేయాలి. మీ అకౌంట్‌లో లాగిన్ అయిన తర్వాత స్క్రీన్ పై కార్నర్‌లో కనిపించే లైన్లలో ఉన్న మెనూ బటన్ ను ప్రెస్ చేయాలి. తర్వాత మెనూ ఎగువన మీ పేరును ప్రెస్ చేయండి. ఇప్పుడు డిస్ ప్లే స్క్రీన్‌లో కనిపించే పిక్చర్‌లో కిందున్న యాక్టివిటీ లాగ్ బటన్‌కు వెళ్లండి. కొన్ని నెలలు లేదా సంవత్సరాల క్రితం జాబితాలో చేర్చిన యాక్టివిటిస్‌ను స్క్రిన్ తీసుకెళ్తుంది.

ఇప్పుడు దీనిపై ప్రెస్ చేయండి. ఫేస్ బుక్ లో మీ అన్ని యాక్టివిటిస్ లాగ్స్‌ను చూసే వీలు కలుగుతుంది. మీకు తేదీ గుర్తుంటే మరింత సులభంగా గతంలో అప్‌లోడ్ చేసిన ఫొటోలను, వాటికి వచ్చిన లైక్స్, కామెంట్స్‌ను చూసే వీలుంటుంది. అయితే లైక్స్ కోసం సెర్చ్ చేస్తున్నప్పుడు స్క్రీన్ పై భాగాన ఉన్న ఫిల్టర్ బటన్ పై ప్రెస్ చేయాలి. ఇప్పుడు మెయిన్ యాక్టివిటీ లాగ్ స్క్రీన్‌ల్లో, మీరు ఇచ్చిన తేదీకి సంబంధించిన ప్రతి ఫొటోనూ, లైక్స్‌ను సులభంగా చూడవచ్చు.

గతంలో అప్‌లోడ్ చేసిన ఫొటోలను తిరిగి చూడటం ఎలాగో తెలుసుకున్నాం. మరి .. మనకు నచ్చిన ఫొటోలను సోషల్‌మీడియా నుంచి ఎక్కువ రిసల్యూషన్‌తో డౌన్‌లోడ్ చేసుకోవడం ఎలాగో తెలుసుకుందాం.

సోషల్ మీడియాలో ఫొటో షేరింగ్‌కు రోజురోజుకు పెరుగుతున్న ఆదరణ పెరుగుతోంది. స్మార్ట్‌ఫోన్‌ల ద్వారా చిత్రీకరించిన ఫొటోలను వెనువెంటనే సోషల్ మీడియాలో పోస్ట్ చేసేస్తున్నారు. సాధారణంగా స్మార్ట్‌ఫోన్‌తో తీసిన ఫొటోలను ఏ మాత్రం క్వాలిటీ దెబ్బతినకుండా పూర్తి రిసల్యూషన్‌తో డౌన్‌లోడ్ చేసుకునే వీలు ఇన్‌స్టాగ్రామ్ కల్పిస్తుంది.

ఇందుకోసం ముందుగా మీ స్మార్ట్‌ఫోన్‌లో ఇన్‌స్టాగ్రామ్ అప్లికేషన్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలి. ఆ తర్వాత స్క్రీన్‌పై కనిపించే హోమ్ పేజీలో సెర్చ్ బార్ పేరుతో కనిపించే ఆప్షన్‌పై ప్రెస్ చేసి మీరు డౌన్‌లోడ్ చేసుకోవాలనుకుంటున్న ఫొటోకు సంబంధించిన ప్రొఫైల్ నేమ్ ఎంటర్ చేయాలి. ఫొటో డౌన్‌లోడింగ్ ప్రాసెస్ ప్రారంభమవుతుంది. ఇమేజ్ పూర్తిగా డౌన్‌లోడ్ అయిన తరువాత మీకు కావల్సిన ఫైల్ లేదా ఫోల్డర్‌లో ఆ ఇమేజ్‌ను భద్రపరుచుకోవచ్చు.

విండోస్ పీసీలో..

స్మార్ట్‌ఫోన్‌లోనే కాదు విండోస్ పీసీలో Instagram ప్రొఫైల్ ఫొటోలను సులభంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

✓ ముందుగా ల్యాప్‌టాప్, డెస్క్‌టాప్‌లో ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్‌ను ఓపెన్ చేయాలి.

✓ ఇన్‌స్టాగ్రామ్ సెర్చ్ బార్‌లో మీరు డౌన్‌లోడ్ చేసుకోవాలనుకుంటోన్న ఫోటోకు సంబంధించి ప్రొఫైల్ నేమ్‌ను ఎంటర్ చేసినట్లయితే సెర్చింగ్ ప్రాసెస్ మొదలవుతుంది.

✓ సెర్చ్ చేసిన ఫొటో ఐడెంటిఫై అయిన తరువాత ఆ ఫొటోకు సంబంధించిన యూఆర్ఎల్‌ను అడ్రస్ బార్ నుంచి కాపీ చేసుకోండి.

✓ తదుపరి స్టెప్‌లో భాగంగా DownloadGram (https:// downloadgram. com/) అనే వెబ్‌సైట్‌లోకి వెళ్లి, ముందుగా కాపీ చేసుకున్న ఆటో-జెనరేటెడ్ ఇన్‌స్టాగ్రామ్ లింక్‌ను అక్కడ పేస్ట్ చేయండి.

✓ ఇమేజ్ పూర్తిగా డౌన్‌లోడ్ అయిన తరువాత మీకు కావల్సిన ఫైల్ లేదా ఫోల్డర్‌లో ఆ ఇమేజ్‌ను భద్రపరుచుకోవచ్చు. వీటిని ఫ్రేమ్‌లో అమర్చుకుని ఆనందించవచ్చు.

✓ ఇలా గతంలోని అప్‌లోడ్ చేసుకున్న ఫొటోలను తిరిగి చూడటంతో పాటు నచ్చిన ఫొటోలను ఫుల్ రిసల్యూషన్‌తో డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. మరెందుకు ఆలస్యం..జ్ఞాపకాలకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం జోడించి.. మరింత పదిలం పరుచుకోండి.

రేడియో కార్బన్ డేటింగ్ అంటే ఏమిటి?


ప్రశ్న: కార్బన్-14, కార్బన్-12 నిష్పత్తి అంటే ఏమిటి? రేడియో కార్బన్ డేటింగ్ అంటే ఏమిటి?

- ఎం.మోహనరెడ్డి, విజయవాడ

పదార్థాలన్నీ పరమాణు నిర్మితం. పరమాణువుల లోపల పరమాణు కేంద్రకం (atomic nucleus) దాని పైభాగాన కేంద్రకం చుట్టూ తిరిగే ఎలక్ట్రాన్లు ఉంటాయి. పరమాణువులోని కేంద్రకంలో ధనావేశిత ప్రోటాన్లు, తటస్థమయిన న్యూట్రాన్లు ఉంటాయి. వీటితో పాటు వివిధ రకాలైన కణాలున్నా కేంద్రకంలో ప్రోటాన్లు, న్యూట్రాన్లే ప్రధానం. పదార్థాల భౌతిక, రసాయనిక ధర్మాలకు ప్రధాన ఆధారం పరమాణువులు లేదా అణువులలో ఎలక్ట్రాన్ల అమరికనే. సాధారణంగా పరమాణువులు, అణువులు తటస్థం (neutral) గా ఉంటాయి. అందుకు కారణం అందులో ధనావేశిత ప్రోటాన్ల సంఖ్య ఎళీళీణ విద్యుదావేశం ఉన్న ఎలక్ట్రాన్ల సంఖ్య సమానంగా ఉండడమే! పదార్థాల్లో ఉన్న పరమాణువులన్నీ ఒకే విధమైన సంఖ్య గల ప్రోటాన్లతో నిండి ఉన్న కేంద్రకాలున్నవి అయితే ఆ పదార్థాలను మూలకాలు (Elements)అంటారు. పదార్థాలలో వివిధ సంఖ్యలలో ప్రోటాన్లున్న కేంద్రకాలు గల పరమాణువులతో నిండి ఉంటే ఆ పదార్థాలను సంయోగ పదార్థాలు (Compounds) అంటారు. పరమాణువుల్లో ఉన్న కేంద్రకంలోని ప్రోటాన్ల సంఖ్యను ఆ పరమాణువుకున్న 'పరమాణు సంఖ్య' (Atomic number) అంటారు. పరమాణు సంఖ్య ఆ పరమాణువుకున్న ఓ విశిష్ట సంఖ్య (unique number) . పరమాణు కేంద్రకంలో ప్రోటాను సంఖ్య ఒకేవిధంగా ఉన్నా న్యూట్రాన్ల సంఖ్య ఒకేలా ఉండాలన్న నియమం లేదు. ప్రోటాను సంఖ్యను బట్టే పరమాణువులకు సంకేతాలు (symbols) ఉన్నాయి. ఆక్సిజన్ మూలకపు పరమాణువులో 8 ప్రోటాన్లు ఉంటాయి. దీని సంకేతం '0'. గంధకంలో 16 ప్రోటాన్లు ఉంటాయి. కర్బనంలో '6' ప్రోటాన్లు ఉంటాయి. ప్రోటాన్ల సంఖ్య, న్యూట్రాన్ల సంఖ్యను కలగలిపి పరమాణు ద్రవ్య సంఖ్య (atomic mass number) అంటారు. ఉదాహరణకు సాధారణ కర్బన పరమాణు కేంద్రకంలో 6 ప్రోటాన్లు, 6 న్యూట్రాన్లు ఉంటాయి. ఇలాంటి పరమాణువుల్ని C-12 పరమాణువులు అంటారు. కానీ పరమాణు కేంద్రకంలో 6 ప్రోటాన్లు, 7 న్యూట్రాన్లు ఉంటే వాటిని C-13 కేంద్రకాలు అంటారు. ఇక C-14 అంటే ఏమిటో మీకిప్పటికే అర్థమై ఉంటుంది. ప్రతి కర్బన పరమాణు కేంద్రకంలో ఆరు ప్రోటాన్లు, 8 న్యూట్రాన్లు ఉంటే వాటిని C-14 అంటాము. ప్రోటాను సంఖ్య (లేదా పరమాణు సంఖ్య) ఒకే విధంగా ఉండి, పరమాణు ద్రవ్య సంఖ్యలో తేడాలున్న మూలకాలను సమస్థానీయాలు (isotopes) అంటారు. ఐసోటోపుల భౌతిక ధర్మాల్లో తేడా ఉన్నా రసాయనిక లక్షణాల్లో పెద్దగా తేడా ఉండదు. ప్రకృతిలో అధిక మోతాదులో లభించే సమస్థానీయం స్థిరంగా ఉన్నదనీ, తక్కువగా ఉన్న దాన్ని అస్థిర ఐసోటోపుగాను భావించగలము.



ప్రొ॥ ఎ. రామచంద్రయ్య
సంపాదకులు, చెకుముకి,
జన విజ్ఞాన వేదిక



ప్రకృతిలో ప్రతి 100 C-12 పరమాణువులకు కేవలం ఒక C-13 పరమాణువు మాత్రమే లభ్యమవుతుంది. ఇక C-14 మరీ అరుదుగా ఉంటుంది. ప్రతి లక్ష కోట్ల C-12 పరమాణువులకు ఒక C-14 పరమాణువు మేరకే ప్రకృతిలో ఏర్పడుతుంది. ఇది సహజసిద్ధంగా భూమిలో ఉండదు. ఎప్పటికపుడు భూవాతావరణంలోని నత్రజని వాయు పరమాణువులు సూర్యకాంతి నుంచి వచ్చే గామా కిరణాల తాకిడికి, ఎలక్ట్రాన్ల తాకిడికి లోనయ్యి ఒక్కో ప్రోటాను న్యూట్రానుగా మారే కేంద్రక చర్యల్లో C-14 పరమాణువులు ఏర్పడతాయి.

గామా కిరణాలు ఇలా ఏర్పడ్డ C-14 ఐసోటోపులు స్థిరంగా ఉండవు. ఎప్పటికప్పుడు తిరిగి N-14గా మారిపోతుంటాయి. ఇలా ప్రతి 100 జ-14 కేంద్రకాలు 50 C-14 కేంద్రకాలుగా మారడానికి పట్టే సమయాన్ని C-14 కున్న అర్ధాయుష్షు (Half life period) అంటారు. దీని విలువ సుమారు 5890 సంవత్సరాలు ఉంటుంది.

ప్రకృతిలో కర్బనం నుండి CO_2 ను ఇస్తుంది. ఇందులో కొన్ని జలు C -12వి కాగా, మరికొన్ని %జ%-13 వి కాగా, ఇంకొన్ని C -14వి అయి ఉంటాయి. C -14 తో నిండి వున్న జఉ2 వాయువు మోతాదు భూవాతావరణంలో చాలా తక్కువగా ఉంటుంది. అయినా కిరణజన్య సంయోగక్రియ (photosynthesis) వంటి రసాయనిక చర్యల్లో CO_2అనే వాయువు H_2Oతో కలిసి చక్కెరలుగా మారుతుంది. ఈ చక్కెరల నుంచే వృక్షాల చెక్క, కాండం, కలప ఏర్పడతాయి. C -14 ఏర్పడడం, తిరిగి వియోగం చెందడం వల్ల బతికున్న వృక్షంలోకి ప్రతి కిలోగ్రాము కలపలో సుమారు 16 కాంట్లు వచ్చేలా C -14 రేడియో ధార్మికత (radio activity) ని ప్రదర్శిస్తుంది. కానీ చెట్టు మరణించాక కిరణజన్యసంయోగ క్రియ ఆగి పోవడం వల్ల వాతావరణంలో ఉన్న CO_2తో సంధానాన్ని కోల్పోతుంది. కాబట్టి రేడియోధార్మికతను ప్రదర్శించే C -14 కేంద్రకాల సంఖ్య

ప్రతి 5750 సంవత్సరాలకు సగానికి పడిపోతుంది. ఓ చెక్కతో తయారుచేసిన మ్యూజియంలో కార్యశిల్పంలో ప్రస్తుతం ప్రతి కి.గ్రా చెక్కలో 8 రేడియో ధార్మిక కాంట్లు ఉంటే ఆ శిల్పము వయస్సు 5750 సంవత్సరాలన్నీ 4 కాంట్లు ఉంటే దాని వయసు సుమారు 11,500 సంవత్సరాలనీ లెక్కిస్తారు. ఇలా వస్తువుల వయసును C -14 ఆధారంగా లెక్కించే పద్ధతిని C -14 డేటింగ్ లేదా కార్బన్ డేటింగ్ అంటాము.



చిన్న వ్యాపారస్తులకు అనువుగా..

ప్రపంచవ్యాప్తంగా 130 కోట్ల మంది యాక్టివ్ వినియోగదార్లతో ఇన్‌స్టెంట్ మెసేజింగ్ ఆప్ వాట్సాప్ అగ్రస్థానంలో ఉంది. కొత్తకొత్త ఫీచర్లను అందుబాటులోకి తీసుకువస్తూ.. స్మార్ట్‌రంగంలో ప్రత్యేకతను చాటుతుంది. ఈ నేపథ్యంలో ఇటీవల లాంచ్ చేసిన వాట్సాప్ బిజినెస్ ఆప్‌ను అద్భుతమైన ఆఫర్లతో మనదేశంలోనూ అందుబాటులోకి తీసుకొచ్చింది. . ఈ ఆప్ ద్వారా షాప్, బిజినెస్, చిరునామా తదితర వివరాలు అందుబాటులో ఉంటాయి. ముఖ్యంగా వినియోగదారులకందించే సేవలతోపాటు వారి అడిగే సందేహాలకు తక్షణమే స్పదించవచ్చు. వాయిస్ , వీడియో కాల్స్ చేయడానికి కూడా అవకాశం వుంది. అంతేకాదు మెసేజ్‌లను ఎంతమంది చదివారనేది కూడా గణాంకాల ద్వారా తెలుసుకోవచ్చు. వాట్సాప్ లాగానే ఈ బిజినెస్ యాప్ కూడా కాల్స్, మెసేజ్‌లను థర్డ్‌పార్టీకి చేరకుండా ఎండ్ టూ ఎండ్ ఎన్‌క్రిప్షన్‌ను ఆఫర్ చేస్తోంది. ప్రొఫైల్ ఫొటో సెక్యూరిటీతోపాటు లైవ్ లొకేషన్ షేరింగ్‌ను కూడా అనుమతిస్తుంది. కాగా ఇటీవల ఇండోనేషియా, ఇటలీ, మెక్సికో, యుకె, యుఎస్ సహా కొన్ని మార్కెట్లలో వాట్సాప్ బిజినెస్ ఆప్ మొదట లాంచ్ చేసింది. అధికారిక లాంచింగ్‌కు ముందే ఇండియా, బ్రెజిల్‌లో టెస్టింగ్ నిర్వహించింది. గూగుల్ ప్లే స్టోర్ నుంచి దీన్ని ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ముఖ్యంగా ఆండ్రాయిడ్ వినియోగదార్లకు దీన్ని అందుబాటులోకి తెచ్చారు. సొంతంగా వ్యాపారాలు చేసుకునే ఎవరైనా దీన్ని ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. తమ ఖాతాదారులకి నేరుగా అందుబాటులో ఉండొచ్చు

టెక్‌చాట్..

పెట్ భాష అర్థం చేసుకునేలా..



పెంపుడు జంతువుల కోసం కూడా ఒక ఆప్‌ను రూపొందించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఎక్కువ మంది ఇష్టపడే శునకరాజు భాషను సులభంగా అర్థం చేసుకునేందుకు ఈ ఆప్ ఉపయోగపడుతుంది. మన భాష జంతువులకు అర్థం కాకపోయినా అవి సంజ్ఞలు ఆధారంగా ప్రతి స్పందిస్తాయి. అమితమైన విశ్వాసాన్ని చూపించగలిగే శునకాలను మరింతగా అర్థం చేసుకునేందుకు శాస్త్రవేత్తలు గత కొంతకాలంగా ప్రయ్నతిస్తూనే ఉన్నారు. ఆ ప్రయత్నాల ఫలితంగానే కుక్క భాషను అర్థం చేసుకునేలా 'పెట్ ట్రాన్సలేటర్' ను రూపొందించారు.

తాజాగా అమెరికాకు చెందిన పలువురు శాస్త్రవేత్తలు కుక్కల భాషను అర్థం చేసుకునేందుకుగాను ఓ ప్రత్యేకమైన టూల్‌ను అభివృద్ధి చేస్తున్నారు. ఈ ప్రత్యేకమైన పరికరం కుక్కలు మొరుగుతోన్న తీరును బట్టి అవేం చెప్పాలనుకుంటున్నాయో మనకు తెలియచేస్తుంది.

జంతు ప్రవర్తన నిపుణుడు ప్రొఫెసర్ కాన్ స్లాబోడ్చికోఫ్ వెల్లించిన వివరాల ప్రకారం ఈ పెట్ ట్రాన్స్‌లేటర్ టెక్నాలజీ వచ్చే 10 సంవత్సరాల్లోపు పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాబోతోంది.

ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీ ఆధారంగా స్పందించగలిగే ఈ టూల్ జంతువుల శబ్దాలతో పాటు ముఖ కవళికలను అర్థం చేసుకుని వాటిని ఎలిమెంటరీ ఇంగ్లీష్‌లో ట్రాన్సలేట్ చేస్తుంది. ఈ టూల్ ను అభివృద్ధి చేసే క్రమంలో వేల రకాల కుక్కలకు సంబంధించి వాటి అరుపులు ఇంకా శరీర కదలికలను రిసెర్చర్లు విశ్లేషించనున్నారు.

ఆ తరువాత వీటి కమ్యూనికేషన్ సిగ్నల్స్ కు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అర్గారిథమ్‌లోకి మార్చనున్నారు. ఈ పరిశోధనలు పూర్తి అయితే సులభంగా శునకాలను అర్థం చేసుకోవచ్చు.

ఇంతింతై...



ఇన్‌స్టాగ్రామ్ అప్లికేషన్‌కు ప్రపంచవ్యాప్తంగా 800 మిలియన్ల మంది యూజర్లు ఉన్నారు. అక్టోబర్ 2015 నాటికి ఈ ఆప్‌లో మొత్తం 40 బిలియన్ల ఫోటోలు అప్‌లోడ్ అయ్యాయి. ఏప్రిల్ 2017 నాటికి ఇన్‌స్టాగ్రామ్ డైరెక్ట్‌ను 375 మిలియన్ల మంది యాక్టివ్ యూజర్లను కలిగి ఉంది. జూన్ 2017 నాటికి ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్ సదుపాయాన్ని 250 మిలియన్ యూజర్లు యాక్టివ్‌గా ఉపయోగించుకుంటున్నారు.

డియర్ రీడర్స్..

టెక్నాలజీపరంగా మీరేదైనా సమస్యను ఎదుర్కొన్నారా.. దానిని మీరెలా పరిష్కరించారు..? ఇలాంటి అను భవాలేమైనా ఉంటే మాకు రాసి పంపండి.

మా చిరునామా : 'టెక్‌ప్లస్' పేజీ, నవ తెలంగాణ దినపత్రిక, ఎం.హెచ్.భవన్, ఫ్లాట్ నెం. 21/1, ఆజమాబాద్, ఆర్.టి.సి కల్యాణ మండపం వీధి, హైదరాబాద్ - 500020. tech+@navatelangana.com

నయామాల్

టూ ఇన్ వన్



చైనా ప్రముఖ స్మార్ట్‌ఫోన్ల తయారీ సంస్థ లెనోవా... ఇప్పుడు సరికొత్త ల్యాప్ టాప్ ను ఆవిష్కరించింది. 'యోగా 920' లిమిటెడ్ ఎడిషన్ వైబ్స్ కన్వర్టిబుల్ ల్యాప్‌టాప్ ధరను ప్రకటించింది. లక్షా 27వేల150 రూపాయలు గా నిర్ణయించిన ఈ ల్యాప్‌టాప్‌ను టాబ్లెట్ మోడ్, స్టాండ్ మోడ్ , టెంట్ మోడ్ లతో 2-ఇన్ -1 గా వాడు కోవచ్చు. కన్వర్టిబుల్ పీసీ కేటగిరీలో లెనోవా యోగా బ్రాండ్ లీడర్‌గా కొనసాగు తోంది. ఈ తాజా ఆవిష్కరణ యోగా 920 అల్ట్రా ప్రీమియం మోడల్. దీని 2ఇన్ వన్ గ్లాస్ కన్వర్టిబుల్ పరికరంలో డిజిటల్ పిన్, ఫార్-ఫీల్డ్ టెక్నాలజీని జోడించారు. దీని వలన వినియోగదారులు నాలుగు మీటర్ల దూరంలో ఉన్నా, స్టాండ్ బై మోడ్‌లో ఉన్నా వాయిస్-యాక్టివేటెడ్ ఇంటిలిజెన్స్ అసిస్టెంట్ కోర్టానా ను యాక్టివేట్ చేసుకోవచ్చు. ఫింగర్ ప్రింట్ రీడర్ కూడా దీనిలో ఉంది.కంపెనీ వినియోగదారుల పోర్ట్‌ఫోలియోలో 2ఎక్స్ థండర్ బోల్టులు కలిగిన మొదటి డివైస్ ఇది. 4కే టచ్‌స్క్రీన్ డిస్‌ప్లే, 8వ జనరేషన్ ఇంటెల్ క్వాడ్ కోర్ యు-సిరీస్ ప్రాసెసర్స్ విత్ ఇంటిగ్రేటెడ్ గ్రాఫిక్స్, ట్విన్ థండర్ బోర్డ్ యూఎస్‌బీ టైప్-సి పోర్టు, డాల్బీ అట్మోస్ టెక్నాలజీ జెబీఎల్ స్పీకర్లు, ప్రధాన ఫీచర్లు దీనిలో వున్నాయి. ప్లాటినం కలర్, మెటల్‌బాడీ డిజైన్‌తో వస్తున్న ఈ ల్యాప్‌టాప్ విండోస్ -10 ఆపరేటింగ్ సిస్టమ్ ఆధారంగా పనిచేస్తుంది.

ఫింగర్‌ప్రింట్ సెన్సార్ ఫీచర్‌తో

చైనా మొబైల్స్ దిగ్గజం ఒప్పో తన లేటెస్ట్ ఫ్లాగ్‌షిప్ ఫోన్ వివో 'ఎక్స్20 ప్లస్ యూడీ ఫోన్‌ను మార్కెట్లో విడుదల చేసింది. ఈ ఫోన్ ప్రత్యేక ఆకర్షణ ఏంటంటే అన్ని స్మార్ట్‌ఫోన్లలో మాదిరి కాకుండా డిస్‌ప్లే కిందే ఫింగర్‌ప్రింట్ సెన్సార్ ఉంటుంది. దీంతో డిస్‌ప్లేపై చేతి వేలితో టచ్ చేస్తే చాలు, డివైస్ అన్‌లాక్ అవుతుంది. ఇన్ డిస్‌ప్లే ఫింగర్‌ప్రింట్ సెన్సార్‌తో వచ్చిన మొదటి స్మార్ట్‌ఫోన్ ఇదే కావడం విశేషం. 6.43 ఇంచ్ భారీ డిస్‌ప్లేతో పాటు వెనుక భాగంలో 12, 5 మెగాపిక్సల్ సామర్థ్యం ఉన్న రెండు కెమెరాలు ఉన్నాయి. అలాగే 3905 కెపాసిటీ ఉన్న భారీ బ్యాటరీతో ఫాస్ట్ ఛార్జింగ్ చేసుకోవచ్చు. చైనా మార్కెట్‌లో లభ్యమవుతున్న ఈఫోన్ ధరను 36,090గా నిర్ణయించింది.



స్పెషల్ ఫీచర్లు ...

6.43 ఇంచ్ ఫుల్ హెచ్‌డీ ప్లస్ సూపర్ అమోలెడ్ డిస్‌ప్లే,
2160 X1080 పిక్సల్స్ స్క్రీన్ రిసల్యూషన్,
ఆక్టాకోర్ స్నాప్‌డ్రాగన్ 660 ప్రాసెసర్,
4 జీబీ ర్యామ్, 128 జీబీ స్టోరేజ్, 256 జీబీ ఎక్స్‌పాండబుల్ స్టోరేజ్,
హైబ్రిడ్ డ్యుయల్ సిమ్,
ఆండ్రాయిడ్ 7.1 నూగట్,
12, 5 మెగాపిక్సల్ డ్యుయల్ బ్యాక్ కెమెరాలు,
12 మెగాపిక్సల్ సెల్ఫీ కెమెరా,
ఇన్ డిస్‌ప్లే ఫింగర్‌ప్రింట్ సెన్సార్,
4జీ వీవోఎల్‌టీఈ,
డ్యుయల్ బ్యాండ్ వైఫై, బ్లూటూత్ 5.0,
3905 ఎంఏహెచ్ బ్యాటరీ, ఫాస్ట్ చార్జింగ్.

వివో వీ5 ప్లస్



వివో వీ 5 ప్లస్ 5.5 ఇంచ్ ఫుల్ హెచ్ డి డిస్ ప్లేతో 1080 పిక్సల్ తో వచ్చింది. 2.5 కర్వ్డ్ గ్లాస్ తో పాటు కార్నింగ్ గొరిల్లా గ్లాస్ 5 అదనపు ఆకర్షణగా నిలవనుంది. 4జిబి ర్యామ్ తో వచ్చింది. ఇంటర్నల్ స్టోరేజి విషయానికొస్తే 64 జిబి ఆన్ బోర్డ్ స్టోరేజి ఉంటుంది. క్వాల్ కామ్ స్నాప్ డ్రాగన్ 625 ఆక్టాకోర్ చిప్ సెట్ ని ఇందులో పొందుపరిచారు.కెమెరా విషయానికొస్తే డ్యూయెల్ సెల్ఫీ కెమెరాతో ఫోన్ వచ్చింది. ఫ్రంట్ సైడ్ ఒకటి 8 ఎంపీ మరొకటి 20 ఎంపీ సెల్ఫీ కెమెరాలు ఉంటాయి. బ్యాక్ సైడ్ 16 మెగాపిక్సల్ రియర్ కెమెరా విత్ ఎల్ఈడీ ఫ్లాష్ ఉంటుంది. 4కె వీడియో రికార్డింగ్ చేయవచ్చు. ఈ ఫోన్ బ్యాటరీ విషయానికొస్తే 3,160 %పాూష్త్ర% బ్యాటరీ. ఇది వివో డ్యూయెల్ ఛార్జింగ్ ఇంజిన్ టెక్నాలజీ మీద పనిచేస్తుంది. దీని ద్వారా ఫోన్ ఫాస్ట్ గా ఛార్జింగ్ అయ్యే అవకాశం ఉంది.ఫింగర్‌ప్రింట్ సెన్సార్, 4జీ ఎల్‌టీఈ, వైఫై 802.11 ఏసీ డ్యుయల్ బ్యాండ్, బ్లూటూత్ 4.2,ఆండ్రాయిడ్ 6.0 మార్ష్‌మల్లో వంటివి అదనపు ఫీచర్లు. దీని అమ్మకాలు ఫిబ్రవరి 1 నుంచి ప్రారంభమవుతాయి.



విజేత పంజాబ్

- ఫైనల్‌లో హర్యానా హామర్స్‌పై 6-3తో ఘనవిజయం
- ప్రొ రెజ్లింగ్ లీగ్, సీజన్-3

న్యూఢిల్లీ : ప్రొ రెజ్లింగ్ లీగ్ మూడో సీజన్‌లో డిఫెండింగ్ చాంపియన్స్ పంజాబ్ రాయల్స్ జయకేతనం ఎగురవేసింది. గతేడాది ఫైనల్స్ ప్రత్యర్థినే ఈ సారి కూడా ఎదుర్కొన్న పంజాబ్.. హర్యానాను 6-3తో చిత్తు చేసింది. పూజా దండా 3-2తో హర్యానా టాప్ ప్లేయర్ హెలెన్‌పై గెలుపొంది జట్టు విజయంలో కీలక పాత్ర పోషించింది. పంజాబ్ తరఫున మౌసం ఖత్రి, జురాబి, గెనో పెట్రియాష్‌విలి, కౌంబా సెలెనే, అనస్తసిజాలు తమ తమ బౌట్లలో గెలుపొందారు.

తోక చుక్కలు మెరిశాయి. టీమ్ ఇండియా బౌలర్లు బంతితో సఫారీలకు దీటుగా నిలుస్తున్న సంగతి తెలిసిందే. అయితే వాండరర్స్ మైదానంలో టెయిలెండర్లు భువీ, షమిలు బ్యాట్‌తోనూ రాణించారు. అంతకు ముందు కోహ్లి, రహానెలు బ్యాట్ ఝుళిపించటంతో భారత్ రెండొందల పైచిలుకు పరుగులు సాధించింది. 241 పరుగుల లక్ష్యాన్ని దక్షిణాఫ్రికా ముందుంచింది. విపరీతమైన బౌన్స్‌తో బ్యాట్స్‌మెన్‌ను ఇబ్బంది పెడుతోన్న పిచ్‌పై నేడు భారత్ త్వరితగతిన వికెట్లు కూల్చితే విజయం తథ్యం.

విజయం ఊరిస్తోంది

మధ్యాహ్నం 1.30 నుంచి సోనిటెన్‌లో

224 పరుగుల ఆధిక్యంలో కోహ్లి సేన

- రెండో ఇన్నింగ్స్‌లో భారత్ 247 ఆలౌట్
- దక్షిణాఫ్రికా ప్రస్తుతం 17/1
- మూడో టెస్టు మూడో రోజు

నవతెలంగాణ-జోహానెస్‌బర్గ్

వాండరర్స్ టెస్టులో భారత్ విజయానికి తొమ్మిది వికెట్ల దూరంలో నిలిచింది. పిచ్ నుంచి అనూహ్యరీతిలో బౌన్స్ లభిస్తుండటంతో బ్యాట్స్‌మన్ బంతిని ఎదుర్కోవటమే కష్టంగా ఉన్నా.. కోహ్లి సేన రెండో ఇన్నింగ్స్‌లో అన్ని వికెట్లు కోల్పోయి 247 పరుగులు చేసింది. దక్షిణాఫ్రికాకు 241 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది.

సమిష్టిగా బ్యాటింగ్ : ఓవర్నైట్ స్కోరు 49/1తో మూడో రోజు ఆట ఆరంభించిన భారత్ నిలకడగా ఆడింది. కేఎల్ రాహుల్ (16), చటేశ్వర్ పుజారా (1)లు ఆరంభంలోనే వికెట్లు పారేసుకున్నారు. ఫిలాండర్ బంతికి స్లిప్స్‌లో డుప్లెసిస్‌కు క్యాచ్ ఇచ్చి రాహుల్ వెనుదిరుగగా.. ఐదు ఓవర్ల వ్యవధిలో పుజారా మోర్నీ మోర్కెల్ బౌలింగ్‌లో డుప్లెసిస్ చేతిలో క్యాచౌట్ అయ్యాడు. ఈ దశలో సారథి విరాట్ కోహ్లి, ఆఖరు టెస్టులో చోటు దక్కిన రహానె రాణించారు. అజింక్య రహానె (48, 68 బంతుల్లో 6 ఫోర్లు), విరాట్ కోహ్లి (41, 79 బంతుల్లో 6 ఫోర్లు) బాధ్యాయుత ఇన్నింగ్స్‌తో భారత శిబిరంలో ఆనందం నెలకొన్నది. టెయిలెండర్లు భువనేశ్వర్ కుమార్ (33, 76 బంతుల్లో 2 ఫోర్లు), మహమ్మద్ షమి (27, 28 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్స్‌లు) మెరిశారు. పాండ్య (4) పేలవ ప్రదర్శనతో నిరాశపరిచాడు. ఆఖర్లో ఇషాంత్ (7 నాటౌట్) ఓ బౌండరీ బాదడంతో భారత్ స్కోరు 247 అయింది. దక్షిణాఫ్రికా బౌలర్లలో ఫిలాండర్, రబాడా, మోర్నీ మోర్కెల్ తలా మూడు వికెట్లు పడగొట్టారు. ఎంగిడికి ఒక వికెట్ దక్కింది.

లక్ష్య ఛేదనలో సఫారీలను షమి ఆదిలోనే దెబ్బ తీశాడు. రెండో ఓవర్ చివరి బంతికే ఓపెనర్ ఏడెన్ మార్క్‌రం (4)ను ఔట్ చేశాడు. ఆట ముగిసే సమయానికి డీన్ ఎల్గార్ (11 బ్యాటింగ్), హషీమ్ ఆమ్లా (2 బ్యాటింగ్) క్రీజులో కొనసాగు తున్నారు. 17/1తో ఉన్న దక్షిణాఫ్రికాకు గెలవాలంటే మరో 224 పరుగులు అవసరం. కాగా భారత్ మిగిలిన తొమ్మిది వికెట్లు కూల్చితే విజయం సొంతమవుతుంది.

పిచ్ పరేషాన్ : ఫాస్ట్ ఆఫ్ స్పిన్, ఫాస్ట్ లెగ్ స్పిన్.. పేసర్ల బంతుల్ని చూశాక వ్యాఖ్యాతల మాటలివి. 8 మీటర్ల దూరంలో సంధించిన బంతే కాదు 6 మీటర్ల దూరంలో విసిరిన బంతి సైతం బౌన్సర్‌ను మించి బౌన్స్ అయ్యింది. సఫారీ పేసర్ల బౌన్సర్లతో భారత ఓపెనర్ మురళీ విజయ్ సహా మిగతా బ్యాట్స్‌మెన్ ఎన్నోసార్లు ఇబ్బంది పడ్డాడు. సఫారీ రెండో ఇన్నింగ్స్‌లో బుమ్రా సంధించిన షార్ట్ పిచ్ బంతి ఓపెనర్ మార్క్‌రం హెల్మెట్‌ను ఢీకొట్టింది. దీంతో పిచ్ ప్రమాదకరంగా తయారైందని ఆటను నిలిపివేశారు. ఇరు జట్ల కెప్టెన్లు రిఫరీతో మాట్లడిన తర్వాత ఆటగాళ్లు మైదానం వీడారు. అదే సమయానికి వరుణుడు సైతం పలకరించాడు. ఒకవేళ మ్యాచ్ రద్దు చేయాలనుకుంటే అది తొలి సెషన్లో చేయాల్సింది, సఫారీ బ్యాటింగ్‌కు వచ్చినప్పుడు కాదు అని భారత్ వాదనగా తెలుస్తోంది. ఎందుకంటే ఉదయం సెషన్‌లో బౌన్సర్ల కంటే బుమ్రా సంధించినది ప్రమాదకరమేమీ కాదు అనేది నిజం..



ధోని రికార్డు తిరగరాసిన కోహ్లి

దక్షిణాఫ్రికాతో మూడో టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో 41 పరుగులు చేసిన విరాట్ కోహ్లి.. టెస్టుల్లో అత్యధిక పరుగులు చేసిన భారత కెప్టెన్‌గా ధోని రికార్డును అధిగమించాడు. 3454 పరుగులను ధోని 60 టెస్టుల్లో చేయగా, కోహ్లి 35 టెస్టుల్లోనే 3456 పరుగులతో ఆ రికార్డును తిరగరాశాడు. జాబితాలో 47 టెస్టుల్లో 3449 పరుగులతో గవాస్కర్ మూడో స్థానంలో ఉన్నారు.

ఈ పిచ్‌కు నా రేటింగ్ 2/100. ఇది పిచ్చి పిచ్!. విజయ్‌కి బంతి తాకినప్పుడే మ్యాచ్‌ను నిలిపివేయాల్సింది. ఇది క్రికెట్ పిచ్ కాదు, ప్రమాదకర పిచ్. ఇలాంటి పిచ్‌పై క్రికెట్ ఆడలేం. గతంలో 1998 జమైకా టెస్టును ఇలాంటి పరిస్థితుల్లోనే నిలిపివేశారు'

-మైకల్ హోల్డింగ్, మాజీ వెస్టిండీస్ ఫాస్ట్ బౌలర్

ఇది మంచి పిచ్ కాదు. బ్యాట్స్‌మన్‌గా బౌన్స్ నిలకడగా ఉండాలని అనుకుంటాం. కానీ ఇక్కడి బౌన్స్ బ్యాట్స్‌మెన్ ఆడేందుకు వీలుగా లేదు. బుమ్రా సంధించిన బౌన్సర్‌తో పిచ్ స్వభావం ఒక్కసారిగా ఏమీ మారలేదు. ఈ పిచ్‌పై భారత్ ఆపసోపాలు పడుతూ ఆడింది. మ్యాచ్‌ను నిలిపివేయాల్సిన అవసరం లేదు'

- సునీల్ గవాస్కర్

భారత్ తొలి ఇన్నింగ్స్ : 187/10 (76.4 ఓవర్లలో)

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్ : 194/10 (65.5 ఓవర్లలో)

భారత్ రెండో ఇన్నింగ్స్ : మురళీ విజయ్ బ్యాటింగ్ (బి) రబాడా 25, పార్థీవ్ పటేల్ (సి) మార్క్‌రం (బి) ఫిలాండర్ 16, లోకేష్ రాహుల్ బ్యాటింగ్ (సి) డుప్లెసిస్ (బి) ఫిలాండర్ 16, చటేశ్వర్ పుజారా (సి) డుప్లెసిస్ (బి) మోర్నీ మోర్కెల్ 1, విరాట్ కోహ్లి (బి) రబాడా 41, అజింక్య రహానె (సి) డికాక్ (బి) మోర్నీ మోర్కెల్ 48, హార్దిక్ పాండ్య (సి,బి) రబాడా 4, భువనేశ్వర్ కుమార్ (సి) డికాక్ (బి) మోర్నీ మోర్కెల్ 33, మహమ్మద్ షమి (సి) ఏబీ డివిలియర్స్ (బి) ఎంగిడి 27, ఇషాంత్ శర్మ నాటౌట్ 7, జస్‌ప్రీత్ బుమ్రా (సి) రబాడా (బి) ఫిలాండర్ 0, ఎక్స్‌ట్రాలు 29, మొత్తం : (80.1 ఓవర్లలో 10 వికెట్లకు) 247.

వికెట్ల పతనం : 1-17, 2-51, 3-57, 4-100, 5-134, 6-148, 7-203, 8-238, 9-240, 10-247.

బౌలింగ్ : వెర్నన్ ఫిలాండర్ 21.1-5-61-3, కగిసో రబాడా 23-5-69-3, మోర్నీ మోర్కెల్ 21-6-47-3, లుంగిసాని ఎంగిడి 3-0-15-0, అందిలె ఫెహ్లుక్వాయో 3-0-15-0.

దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్ : ఏడెన్ మార్క్‌రం (సి) పార్థీవ్ పటేల్ (బి) మహమ్మద్ షమి 4, డీన్ ఎల్గార్ బ్యాటింగ్ 11, హషీమ్ ఆమ్లా బ్యాటింగ్ 2, ఎక్స్‌ట్రాలు 0, మొత్తం : (8..3 ఓవర్లలో ఒక వికెట్‌కు) 17.

వికెట్ పతనం : 1-5.

బౌలింగ్ : భువనేశ్వర్ కుమార్ 4-0-8-0, మహమ్మద్ షమి 4-1-7-1. జస్‌ప్రీత్ బుమ్రా 0.3-0-2-0.



పాక్‌తో పోరుకు సై

- క్వార్టర్స్‌లో బంగ్లాదేశ్‌పై భారత్ ఘన విజయం
- గిల్, అభిషేక్ అర్ధ సెంచరీలు
- అండర్-19 ప్రపంచకప్

క్వీన్స్‌టౌన్ : ప్రపంచకప్ వేటలో కుర్రాళ్లు మరో అడుగు ముందుకేశారు. బ్యాట్‌తో, బంతితో, ఫీల్డింగ్‌లో మెరిసిన యువ భారత్ సెమీఫైనల్లో ప్రవేశించింది. బంగ్లాదేశ్‌తో శుక్రవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్లో టీమ్ ఇండియా 131 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. జనవరి 30న జరిగే సెమీఫైనల్లో పొరుగు దేశం పాకిస్థాన్‌తో చావోరేవో తేల్చుకోనున్నది. తొలుత బ్యాటింగ్ చేసిన యువ భారత్ నిర్ణీత ఓవర్లలో 265 పరుగులు చేసింది. సుభ్‌మన్ గిల్ (86, 94 బంతుల్లో 9 ఫోర్లు), అభిషేక్ శర్మ (50, 49 బంతుల్లో 6 ఫోర్లు) అర్ధ సెంచరీలకు తోడు కెప్టెన్ పృథ్వీ షా (40, 54 బంతుల్లో 5 ఫోర్లు) రాణించాడు. టాప్ ఆర్డర్ మెరుపులతో 300 పైచిలుకు పరుగులు చేసేలా కనిపించిన యువ భారత్ ఆఖర్లో వెనక్కి తగ్గింది. ఇక ఛేదనలో బంగ్లాదేశ్‌ను కుర్ర బౌలర్లు ఏమాత్రం స్వేచ్ఛగా ఆడనీయలేదు. గాయం నుంచి కోలుకుని ప్రపంచకప్‌లో తొలిసారి బరిలోకి దిగిన పేసర్ ఇషాన్ పోరల్ (5-2-8-0) ఆరంభంలో అదరగొట్టాడు. శివం మవి (2/27), నగర్‌కోటి (3/18), అభిషేక్ శర్మ (2/11)లు బంగ్లాను చుట్టేశారు. ఓపెనర్ పినిక్ గోష్ (43) మినహా బంగ్లా తరఫున మరో ఆటగాడు రాణించలేదు. దీంతో ఆ జట్టు 134 పరుగులకే కుప్పకూలింది.

మాటల యుద్ధం! : కుర్రాళ్ల ఆటలోనూ స్లెడ్జింగ్ ప్రవేశించింది!. బంగ్లాతో క్వార్టర్‌ఫైనల్లో ఇది స్పష్టంగా కనిపించింది. తొలుత సుభ్‌మన్ గిల్, అభిషేక్ శర్మలు బ్యాటింగ్ చేస్తుండగా బంగ్లా వికెట్ కీపర్ సహా దగ్గరగా మోహరించిన ఫీల్డర్లు మాటల దాడికి దిగారు. ఇక బంగ్లా ఇన్నింగ్స్ సమయంలో బెంగాలీ తెలిసిన భారత ఆటగాళ్లు బంగ్లా బ్యాట్స్‌మెన్‌కు స్లెడ్జింగ్‌ను వెనక్కి ఇచ్చేశారు!. నిరుడు ఆసియా కప్‌లో బంగ్లా చేతిలో ఓడిన టీమ్ ఇండియా అప్పుడూ వారి చేతిల్లో స్లెడ్జింగ్‌కు గురైంది. సీనియర్ క్రికెట్‌లోనూ ఈ మధ్య బంగ్లాదేశ్ ఆటగాళ్లు భారత్‌తో పోరు అంటే మాటల యుద్ధానికి సిద్ధమైన సందర్భాలు తెలిసినవే!



సైనాదే పైచేయి

- క్వార్టర్స్‌లో సింధుపై సాధికారిక గెలుపు
- సెమీస్‌లో సైనా సహా సాత్విక్ జోడీ
- ఇండోనేషియా మాస్టర్స్ బ్యాడ్మింటన్

జకర్తా : అగ్ర షట్లర్ల ముఖాముఖి పోరులో అనుభవమే గెలిచింది!. బ్యాడ్మింటన్ అభిమానులను ఊరించిన సింధు, సైనా సమరంలో మాజీ వరల్డ్ నెం.1 సైనా నెహ్వాల్ సాధికారిక విజయం నమోదు చేసింది. 37 నిమిషాల ఉత్కంఠ క్వార్టర్స్‌లో సైనా నెహ్వాల్ 21-13, 21-19తో వరుస సెట్లలో గెలుపొందింది. గాయం నుంచి కోలుకున్న సైనా నెహ్వాల్ సహచర స్టార్ సింధుతో పోరులో అత్యుత్తమ ప్రదర్శన చేసింది. రియో ఒలింపిక్స్ తరువాత సైనా బెస్ట్ ప్రదర్శనల్లో ఇదొకటి!. నేడు జరిగే సెమీఫైనల్లో థాయ్‌లాండ్ క్రీడాకారిణి రచనోక్ ఇంటనాన్‌తో సైనా తలపడుతుంది. రచనాక్‌తో ముఖాముఖిలో 8-5తో ముందంజలో ఉన్న హైదరాబాదీ అమ్మాయి ఫైనల్స్‌పై కన్నేసి నేడు ఆడనున్నది.

37 నిమిషాల హోరాహోరీ సమరంలో సింధు, సైనా అద్భుత ప్రదర్శన చేశారు. కానీ విజయం సైనానే వరించింది. తొలి గేమ్ ఆరంభం నుంచే అదరగొట్టిన సైనా ఎక్కడా వెనక్కి తగ్గలేదు. వరుసగా మూడు పాయింట్లతో సైనా 3-0తో ముందంజ వేసింది. కానీ సింధు పుంజుకుని స్కోరు 4-4తో సమం చేసింది. విరామ సమయానికి 11-9తో ఆధిక్యం నిలుపుకున్న సైనా.. బ్రేక్ తర్వాత రెచ్చిపోయింది. 18-10తో దూసుకెళ్లిన సైనా తొలి గేమ్‌ను సొంతం చేసుకున్నది. సింధు మరో మూడు పాయింట్లు సాధించినా అప్పటికే సైనా పని పూర్తి చేసింది. అయితే రెండో గేమ్‌లో సింధు, సైనా ప్రతి పాయింట్ కోసం నువ్వా నేనా అన్నట్టు పోరాడారు. సుదీర్ఘ ర్యాలీలతో ఉత్కంఠ రేపారు. ఆరంభంలో 3-3తో ఇద్దరూ జోరుమీదున్నారు. కానీ 11-10తో సింధు విరామ సమయానికి పైచేయి సాధించింది. ద్వితీయార్ధంలోనూ ఇద్దరూ ఆకట్టుకున్నారు. దీంతో 14-14తో స్కోర్లు సమం అమ్యాయి. ఈ సమయంలో 15-14తో ముందుకెళ్లిన సైనా.. 17-14కు ఆధిక్యం మెరుగుపర్చుకున్నది. క్లాసికల్ గేమ్ కనబర్చిన సైనా 21-19తో రెండో గేమ్‌తో పాటు సెమీఫైనల్స్ బెర్త్ సొంతం చేసుకున్నది. అంతర్జాతీయ సర్క్యూట్‌లో సింధుపై సైనాకు ఇది రెండో విజయం కావటం విశేషం.

మెన్స్ డబుల్స్‌లో యువ ద్వయం సాయిసాత్విక్ రాజ్, చిరాగ్ శెట్టిలు సెమీస్‌కు చేరుకున్నారు. 23-21, 15-21, 21-19తో నాల్గో సీడ్ డెన్మార్క్ జంటపై గెలుపొందారు.



640 కోట్ల రూపాయలు. 578 మంది స్వదేశీ, విదేశీ ఆటగాళ్లు. ఎనిమిది ఫ్రాంచైజీలు.. వెరసి ఐపీఎల్ మెగా ఆటగాళ్ల వేలానికి రంగం సిద్ధమైంది. గెలుపు గుర్రాలపై కోట్లు మొత్తంలో కురిపించేందుకు ఫ్రాంచైజీలు సిద్ధంగా ఉన్నాయి. పదేండ్ల ఐపీఎల్ ప్రస్థానంలో ఆరంభ వేలం తరువాత అంతటి స్థాయిలో జరుగుతున్న ఆటగాళ్ల వేలం కావటంతో క్రికెట్ ప్రియుల్లో ఆసక్తి పెరిగిపోయింది. ఏ ఇద్దరు కలిసినా యువరాజ్‌కు ఎంత? గంభీర్ ఏ ఫ్రాంచైజీకి? స్టోక్స్, లిన్‌లు ఎన్ని కోట్లు కొల్లగొడతారనే చర్చే నడుస్తోంది!. సుమారు 150 మంది ఆటగాళ్ల కోసం నేడు, రేపు బెంగళూర్‌లో ఆటగాళ్ల వేలం సందడి చేయనున్నది. ఈ రెండ్రోజులు వన్ టూ త్రీ సోల్డ్!!

వన్ టూ త్రీ సోల్డ్!

- ఐపీఎల్ మెగా వేలానికి సర్వం సిద్ధం
- క్రికెటర్లపై కురవనున్న కాసుల వర్షం
- నేడు, రేపు ఆటగాళ్ల వేలం ప్రక్రియ
- స్టార్ స్పోర్ట్స్‌లో ప్రసారం

నవతెలంగాణ-బెంగళూర్

కాసుల లీగ్ మరోసారి కోట్ల వర్షం కురిపించేందుకు సిద్ధమైంది. 578 మంది క్రికెటర్లు పాల్గొంటున్న ఆటగాళ్ల వేలం ప్రక్రియ నేడు, రేపు బెంగళూర్‌లో జరుగనున్నది. తొలి సీజన్ తర్వాత అన్ని ఫ్రాంఛైజీలు జట్లను పునర్మించటంలో నిమగ్నమవటం ఇదే తొలిసారి. దీంతో ఐపీఎల్ 2018 వేలంపైనే అందరూ దృష్టి సారించారు. రిటెయిన్ విధానంలో అన్ని జట్లు కొందరు స్టార్స్‌ను అట్టిపెట్టుకున్నా.. నేడు స్వదేశీ, విదేశీ మేళవింపులోని గెలుపు గుర్రాల కోసం ఫ్రాంఛైజీలు పోటీ పడబోతున్నాయి. వేలం ప్రక్రియ స్టార్‌స్పోర్ట్స్, హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం అవుతుంది.



పాత వారి కోసం! : మెగా వేలం అయినా, అన్ని ఫ్రాంఛైజీలు పాత ఆటగాళ్ల కోసమే ప్రయత్నించనున్నాయి. కింగ్స్ ఎలెవన్ పంజాబ్, ఢిల్లీ డేర్‌డెవిల్స్‌లు పూర్తిగా కొత్త జట్టును తయారు చేయటంలో నిమగ్నం కాగా.. సక్సెస్‌ఫుల్ ఫ్రాంఛైజీలు పాత జట్టులోకి కనీసం 8-10 మంది క్రికెటర్లను తిరిగి తీసుకునేందుకు మొగ్గు చూపుతున్నాయి. వేలంలో ప్రతి జట్టు గరిష్టంగా రూ. 80 కోట్లు ఖర్చు చేయవచ్చు. అయితే, అట్టిపెట్టుకున్న ఆటగాళ్లకు వెచ్చించిన మొత్తాన్ని తీసివేయగా, మిగిలిన సొమ్ముతో వేలంలో ఆటగాళ్లను తీసుకోవాల్సి ఉంటుంది. దీని ప్రకారం పంజాబ్ (రూ.67.5 కోట్లు), చెన్నై, ముంబయి, ఢిల్లీ (రూ. 47 కోట్లు), రాజస్థాన్ (రూ.49 కోట్లు), హైదరాబాద్, కోల్‌కత (రూ.59 కోట్లు) తాజా వేలంలో గరిష్టంగా ఖర్చు చేయగలవు.

వేలం సాగుతుందిలా : రెండు రోజుల ప్రక్రియలో ఆటగాళ్లను భిన్న కేటగిరీలుగా విభజించారు. నేడు వేలం దిగ్గజాల జాబితాతో మొదలవుతుంది. దిగ్గజ జాబితాలోని 16 మందినీ రెండు గ్రూపులుగా విభజించారు. తొలి గ్రూపులో అశ్విన్, క్రిస్ గేల్, కీరన్ పొలార్డ్, మిచెల్ స్టార్క్, బెన్ స్టోక్స్‌లు ఉన్నారు. రెండో బృందంలో యువరాజ్ సింగ్, డ్వేన్ బ్రావో, షకిబ్ అల్ హసన్, గ్లెన్ మాక్స్‌వెల్, జో రూట్, కేన్ విలియమ్సన్‌లు ఉన్నారు. వీరి కనీస ధర రూ. 2 కోట్లు. దీని తర్వాత క్యాప్‌డ్, అన్‌క్యాప్‌డ్ ఆటగాళ్ల జాబితా వస్తోంది. బ్యాట్స్‌మెన్, ఆల్‌రౌండర్లు, వికెట్ కీపర్లు, ఫాస్ట్ బౌలర్లు, స్పిన్నర్లుగా విభాగాలుగా వేలం నిర్వహిస్తారు. తొలి రోజు వేలంలో అమ్ముడుపోని ఆటగాళ్ల జాబితాలోని ఆసక్తి గల క్రికెటర్లతో కూడిన జాబితాను ఫ్రాంఛైజీలు సమర్పించాల్సి ఉంటుంది. వాటి ఆధారంగా రెండో రోజు ఆఖరు రౌండ్ వేలం నిర్వహిస్తారు. ప్రతి జట్టులో కనీసం 18 మంది, గరిష్టంగా 25 మంది ఆటగాళ్లు ఉండవచ్చు. ఓవరాల్‌గా ఏ ఫ్రాంఛైజీ కూడా ఎనిమిది మందికి మించి విదేశీ ఆటగాళ్లను తీసుకునేందుకు వీల్లేదు. ఈసారి రిటెయిన్ విధానంలో రైట్ టూ మ్యాచ్ కార్డులు సైతం ప్రధాన పాత్ర పోషించనున్నాయి. పాత జట్టులోని ఆటగాళ్ల కోసం ఫ్రాంఛైజీలు ఆర్‌టీఎంలు వినిగించనున్నాయి.

ఎవరికీ ఎంతో? : ఎప్పట్లాగే ఈ సారి వేలంలోనూ బ్యాట్స్‌మెన్‌పైనే ఫ్రాంఛైజీల గురి అయినా,.. నాణ్యమైన ఆల్‌రౌండర్లు, స్ట్రయిక్ బౌలర్లు, మణికట్టు స్పిన్నర్లు, యువ సంచనాలు ఆశ్చర్యకర ధర దక్కించుకునే అవకాశం కనిపిస్తోంది. బెన్ స్టోక్స్, జో రూట్, విలియమ్సన్, క్రిస్ లిన్, బ్రావో, గేల్, మెక్‌కలమ్ వంటి విదేశీ ఆటగాళ్ల కోసం ఫ్రాంఛైజీలు పోటీ పడనున్నాయి. ప్రస్తుతం వేలంలో తీసుకున్న ఆటగాళ్ల కాంట్రాక్టు మూడేండ్లు కొనసాగుతుంది. దీంతో వెటరన్ స్టార్స్‌పై పెద్ద మొత్తం వెచ్చించకుండా, యువ సంచలనాలను జట్టులోకి తీసుకునేందుకు ఫ్రాంఛైజీలు మొగ్గు చూపే చాన్సుంది. చాలా ఫ్రాంఛైజీలు స్థానిక క్రికెటర్లకు ప్రాధాన్యం ఇవ్వటంతో పాటు ప్రధాన ఆటగాళ్లను తీసుకోవాలనే వ్యూహంతో కనిపిస్తున్నాయి. యువరాజ్ సింగ్, గౌతం గంభీర్ వంటి వారికి ఎప్పట్లాగే డిమాండ్ ఉండనుండగా.. మెగా వేలంలో దేశవాళీ యువ సంచలనాలు జాక్‌పాట్ కొట్టే అవకాశాలు మెండుగా ఉన్నాయి!.

సయ్యద్ ముస్తాక్ అలీ ఢిల్లీదే

ఫైనల్లో రాజస్థాన్‌పై విజయం

కోల్‌కత : రంజీ ట్రోఫీ చేజార్చుకున్నా.. సయ్యద్ ముస్తాక్ అలీని ఒడిసిపట్టేసింది ఢిల్లీ. కోల్‌కతలో శుక్రవారం రాజస్థాన్‌తో జరిగిన ఫైనల్లో ఢిల్లీ 41 పరుగుల తేడాతో గెలుపొంది పొట్టి ఫార్మాట్ చాంపియన్‌గా అవతరించింది. ఉన్ముక్త్ చంద్ (53, 49 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ సెంచరీకి తోడు గంభీర్ (27), శోరె (21)లు రాణించటంతో తొలుత బ్యాటింగ్ చేసిన ఢిల్లీ ఆరు వికెట్లకు 153 పరుగులు చేసింది. ఛేదనలో ఆదిత్య గర్వ్‌వాల్ (52, 36 బంతుల్లో 8 ఫోర్లు) ధనాధన్ అనిపించినా.. సహచర ఆటగాళ్ల సహకారం కొరవడింది. బౌలర్లు సంగ్వాన్ (2/14), ఖెర్జోలియా (2/24), పవన్ నేగీ (2/21) రాజస్థాన్‌ను కకావికలం చేశారు. దీంతో 19.1 ఓవర్లలో 112 పరుగులకే రాజస్థాన్ కుప్పకూలింది. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన ఢిల్లీ సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 ట్రోఫీని దక్కించుకున్నది.



ఫైనల్లో ఫెడరర్

- సెమీస్‌లో గాయంతో చంగ్ నిష్క్రమణ
- మహిళల డబుల్స్ విజేత బాబోస్ జంట
- మిక్స్‌డ్ డబుల్స్ ఫైనల్స్‌కు బోపన్న జోడీ

మెల్‌బోర్న్ : డిఫెండింగ్ చాంపియన్ రోజర్ ఫెడరర్ కెరీర్‌లో ఎనిమిదో సారి ఆస్ట్రేలియా ఓపెన్ ఫైనల్‌లోకి అడుగుపెట్టాడు. ఫెడరర్‌కు ఏ మాత్రం పోటీనివ్వలేకపోయిన దక్షిణ కొరియా యువ సంచలనం చంగ్.. 0-1తో వెనుకంజలో ఉండగా, గాయంతో రిటైర్ట్‌గా వెనుదిరిగాడు. దీంతో ఏమంత కష్టపడకుండానే స్విస్ దిగ్గజానికి ఫైనల్ బెర్త్ దక్కింది. మహిళల డబుల్స్ టైటిల్‌ను టిమే బాబోస్ (హంగేరి), క్రిస్టీనా ఎమ్లాడెనోవిక్ (ఫ్రాన్స్) గెల్చుకున్నారు. భారత ఆటగాడు బోపన్న జోడీ మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో ఫైనల్స్‌కు చేరుకున్నది. మహిళల డబుల్స్ విజేత బాబోస్‌తో జత కట్టిన బోపన్న.. ఓ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో మిక్స్‌డ్ డబుల్స్ కేటగిరీలో ఫైనల్‌కు చేరటం ఇది రెండో సారి. కెనడా అమ్మాయి గాబ్రియేల దబ్రోవ్‌స్కీ జతగా గతేడాది ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్ గెలిచాడు. 2010లో యుఎస్ ఓపెన్ పురుషుల డబుల్స్ విభాగంలో రన్నరప్‌గా నిలిచాడు. తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను పంచుకున్న సహచర క్రీడాకారిణి దబ్రోవ్‌స్కీతో బోపన్న ఆదివారం ఫైనల్స్‌లో తలపడనుండటం విశేషం.

చంగ్‌ను భవిష్యత్ స్టార్ అని కొనియాడిన ఫెడరర్ శుక్రవారం జరిగిన సెమీస్ మ్యాచులో 6-1, 5-2తో కుర్రాడిపై పూర్తి ఆధిపత్యం చలాయించాడు. 64 నిమిషాలు సాగిన మ్యాచ్‌లో తొమ్మిది ఏస్‌లు సంధించాడు. తొలి సెట్లో చంగ్‌కు కేవలం ఒకటే పాయింట్ కోల్పోయిన ఫెడరర్, రెండో సెట్లోనూ 4-1, 5-2తో పైచేయి సాధించాడు. కాళ్లకు బొబ్బలెక్కటంతో అసౌకర్యానికి గురైన చంగ్ ఆటను కొనసాగించలేక పోయాడు. వైద్యుల సలహా మేరకు రిటైర్ట్‌గా ప్రకటించాడు. కెరీర్ 20వ గ్రాండ్‌స్లామ్‌పై కన్నేసిన ఫెడరర్ ఆరో సీడ్ మారిన్ సిలిచ్ (క్రొయేషియా)తో ఆదివారం టైటిల్ సమరం చేయనున్నాడు.

మహిళల డబుల్స్ ఫైనల్స్‌లో ఐదో సీడ్ బాబోస్ జంట 6-4, 6-3తో అన్‌సీడెడ్ రష్యా జంట ఎలీనా వెస్నినా, ఎకటెరీనా మకరోవాలపై విజయం సాధించారు. బాబోస్‌కు ఇది తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్ కాగా, క్రిస్టీనా 2016 ఫ్రెంచ్ ఓపెన్ డబుల్స్ టైటిల్ నెగ్గింది. 'తొలుత కష్టంగా ఉన్నా, రెండు వారాలుగా మా స్నేహం బలపడింది. ఇవాళ్టి కంటే కఠినంగా జరిగిన మ్యాచుల్లో విజయం సాధించాం గనుకే టైటిల్ దక్కించుకోగలిగాం.' అని బాబోస్ తెలిపింది. 1-0తో శుభారంభం చేసినా.. తొలి సెట్లో ఐదో గేమ్‌లో బాబోస్ సర్వ్ కోల్పోవటంతో ఆ జంట 2-4తో వెనుకబడిన బడింది. ఆ సమయంలో క్రిస్టీనా చక్కటి విన్నర్ షాట్లతో 4-4తో పోటీలోకి రావటమే గాక ప్రత్యర్థికి మరో పాయింటు కోల్పోకుండా 6-4తో తొలి సెట్ గెలుపొందింది. రెండో సెట్‌ను 0-1తో ఆరంభించిన బాబోస్ జోడీ 3-1తో ఆధిక్యం సాధించినా, రష్యా యువతులు పుంజుకుని 3-3తో స్కోరు సమం చేశారు. హోరాహోరీగా సాగిన చివరి మూడు గేముల్లో బాబోస్ జంట ఆచితూచి ఆడి 6-3తో రెండో సెట్‌నూ మహిళల డబుల్స్ టైటిల్‌నూ గెల్చుకున్నది.



Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.

మానవి
నవతెలంగాణ
manavi@navatelangana.com
హైదరాబాద్
శనివారం 27-01-2018

దిగిరాక తప్పలేదు



ఫాతిమాకు ఓ కొడుకు, ఓ కూతురు. భర్త అనారోగ్యంతో చనిపోయాడు. ఇద్దరు పిల్లల్ని కష్టపడి పెంచింది. కూతురు రుక్సానాకు పద్నాలుగేండ్లు వచ్చాయి. ఎలాగైనా కూతురి పెండ్లి చేసి ఓ దారి చూపిస్తే ప్రశాంతంగా ఉండొచ్చనుకుంది. బంధువుల ద్వారా ఓ సంబంధం వచ్చింది. అబ్బాయి డ్రైవర్. స్థిరాస్తులు కూడా ఉన్నాయి. దాంతో పిల్ల హాయిగా బతుకుతుందని పెండ్లి చేసేసింది. కూతురి పెండ్లి జరిగిన రెండేండ్లకు కొడుకు పెండ్లయింది.

కొడుకూ, కోడలు సంతోషంగా ఉంటారు. ఇద్దరూ ఉద్యోగాలు చేసుకుంటున్నారు. ఓ బాబు కూడా పుట్టాడు. అయితే కూతురు జీవితం తలచుకుంటే ఫాతిమాకు నిద్రపట్టడం లేదు. పెండ్లి చేసి అత్తగారింటికి వెళ్ళిన దగ్గర నుంచి రుక్సానా కష్టాలు వర్ణనాతీతం. అల్లుడు నాలుగు రోజులు పనికి పోతే పది రోజులు ఇంట్లో పడుకుంటాడు. ఇంటి ఖర్చులకు డబ్బులు ఇవ్వడు. పదో తరగతి పూర్తి చేసిన రుక్సానా ఇంటి దగ్గర్లో ఉండే ఓ ప్రైవేట్ స్కూల్లో ఉద్యోగం చేస్తూ ఇల్లు గడిపేది. ఇంత చేసినా అత్తామామలు కోడలిని ఏదో ఒక విధంగా సాధిస్తుండేవారు.

అత్తింటివారు ఎన్ని కష్టాలు పెట్టినా తల్లితోగానీ, బంధువులతో గానీ అస్సలు చెప్పుకునేది కాదు. ఈ బాధలు భరించలేక అప్పుడప్పుడు భర్తకు ఎదురుతిరిగేది. దాంతో అతను విపరీతంగా కొట్టేవాడు. భర్త కొట్టినప్పుడల్లా పుట్టింటికి వచ్చేసేది. ఏదో చిన్న గొడవ అని తల్లితో చెప్పుకునేది. భార్యా భర్తల మధ్య ఇలాంటి సమస్యలు సహజమే అని తల్లి సర్ది చెప్పేది. ఇల్లు పట్టించుకోని భర్త. సాధించే అత్తమామలు. దానికి తోడు హైబీపీ వల్ల వరుస అబార్షన్లు. దాంతో చాలా బలహీనంగా తయారయింది. ఇలాంటి పరిస్థితుల్లోనే మళ్ళీ గర్భం దాల్చింది.

పిల్లలు కలగడం లేదని భర్త వేధింపులు. ఈ బిడ్డని ఎలాగైనా దక్కించుకోవాలనుకుంది. డాక్టర్ సలహా మేరకు కొన్ని జాగ్రత్తలు తీసుకుని, పుట్టింట్లో ఉండి విశ్రాంతి తీసుకుని మగబిడ్డకు జన్మనిచ్చింది. అయినా రుక్సానా కష్టాలు తీరలేదు. భర్త ఎక్కువ వడ్డీలకు అప్పులు చేసేవాడు. ఆ అప్పులు తీర్చడం కోసం ఉన్న స్థలాలను అమ్మేసేవాడు. చివరకు ఒకే ఒక స్థలం మిగిలింది. దుబాయ్ వెళ్ళి బాగా డబ్బు సంపాదిస్తానని చెప్పి మిగిలిన ఆ ఒక్క స్థలం కూడా అమ్ముకుని వెళ్ళాడు. అక్కడ ఏజెంట్ మోసం చేశాడు. ఉద్యోగం దొరకలేదు. దాంతో తిండి కూడా సరిగ్గా దొరకలేదు. మసీదులో పెట్టే భోజనం తిని కాలం గడిపాడు. తెలిసిన బంధువు ఏజెంట్‌ని పట్టుకొని గొడవచేస్తే అతనికి దుబాయ్‌లో ఉద్యోగం దొరికింది. అలా ఏదాదిన్నర అక్కడే ఉన్నాడు. అన్ని రోజులు అక్కడ ఉన్నా ఇంటికి పెద్దగా డబ్బు పంపించేవాడు కాదు. అతను పంపించినవి చేసిన అప్పులకు వడ్డీలు కట్టడానికి కూడా సరిపోయేవి కావు.



ఇల్లు గడవడం కష్టమైపోయింది. రుక్సానా అత్తమామల ఆరోగ్యం పూర్తిగా పాడైపోయింది. ఇలాంటి పరిస్థితుల్లో బాబుతో పాటు రుక్సానా హాయిగా పుట్టింట్లో ఉండొచ్చు. కానీ స్కూల్లో జాబ్ చేస్తూ అత్తమామలను పోషించింది. చివరకు దుబాయ్ నుంచి 'మా అమ్మకు సీరియస్‌గా ఉంది' అని చెప్పి భర్త ఇండియా వచ్చేశాడు.

ఇక్కడ ఉన్న ఆస్తులు పోయాయి. అయినా పనికి సరిగా వెళ్ళడు. భార్య అడుగుతుందని చివరకు ఇంటికి రావడం తగ్గించాడు. ఎక్కడెక్కడో ఉండేవాడు. ఇంటికి వచ్చినా ఎవరితోనో గంటల కొద్దీ ఫోన్లో మాట్లాడుతున్నాడు. భర్తకు వేరే ఆవిడతో సంబంధం ఉందేమో అని రుక్సానాకు అనుమానం వచ్చింది. కానీ బటయపడలేదు. చివరకు ఆమె అనుకున్నట్టే జరిగింది. అతను వేరే అమ్మాయిని పెండ్లి చేసుకున్నాడు. ఆమెకు ఓ పాప కూడా ఉంది. ఈ విషయం తెలిసిన తర్వాత రుక్సానా ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. అతనికి, అతని తల్లిదండ్రులకు ఇంత చేస్తే భర్త ఈ విధంగా మోసం చేయడం ఆమె భరించలేకపోయింది.

అతను మాత్రం 'మీ ఇద్దరినీ చూసుకుంటాను. నువ్వు లేకుండా నేను ఉండలేనంటూ' అంటూ రుక్సానాను బతిమలాడాడు. కానీ దానికి ఆమె అంగీకరించలేదు. పోలీస్ స్టేషన్లో కేసు పెట్టింది. మొదటి భార్యకు విడాకులు ఇవ్వకుండా రెండో పెండ్లి చేసుకోవడం నేరమని పోలీసులు బెదిరించారు. దాంతో రాజీ కుదుర్చుకొని రుక్సానాకు ఆరున్నర లక్షలు ఇవ్వడానికి ఒప్పుకున్నాడు. చివరకు పెద్దమనుషుల్లో కూర్చోబెట్టారు. అయితే విడాకులు మీద సంతకాలు చేయించుకుని మూడు లక్షలు చేతిలో పెట్టి మిగిలినవి తర్వాత ఇస్తామన్నారు.

> **ఇల్లు గడవడం కష్టమైపోయింది. రుక్సానా అత్తమామల ఆరోగ్యం పూర్తిగా పాడైపోయింది. ఇలాంటి పరిస్థితుల్లో బాబుతో పాటు రుక్సానా హాయిగా పుట్టింట్లో ఉండొచ్చు. కానీ స్కూల్లో జాబ్ చేస్తూ అత్తమామలను పోషించింది. చివరకు దుబాయ్ నుంచి 'మా అమ్మకు సీరియస్‌గా ఉంది' అని చెప్పి భర్త ఇండియా వచ్చేశాడు.**

సంతకాలు పెట్టిన తర్వాత ఇస్తారో లేదో తెలియదు. మోసం చేస్తే తన కొడుకు జీవితం ఏమౌతుందో అని సంతకాలు పెట్టిన కాగితాలను రుక్సాన చించిపడేసింది. తర్వాత ఏం చేయాలో తోచని స్థితిలో ఉన్న ఆమెకు బాబాయి ధైర్యం చెప్పి ఐద్వా లీగల్‌సెల్‌కు తీసుకొచ్చాడు. సభ్యులు ఆమె భర్తను రమ్మని లెటర్ పంపారు.

తర్వాతి వారం అతను ఓ పదిమందిని తీసుకుని లీగల్‌సెల్‌కు వచ్చి 'మేడమ్ నా భార్య మంచిది కాదు. ఆమె పెండ్లికి ముందే ఎవరినో ప్రేమించింది. నేనంటే అస్సలు ఇష్టం లేదు. లావుగా ఉన్నానని, స్లిమ్‌గా లేనని నన్ను దగ్గరకు కూడా రానిచ్చేది కాదు. పైగా పుట్టింటికి వెళ్ళి నెలలకొద్దీ ఉండేది. నన్ను అస్సలు పట్టించుకోదు. మా అమ్మా నాన్నలను అస్సలు చూసుకోదు. ఆమెకు వేరే ఎవరో ఉన్నారు. అందుకే రెండో పెండ్లి చేసుకున్నాను. మా దగ్గర డబ్బులు తీసుకుని విడాకులు ఇస్తున్నట్లు సంతకాలు కూడా పెట్టింది' అని ఓ కాగితం చూపించాడు. అది అతుకులు వేసి ఉంది. ఆమె చించేసిన కాగితాన్ని అతికించి జిరాక్స్ తీయించుకుని వచ్చారని దాన్ని చూస్తేనే అర్థమయింది.

'ఆమెకు నువ్వంటే ఇష్టం లేదని పెండ్లయిన కొత్తలోనే తెలిసిందన్నావు కదా? మరి ఇన్నేండ్లు ఎందుకు ఉండాలి. అప్పుడే ఆమెను వదిలించుకొని రెండో పెండ్లి చేసుకుంటే సరిపోయేది కదా? పైగా ఆమె నిన్ను దగ్గరకు కూడా రానీయదన్నావు. మరి ఐదు సార్లు అబార్షన్లు ఎలా అయ్యాయి? కొడుకు ఎలా పుట్టాడు? అనవసరంగా ఆమె గురించి అబద్ధాలు చెబితే ఊరుకోం' అన్నారు సభ్యులు.

దాంతో అతనితో పాటు వచ్చిన వారు పెద్ద పెద్దగా అరుస్తూ గొడవ చేశారు. ఇక వాళ్ళు చెప్పే మాట వినేటట్టు లేదని సభ్యులకు అర్థమయింది. తనకు అన్యాయం చేయడమే కాక, నిందలు వేసిన వాళ్ళను ఊరికే వదిలిపెట్టకూడదని నిర్ణయించుకున్న రుక్సానా 'నాకు డబ్బులు రాకపోయినా పర్వాలేదు. కష్టపడి పని చేసుకుని నా కొడుకును పోషించుకుంటాను. అతనికి మాత్రం శిక్ష పడాల్సిందే. వాళ్ళను వదిలపెట్టను' అని పోలీస్‌స్టేషన్లో కేసు పెట్టింది.

పోలీసులు ముందు సరిగా స్పందించలేదు. ఐద్వా వాళ్ళతో పాటు, బాబాయి, పిన్ని కూడా రుక్సానాకు తోడుగా నిలబడ్డారు. దాంతో పోలీసులు ఎఫ్ఐఆర్ బుక్ చేశారు. కేసు పెట్టి నాలుగు రోజులైనా పోలీసులు వాళ్ళను అరెస్టు చేయలేదు. దాంతో ఐద్వా వారు పోలీసులపై ఒత్తిడి పెంచారు. చివరకు రుక్సానా భర్తను, అతను పెండ్లి చేసుకున్న రెండో భార్యను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు.

కొన్ని రోజులు జైల్లో ఉండి బెయిల్‌పై బయటకు వచ్చారు. అప్పటి నుంచి ఇద్దరూ కోర్టు చుట్టూ తిరగాల్సి వచ్చింది. దాంతో అతను దారికి వచ్చాడు. రుక్సానాకు ఇవ్వాల్సిన డబ్బు ఇచ్చేస్తానని రాజీకి వచ్చాడు. ఆమెకు ఇవ్వాల్సిన డబ్బు, బంగారం ఇస్తేనే కేసు వాపస్ తీసుకుంటానని రుక్సానా గట్టిగా చెప్పింది. ఇక చేసేది లేక అమెకు ఇవ్వాల్సినవన్నీ ఇచ్చేసి కేసు నుంచి బయటపడ్డాడు.

ప్రస్తుతం రుక్సాన తన బాబాయి సహాయంతో నర్స్ ట్రైనింగ్ పూర్తి చేసి ఓ ఆస్పత్రిలో ఉద్యోగం చేస్తూ కొడుకుని చదివించుకుంటున్నది. పోరాడితేనే ఈ సమాజంలో మహిళలకు న్యాయం జరుగుతుందని రుక్సానా నిరూపించింది. తనలాంటి ఎందరో అమ్మాయిలకు ఆదర్శంగా నిలిచింది.

సలీమ

ఐద్వా అదాలత్
సెల్ : 9490098024

సేవకు గుర్తింపు

ప్రతి ఏడూలాగే 2018 సంవత్సరానికి గానూ కేంద్ర ప్రభుత్వం పద్మ అవార్డులను ప్రకటించింది. వైద్య, సేవా రంగాల్లో విశేష సేవలందించి పద్మ పురస్కారాలను అందుకున్న ముగ్గురు మహిళల పరిచయం.



కూలీ నుంచి సేవవైపు...

కలకత్తాకు చెందిన సుభాషిని ఒకప్పుడు ఇటుకలు తయారు చేసే కూలీ. రోగంతో ఉన్న భర్తకు సరైన వైద్యం అందక ఆయన 23 వయేట మరణించాడు. ఆమె అప్పుడే తన మనస్సులో తన భర్తలా మరెవ్వరికి ఈ పరిస్థితి రావొద్దనుకుంది. అప్పటికే నలుగురు చంటి పిల్లలు, అంతగా ఆస్తిపాస్తులు కూడా లేవు. కళ్ళముందు పెద్ద లక్ష్యం, కానీ గుండెలో అంతకు మించిన సంకల్ప బలం. మొదట ఇంటి దగ్గరున్న స్కూల్ లో ఆయాగా చేరింది. వచ్చిన సంపాదనతో ఇంటి ఖర్చులు వెల్లదీస్తూనే.. కొంత పొదుపు చేసింది. తర్వాత పిల్లలు కాస్త ఎదగడంతో సొంతంగా ఇటుకలను తయారు చేయడం ప్రారంభించింది. వ్యాపారం బాగా నడుస్తున్న క్రమంలో హాస్పిటల్ నిర్మాణం కోసం. దాదాపు అర ఎకరం స్థలం కొన్నది. ఇక హాస్పిటల్ నిర్మాణానికి విరాళాల కోసం బయలు దేరింది సుభాషిణి. చాలా మంది డబ్బును, కొంతమంది ఆసుపత్రి నిర్మాణానికి కావాల్సిన వస్తువులను, మరికొంత మంది స్వచ్ఛందంగా కూలి పనికి వచ్చారు. అతికష్టం మీద ఓ గది నిర్మాణమైంది. అక్కడికి దగ్గర్లో ఉండే ముగ్గురు డాక్టర్లు తమ సమయానికి అనుగుణంగా ఫ్రీగా వైద్యం చేయడానికి ముందుకొచ్చారు. ఈ విషయం గవర్నమెంట్ దష్టికి రావడంతో 1996 లో వెస్ట్ బెంగాల్ గవర్నర్ అక్కడ ఓ పర్మినెంట్ బిల్డింగ్ కు శంకుస్థాపన చేశారు. ఇప్పుడు ఆ ఆసుపత్రి.. అతి తక్కువ ధరకు అత్యాధునిక వైద్యాన్ని అందిస్తూ మంచి పేరును సంపాదించింది. మరో విషయం ఏంటంటే సుభాషిణి చిన్న కొడుకు అజయ్ అందులో డాక్టర్. నిరుపేద కుటుంబం నుంచి వచ్చిన ఓ సామాన్య కూలీ చేసిన సామాజిక సేవకు గాను.. ప్రభుత్వం పద్మశ్రీని ప్రకటించింది.



ఎంబీబీఎస్ చదవని డాక్టర్...

గొప్ప విజయాలు సాధించడానికి పెద్ద కుటుంబంలో పుట్టన క్కర్లేదు. గొప్ప నేపథ్యం కూడా అవసరం లేదు. ఆలోచన గొప్పగా ఉండి, సంకల్పం గట్టిదైతే చాలు. లక్ష్మికుట్టి అందుకు నిదర్శనం. తిరువనంతపురం జిల్లాలోని కల్లార్ అడవుల్లోని ఒక గిరిజన గ్రామంలో... ఓ చిన్న గుడిసెలో నివసిస్తుంది లక్ష్మి కుట్టి. ఆమె ఎంబీబీఎస్ చదవని డాక్టర్. పట్టాలు పొందని మేధావి. ఎటువంటి వ్యాధి అయినా, ఎలాంటి నలతనైనా క్షణాల్లో మాయం చేయగలదామె. లక్ష్మి కుట్టి ఇంటి చుట్టూ రకరకాల మొక్కలుంటాయి. వాటి ఆకులు, వేర్లతో దాదాపు ఐదు వందల రకాల వ్యాధులకి వైద్యం చేస్తుంది. ఇంతవరకూ ఆమె వైద్యం ఫెయిలయ్యింది లేదు. ఉండేది అడవిలో కావడంతో పాము కాటేసినా, విష పురుగు కరిచినా ఆమె దగ్గరకే పరిగెత్తుకు వస్తారు. క్షణాల్లో ఆ విషాన్ని తీసి పారేస్తుంది లక్ష్మి. ఆమె వైద్యం చూస్తే పెద్ద పెద్ద డాక్టర్లు కూడా ఆశ్చర్యపోవడం ఖాయం. లక్ష్మికి ఈ మెళకువలన్నీ ఆమె తల్లి ద్వారా తెలిశాయి. వాటిని మరింత మెరుగు చేసి వీలైనంత మందికి సేవ చేయడమే లక్ష్యంగా పెట్టుకుంది లక్ష్మి. మొదట లక్ష్మి వైద్యం అడవికే పరిమితమైపోయింది. కానీ కాలం గడిచేకొద్దీ విషయం మెల్లమెల్లగా అడవి చుట్టూ ఉన్న గ్రామాలకు పాకింది. దాంతో అక్కడి నుంచి కూడా వైద్యం కోసం లక్ష్మి దగ్గరకు వచ్చేవారు. వారి ద్వారా లక్ష్మి పేరు అందరికీ తెలిసిపోయింది. తరువాతి కాలంలో కేరళ మొత్తం లక్ష్మి పేరు జపించసాగింది. ఆమె గొప్పదనం తెలిసి కేరళ ప్రభుత్వం 'నాటు వైద్య రత్న' అవార్డునిచ్చి సత్కరించింది. కేరళ ఫోక్ లోర్ అకాడెమీ లక్ష్మిని గౌరవ అధ్యాపకురాలిగా నియమించుకుంది. ఆమె విజ్ఞానాన్ని మరికొందరికి అందించే ప్రయత్నం చేస్తోంది. "నేను సాధించింది ఏమీ లేదు, మా అమ్మ నాకు నేర్పింది, నేను నేర్చుకున్నదానితో పదిమందికి సేవ చేస్తున్నాను అంతే" అంటుంది. తరచూ ఏదో ఒక ప్రదేశానికి వెళ్లి వైద్య సేవలు అందించడమో, ప్రక తి గురించి ప్రచారం చేయడమో చేస్తూ ఎప్పుడూ బిజీబిజీగా ఉంటుంది లక్ష్మి. వైద్యం చేయడంతో పాటు ఆప్యాయత నిండిన మాటలతో ఆమె ఓదార్చే తీరు చూసి అందరూ ఆమెను ప్రేమగా అమ్మా అని పిలుస్తుంటారు. ఎంబీబీఎస్ చదవకపోయినా వైద్య రంగంలో ఆమె చేస్తున్న సేవే... పద్మశ్రీని తెచ్చిపెట్టింది.



వేల మందికి ప్రాణం పోసి...

ఆమె ఎన్నో వేల మందికి ప్రసవాలు చేసి తల్లీబిడ్డలకు ప్రాణాలు నిలిపింది. తల్లులకే తల్లిగా ప్రసిద్ధిచెందింది. కర్ణాటక మహామాతగా పేరుగాంచిన సూలగిత్తి నరసమ్మను పద్మశ్రీ పురస్కారం వరించింది. 97 ఏళ్ల నరసమ్మ స్వస్థలం తుమకూరు జిల్లా పావుగడ తాలుకాలోని క ష్ణాపురం గ్రామం. ఆమె 70 ఏళ్లుగా సుమారు 15 వేల మందికి పైగా గర్భిణులకు కాన్పులు చేసింది. ఒక్కరి నుంచి కూడా డబ్బు తీసుకోదు. చుట్టుపక్కల ఊళ్లలోని ప్రజలందరికీ ఆమె తలలో నాలుక. అర్ధరాత్రి అపరాత్రి అనేం లేదు. ఇంటికొచ్చి "అమ్మా.. నరసమ్మా! నొప్పులొస్తున్నాయి తల్లీ! నువ్వు రాకపోతే తల్లీబిడ్డా దక్కేలా లేరు" అని చెబితే చాలు. గుడ్డ సంచి చేతికి తగిలించుకుని బయల్దేరుతుందామె. అదేం మహత్యమో కానీ, ఆమె చెయ్యిపడితే చాలు. అప్పటివరకు నొప్పులతో అల్లాడిపోతున్న గర్భిణుల కళ్లల్లో ఆశలు చిగురిస్తాయి. ఇంతవరకు ఆమె చేతిలో ఒక్క బిడ్డకానీ, తల్లికానీ చనిపోలేదు. మంత్రసాని విద్యను వాళ్ల అమ్మమ్మ మరిగమ్మ దగ్గర నేర్చుకున్నది. అప్పట్లో ఆవిడకు ఎంతో పేరుండేది. ఆమె ఎక్కడికి వెళితే అక్కడికి వెళ్లేదాన్ని. కాన్పులు చేయడంలో ఆమె నేర్పరితనం, గుండె ధైర్యం నరసమ్మను విస్తుగొలిపేవి. అమ్మమ్మ చేతి నైపుణ్యాన్ని చూసి కొన్ని రహస్యాలు నేర్చుకున్నది. ఆమెకు పన్నెండేళ్లప్పుడే అంజినప్పతో పెళ్లయింది. వారికి పన్నెండు మంది పిల్లలు. తొలికాన్పు అనుకోకుండా చేసింది. ఊరికి కూలిపనికి వెళ్లినప్పుడు తోటి కూలీకి నొప్పులు వచ్చాయి. అమ్మమ్మ చేస్తుండగా చూసిన నైపుణ్యంతో ప్రసవం చేసింది. తల్లీబిడ్డా క్షేమంగా బయటపడ్డారప్పుడు. అప్పటినుంచి ఇప్పటివరకు వేలల్లో కాన్పులు చేసింది. నరసమ్మ ఒక్క కర్ణాటకలోనే కాదు. ఆంధ్రప్రదేశ్‌లోనూ పదుల సంఖ్యలో కాన్పులు చేసింది. అప్పటికే ఆమెకు కేంద్రప్రభుత్వం జీవన సాఫల్య పురస్కారం అందజేసింది. ఇప్పుడు పద్మశ్రీని ఇచ్చి గౌరవించింది. ❄

సహజ నిగారింపు



మార్కెట్లో అందానికి సంబంధించి మనకు అనేక రకాల ఉత్పత్తులు ఉన్నాయి. అందులో రసాయనాలు చర్మాన్ని మరింత అధ్వాన్నంగా తయారుచేసి చర్మం పాడయేలా చేస్తాయి. సో, దీని కోసం హెూమ్ రెమెడీస్ వాడటం వలన ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. మీకు ఎలాంటి ఖర్చు లేకుండా సహజమైన స్కిన్‌టోన్ మీకు అందిస్తుంది. ఇక్కడ పాడైన మీ చర్మానికి చికిత్స చేసి మరియు తిరిగి మీరు ప్రకాశవంతమైన చర్మాన్ని సౌందర్యాన్ని పొందడానికి అవసరమైన కొన్ని హెూమ్ రెమిడీస్...

- పాలు సహజ బ్లీచింగ్ గా పనిచేస్తాయి. పాలు చర్మానికి అప్లయ్ చేయడం వలన మచ్చలు, ముడతలు, పిగ్మెంటేషన్లను వదిలించుకోవడానికి సహాయపడుతుంది. ఇది చర్మానికి సహజ గ్లోని అందిస్తుంది.
- చర్మం తిరిగి ప్రకాశవంతంగా చేయడానికి పెరుగు మంచిది. ఇది చర్మాన్ని ఆరోగ్యవంతంగా చేసి సహజమైన నిగారింపునిస్తుంది. చర్మాన్ని ప్రభావవంతంగా ఎక్స్‌ఫోలియాట్స్ చేసి మరియు సూర్యుడి నుండి వచ్చే టాన్ ని తొలగించడం ద్వారా మీ స్కిన్ టోన్ ని మెరుగుపరుస్తుంది.
- బేకింగ్ సోడా ఒక సహజ ఎక్స్‌ఫోలియేటింగ్ ఏజెంట్. ఇది చర్మానికి ఎలాంటి హానిని కలిగించదు. బేకింగ్ సోడా, రోజ్ వాటర్‌ని కలిపి పేస్ట్ చేయండి మరియు శుభ్రంగా చేసుకున్న మీ ముఖం మీద రాసుకొని కొన్ని నిముషాల తరువాత కడిగేయండి. ఇలాచేయడం వలన పొడిబారిన మీ చర్మం తిరిగి నిగారింపుని పొందుతుంది.
- కలబంద మంచి మాయిశ్చరైజర్‌గా పనిచేస్తుంది మరియు చర్మంపై నల్లటి ప్యాచ్‌లను తొలగిస్తుంది.
- ఆరెంజ్ వండర్ ఫ్రూట్. సహజంగా చర్మాన్ని కాంతివంతం చేస్తుంది. 2 టేబుల్ స్పూన్ల నారింజ రసంలో చిటికెడు పసుపుని కలిపి ముఖానికి రాసుకుంటే చాలు. మీ చర్మం టోన్ మారుతుంది. మృదువుగాచేస్తుంది.
- తేనె చర్మానికి సహజమైన నిగారింపుని తీసుకువస్తుంది. టాన్‌ను పోగొడుతుంది. డిస్కోలరేషన్ తగ్గిస్తుంది. తేనె, నిమ్మరసం, పసుపు కలిపి ముఖానికి రాసుకొని, 15 నిముషాల తర్వాత కడిగేయాలి. ❄

అసలు వయసు ఇదే



వివాహం.. మనిషి జీవితంలో ముఖ్యమైన ఘట్టం. అప్పటి వరకూ ఎలా గడిచినా.. పెండ్లయ్యాక మాత్రం జీవితంలో చాలా మార్పు వస్తుంది. బాధ్యతలు అలవడతాయి. అయితే చిన్న వయసులో పెండ్లి కారణంగా ఎన్నో సంసారాలు నాశనం అవుతున్నాయి. పెండ్లి కోసం అందమైన డ్రెస్సులు, ఖరీదైన నగలు కొనుగోలు చేసే కొందరు తల్లిదండ్రులు.. సరైన వయసులో పెండ్లి చేయడాన్ని మాత్రం పట్టించుకోవడం లేదు. మన దేశంలో ప్రస్తుతం బాల్య వివాహాలు తగ్గుముఖం పట్టినప్పటికీ.. ఇప్పటికీ అక్కడక్కడా చిన్నవయసులోనే పెండిండ్లు చేస్తుండటం చూస్తూనే ఉన్నాం. మరి ఏ వయసులో పెండ్లి చేసుకుంటే వివాహ బంధం బావుంటుందో తెలుసా?

పెండ్లికి సరైన వయసు 28-32 ఏండ్లు అని ఓ సర్వేలో వెల్లడైంది. అప్పటికీ జీవితంలో సెటిల్ అవుతారు. కష్టాలను ఎదుర్కొనే స్థైర్యం వస్తుంది. శారీరకంగా, మానసికంగా పరిణతి వస్తుంది. కాబట్టి పెండ్లికి ఇదే సరైన వయసు. 28 నుంచి 32 ఏళ్ల మధ్య మనువాడే వారిలో విడాకులు తీసుకునే వారి సంఖ్య తక్కువగా ఉన్నట్లు తేలింది. 32 ఏండ్లు దాటిన తర్వాత పెండిండ్లు చేసుకునేవారిలో డైవర్స్ కోరుకుంటున్న వారు ఎక్కువగా ఉన్నారని ఆ సర్వే ద్వారా తెలిసింది. ❄

ఇట్లచేద్దాం

కొన్ని రకాల కూరగాయలు, ఆకు కూరలు కోసిన తరువాత చేతులకు, కత్తికి వాసన అంటుకుంటుంది. ఎంత కడిగినా అది పోదు. ఆ వాసనలు పోవాలంటే నిమ్మరసంతోచేతులు, కత్తిని కడిగితే సరి. వాసన పోతుంది. కత్తి పదునుగా తయారవుతుంది.



రిపబ్లిక్ డే సందర్భంగా హైదరాబాద్ రాజ్‌భవన్‌లో నిర్వహించిన ఎట్‌హోమ్ కార్యక్రమంలో పాల్గొన్న రెండు తెలుగు రాష్ట్రాల నేతలు

అన్ని నియోజకవర్గాల్లో తెలుగు సభలు నిర్వహించాలి

- తెలుగు సాహిత్య మహోత్సవ ప్రారంభంలో జస్టిస్ ఎన్‌వి.రమణ



తెనాలి : రాష్ట్రంలోని 175 మంది ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో తెలుగుభాష అభివృద్ధిని కాంక్షిస్తూ కనీసం ఒక్క సభనైనా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వి.రమణ చెప్పారు. గుంటూరు జిల్లా తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో బొల్లిముంత శివరామకృష్ణ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన తెలుగు సాహిత్య మహోత్సవం శుక్రవారం ప్రారంభమైంది. తొలుత కళాక్షేత్రంలోని తెనాలి రామలింగ కవి విగ్రహానికి అతిథులు నివాళు లర్పించారు. అనంతరం జరిగిన సభకు స్థానిక ఎమ్మెల్యే ఆలపాటి రాజేంద్రప్రసాద్ అధ్యక్షత వహించారు. సభకు ముఖ్య అతిథిగా హాజరైన జస్టిస్ రమణ మాట్లాడుతూ.. భాషాభివృద్ధికి మౌలికంగా ఎదురవుతున్న అవరోధాలను పరిశోధించి, వాటిని నివృత్తి చేసుకోవటం ద్వారా తెలుగు భాషను బతికించుకోవాలన్నారు.

రాష్ట్రంలో వేగంగా అభివృద్ధి

- 80 శాతం ప్రజల్లో సంతోషం : గణతంత్ర వేడుకల్లో గవర్నర్ నరసింహన్

అమరావతి : విభజన కష్టాలను సమర్థంగా ఎదుర్కొంటున్న ఆంధ్రప్రదేశ్ వేగంగా అభివృద్ధి చెందుతోందని తెలుగు రాష్ట్రాల ఉమ్మడి గవర్నర్ ఇఎస్‌ఎల్ నరసింహన్ పేర్కొన్నారు. విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో శుక్రవారం జరిగిన 69వ గణతంత్ర దినోత్సవంలో ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించి వందనం చేశారు. పోలీస్ బలగాల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం గవర్నర్ మాట్లాడుతూ ఏపీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో 80 శాతం ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. అవినీతి నిర్మూలన కోసం ఏర్పాటు చేసిన 1100 హెల్ప్‌లైన్ నంబర్ ద్వారా సాధారణ ప్రజలూ ప్రభుత్వంతో అనుసంధానమై సమస్యలను పరిష్కరించుకుంటున్నారని తెలిపారు. 190 రోజుల్లో రికార్డు స్థాయిలో తాత్కాలిక అసెంబ్లీ, సచివాలయాన్ని పూర్తి చేశామన్నారు. పట్టిసీమ ద్వారా గత రెండేళ్లుగా ఖరీఫ్ పంటను కాపాడుతున్నట్లు వెల్లడించారు. 2019కి పోలవరం పూర్తి చేస్తామని తెలిపారు. బిసిలకు నష్ట కలగకుండా కాపులకు 5శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పారు. అదే విధంగా బోయ, వాల్మీకిలను ఎస్టీ జాబితాలో చేర్చాలని కేంద్రాన్ని కోరామన్నారు. రాష్ట్రంలో పేదరికానికి దిగువునున్న 1.42 లక్షల కుటుంబాలకు ఆహార భద్రత కల్పిస్తున్నామని వివరించారు. ఈ ఏడాది కొత్తగా విజయవాడలో ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేసిన చంద్రన్న విలేజ్ మాల్స్ రాష్ట్ర మంతటా విస్తరిస్తామన్నారు. ఈఏడాది మార్చికి రాష్ట్రాన్ని ఒడిఎఫ్‌గా చేస్తామన్నారు. ఇప్పటి వరకు రూ.7,621 కోట్లు వ్యయంతో 10,270 కిలోమీటర్ల రోడ్లు, 165 వంతెనలు నిర్మించినట్లు తెలిపారు. వ్యవసాయరంగంలో యాంత్రీకరణ ద్వారా ఉత్పాదకత పెంచుతున్నట్లు వివరించారు.

ఇండియన్ ఆర్మీకి ప్రథమ బహుమతి

కవాతులో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన ఇండియన్ ఆర్మీ గ్రూప్, సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాల విద్యార్థుల గ్రూప్‌లకు మొదటి విభాగంలో అవార్డులు వచ్చాయి. రెండో విభాగంలో కాకినాడ ఎపిఎస్పీ 16 బెటాలియన్, ఎన్‌సీసీ బాలికల గ్రూప్‌ల కమాండర్లు అవార్డులు అవార్డులు అందుకున్నారు. 13 శాఖలకు చెందిన శకటాల ప్రదర్శన ఆకట్టుకుంది. విద్యాశాఖకు చెందిన సర్వశిక్షా అభియాన్ శకటానికి ప్రథమ బహుమతి, గృహనిర్మాణ శాఖకు రెండో బహుమతి, అటవీశాఖ శకటానికి మూడో బహుమతి లభించాయి.

రిపబ్లిక్ వేడుకల్లో తెలుగుదేశం పార్టీ పాట..!

సాధికార మిత్ర శకటం వచ్చే సమయంలో తెలుగుదేశం పార్టీకి చెందిన కదలిరండి కదలిరండి తెలుగుదేశం కార్యకర్తలారా... త్యాగాలకు వెనుదీయని దేశ భక్తులారా అనే పాట వేయడం చర్చనీయాంశమైంది. ప్రభుత్వ అధికారిక కార్యక్రమంలో రాజకీయ పార్టీ పాటలతో శకటాలను ప్రదర్శించడంపై పలువురు విస్మయం వ్యక్తం చేశారు.

సీఎం గైర్హాజరు..!

దావోస్ పర్యటనకు వెళ్లిన ముఖ్యమంత్రి చంద్రబాబు గణతంత్ర వేడుకలకు గైర్హాజర య్యారు. అబుదాబీ నుంచి శుక్రవారం ఉదయమే విజయవాడ రావాల్సి ఉన్నా పొగ మంచు కారణంగా ప్రయాణం వాయిదా పడింది. సీఎం భార్య భువనేశ్వరితో పాటు మనవడు దేవాన్ష్ గణతంత్ర దినోత్సవానికి హాజర య్యారు. ఉప ముఖ్యమంత్రి కెఇ కృష్ణమూర్తి కూడా ఈ కార్యక్రమానికి హాజరుకాలేదు.



జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న గవర్నర్ నరసింహన్

ఆర్‌టిసి బస్సును ఢీకొన్న లారీ

- ఐదుగురు మృతి.. ఆరుగురికి తీవ్రగాయాలు

నల్లజర్ల(పశ్చిమగోదావరి) : ఆర్‌టిసి బస్సును లారీ ఢీకొట్టిన సంఘటనలో ఐదుగురు దుర్మరణం పాలయ్యారు. మరో ఆరుగురు మంది తీవ్ర గాయాలపాలయ్యారు. ఈ సంఘటన పశ్చిమగోదావరి జిల్లా నల్లజర్ల మండలం అనంతపల్లి సమీపంలో ఎర్రకాలువ వంతెన మలుపు వద్ద శుక్రవారం జరిగింది. మృతుల బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా తునిలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు, నిడదవోలు మసీదువీధిలో ఉంటున్న జ్యోతి తల్లి లక్ష్మితో కలిసి శుక్రవారం ఉదయం ద్వారకా తిరుమలలోని వెంకన్న ఆలయానికి వెళ్లేందుకు యర్నగూడేనికి వచ్చారు. అక్కడ ఏలూరు వెళ్లే ఆర్‌టిసి బస్సు ఎక్కారు. అప్పటికి బస్సులో 19 మంది ఉన్నారు. బస్సు నల్లజర్ల మండలం అనంతపల్లి ఎర్రకాలువ వంతెన వద్దకు వచ్చేసరికి రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న సిమెంటు లోడు లారీ ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కాపుశెట్టి నాగేశ్వరరావు భార్య జ్యోతి(37), కుమారుడు శివసాయి(13), కుమార్తె అఖిల సత్య సంతోషి(11), లక్ష్మి(50)తో పాటు, ఒడిశా రాష్ట్రం పూరికి చెందిన పల్ల సావిత్రి(60) అక్కడికక్కడే మృతిచెందారు. ఇదే బస్సులో ప్రయాణిస్తున్న సావిత్రి మనవరాలు రుహిత, మరపట్ల గంగారత్నం, పెద్దిరెడ్డి భవాని, కండక్టర్ ముప్పిడి పుష్పకుమారి, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వీరందరూ తాడేపల్లిగూడెం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కండక్టర్ పుష్పకుమారి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం ఏలూరు ఆశ్రం ఆసుపత్రికి తరలించారు. సిమెంటు లోడు లారీడ్రైవర్ నిద్రమత్తే ప్రమాదానికి కారణంగా భావిస్తున్నారు. సంఘటనా స్థలాన్ని ఆర్‌టిసి ఇడి ఎన్.వెంకటేశ్వరరావు, ఆర్ఎం ధనుంజయరావు సందర్శించారు. అనంతపల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రాజ్యాంగ పరిరక్షణకు మరో స్వాతంత్ర్య పోరాటం

- దళితులపై దాడులను నిరసిస్తూ లక్ష మందితో చలో గుంటూరు : సభలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి పి.మధు

తిరుపతి : రాజ్యాంగ పరిరక్షణ కోసం మరో స్వాతంత్ర్య పోరాటం చేయాల్సిన ఆవశ్యకత ఏర్పడిందని, మదనపల్లిలో నిర్వహించిన ఈ సభే ఆ పోరాటానికి నాంది అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు అన్నారు. భారతీయ అంబేద్కర్ సేన ఆధ్వర్యంలో రాజ్యాంగ పరిరక్షణ సభను చిత్తూరు జిల్లా మదనపల్లిలో శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సిపిఎం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శులు మధు, రామకృష్ణ, ప్రజా గాయకులు గద్దర్, తమిళనాడు మాజీ ఎంపి తిరుమావలవన్, రోహిత్ వేముల తల్లి రాధికలు హాజరయ్యారు.

స్వేచ్ఛా వాణిజ్యానికే మద్దతిస్తా..

దావోస్ సదస్సులో అమెరికా అధ్యక్షుడు ట్రంప్

దావోస్ : స్వేచ్ఛా వాణిజ్యానికే తాను సంపూర్ణ మద్దతిస్తానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఉద్ఘాటించారు. అయితే, న్యాయబద్ధమైన స్వేచ్ఛా వాణిజ్య విధానముంటేనే సమ్మతిస్తానని అన్నారు. దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో ఆయన మాట్లాడారు. ' అమెరికా పోటీ విధానాన్ని అనుసరిస్తోంది. ఉద్యోగాల్లో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు ప్రతిభావంతులనైన వలసదారులను ప్రోత్సహిస్తున్నాం. ఉగ్రసంస్థలపై ఉక్కుపాదం మోపాం. ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న అఫ్ఘనిస్తాన్ వంటి దేశాలను ఏమాత్రం ఉపేక్షించం. అమెరికన్ల ఆకాంక్షలకు అనుగుణంగా సుపరిపాలన అందిస్తున్నాం. అమెరికా యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు కృషి చేస్తున్నాం. ఉద్యోగాల్లో అమెరికన్లకు తొలి ప్రాధాన్యం కల్పించడంలో తప్పేమీ లేదు. ప్రతీ ఒక్కరూ తమ దేశాలను అభివృద్ధి చేసుకోవడానికి ప్రాధాన్యత ఇవ్వాలి. ఉద్యోగాల్లో అమెరికా యువతకు ప్రాధాన్యం ఇచ్చినంత మాత్రాన మేం ఒంటరి ఎలా అవుతాం. అమెరికా అభివృద్ధి చెందినట్టయితేనే ఇతర దేశాలూ అభివృద్ధి చెందుతాయి' అని అన్నారు. దావోస్‌లో జరిగిన సదస్సుకు హాజరయ్యేందుకు వచ్చిన ట్రంప్ పర్యటన పట్ల నిరసనలు వెల్లువెత్తిన సంగతి తెలిసిందే. ఉద్యోగాల్లో అమెరికన్లకు తొలి ప్రాధాన్యం కల్పించనున్నట్టు ట్రంప్ చేసిన ప్రకటన ఇతర దేశాల్లో ప్రకంపనలు సృష్టించింది. అమెరికా అధ్యక్షుడి ప్రకటనతో తమ ఉద్యోగావకాశాలు దెబ్బతింటాయని ఆందోళన చెందుతున్నాయి. ట్రంప్ పర్యటనను నిరసిస్తూ మహిళలు అర్ధ నగ్న ప్రదర్శనలు చేపట్టారు. ట్రంప్ వెనుదిరిగి వెళ్లాలని నిరసనకారులు ఆందోళన చేపట్టారు.

విషతుల్య గ్రాసం తిని.. పశువులు మృత్యువాత

నవతెలంగాణ-మహబూబాబాద్

కందగడ్డల తోటపై ఫొరెట్ గుళికలు పిచికారీ చేసిన గడ్డి తిని 12పశువులు మృత్యువాత పడ్డాయి. మరో 50 పశువులు తీవ్ర అస్వస్థతకు గురైన ఘటన మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం వీరారం శివారు దుబ్బతండాలో శుక్రవారం జరిగింది. జాయింట్ కలెక్టర్ కట్యూరి దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ గ్రామానికెళ్లి రైతులను పరామర్శించారు. గ్రామంలో ప్రత్యేక పశువైద్య శిబిరం ఏర్పాటు చేశారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... తండాకు చెందిన రైతు బానోత్ మంగు తన పొలంలో కందగడ్డ సాగు చేశాడు. పది రోజుల కిందట ఫొరెట్ గుళికలను చల్లాడు. అనంతరం గడ్డలను తవ్వి తీయడం కోసం ముందస్తుగా గడ్డిని కోసేశాడు. ఆ కోసేసిన ఆకులను, గడ్డిని తీసుకెళ్లి ఇంటి వద్ద పశువులకు వేశాడు. తండా రైతులంతా కూడా ఆ గడ్డిని తీసుకెళ్లి తమ పశువులకు వేసుకున్నారు. గడ్డి తిని 12 పశువులు మృతి చెందాయి. మరో 50 పశువులు ప్రాణాపాయ స్థితిలో ఉన్నాయి. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు వేడుకుంటున్నారు.

పలుచోట్ల జెండావిష్కరణ



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గణతంత్ర్యదినోత్సవం నేపథ్యంలో హైదరాబాద్‌లో పలుచోట్ల జెండావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా జాతీయోద్యమం, అనంతర పరిణామాలను గుర్తు చేసుకున్నారు. శుక్రవారం తెలుగుదేశం తెలంగాణ శాఖ కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎల్.రమణ జెండావిష్కరణ చేశారు. రాష్ట్ర మీడియా అకాడమీ కార్యాలయంలో చైర్మెన్ అల్లం నారాయణ, డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవవనరుల సంస్థ రాష్ట్ర కార్యాలయంలో డైరెక్టర్ జనరల్ బీపీ ఆచార్య, అటవీశాఖ రాష్ట్ర కార్యాలయం అరణ్యభవన్‌లో పీసీసీఎఫ్ పీకే ఝూ, ఆర్‌డబ్ల్యూఎస్ రాష్ట్ర కార్యాలయంలో ఇంజినీర్ ఇన్ చీఫ్ బి.సురేందర్‌రెడ్డి పతాకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు, ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు.

భారత సంతతి విద్యార్థికి మెన్సా ఐక్యూ పరీక్షలో అత్యధిక స్కోరు

లండన్: లండన్‌లో నిర్వహించిన మెన్సా ఐక్యూ పరీక్షలో భారత సంతతి 10 ఏండ్ల విద్యార్థి మెహ్లా గార్గ్ అత్యధిక స్కోరు (162)ను సాధించాడు. దీంతో ఆ విద్యార్థి ఐన్‌స్టీన్, స్టీఫెన్ హాకింగ్ వంటి మేధావుల ఐక్యూ (160)కంటే ఎక్కువ సాధించి మేధావినని నిరూపించాడు. ఈ దశాబ్దంలోనే అత్యధిక స్కోరు సాధించిన పిన్న వయస్కుడిగా నిలిచాడు. అతని సోదరుడు ధ్రువ్ గార్గ్ కూడా గతేడాది నిర్వహించిన టెస్టులో 162 స్కోరు సాధించాడని అతని తల్లి దివ్య గార్గ్ తెలిపారు. రూబిక్ కూబ్‌ను 100 నిముషాల్లోపే పరిష్కారించాడని మెహ్లా తెలిపారు. ఈ యేడాదిలో ఛానల్ 4 'చైల్డ్ జీనియస్ 2018 ' షో ను నిర్వహించనున్నారు. దీని కోసం వారు ఎంపిక చేసిన 100 మంది అభ్యర్థుల్లో మెహ్లా గార్గ్‌కు చోటు దక్కింది. ఇతడు దక్షిణ ఇంగ్లాండ్‌లోని బాయ్స్ గ్రామర్ స్కూల్‌లో చదువుతున్నాడు.

మేడారం జాతరకు భారీ భద్రత

- 15 వేల మంది పోలీసులతో బందోబస్తు
- ఆరు డ్రోన్ కెమెరాలు,300లకు పైగా సీసీ కెమెరాలతో పర్యవేక్షణ
- మేడారం మార్గ నిర్దేశనం కోసం ప్రత్యేక యాప్
- స్థానిక కంట్రోల్ రూమ్‌తో పాటు డీజీపీ హెడ్‌క్వార్టర్స్ కమాండ్ కంట్రోల్ ద్వారా ట్రాఫిక్, నియంత్రణ



నవతెలంగాణ, ప్రత్యేక ప్రతినిధి

మేడారం సమ్మక్క సారక్క జాతర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా 15వేల మంది పోలీసులతో భారీ బందో బస్తును ఏర్పాటు చేశారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞా నాన్ని ఉపయోగించి జాతర ముగిసేంత వరకు ట్రాఫిక్ నియంత్రణ, బందోబస్తు పర్యవేక్షణకు ఉన్నతాధికారులు రంగం సిద్ధం చేశారు. ఐదు రోజులపాటు సాగే మేడారం జాతరకు రాష్ట్రం నుంచేగాక ఏపీ, కర్నాటక, మహ రాష్ట్ర,ఒడిషా మొదలైన రాష్ట్రాల నుంచి లక్షల సంఖ్యలో జనం తరలివచ్చే అవకాశాలు న్నాయని అధికారులు అంచనా వేస్తున్నారు. మేడారం నుంచి దాదాపు పది కిలోమీటర్ల దూరం వరకూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకు ండా పటిష్టమైన భద్రతను కల్పించేలా చర్యలు తీసుకు న్నారు. ఏడు నుంచి 12 సెక్టార్లుగా విభజించి ఒక్కో సెక్టార్‌కు ఎస్పీ లేదా అదనపు ఎస్పీ స్థాయి అధికారిని ఇన్‌ఛార్జిగా నియమించారు. రీజియన్ ఐజీ వై.నాగిరెడ్డి స్వీయ పర్యవేక్షణతో పాటు రాష్ట్ర శాంతి భద్రతల విభాగం అదనపు డీజీ అంజనీకుమార్‌ను బందోబస్తుకు ఓవరాల్ ఇన్‌ఛార్జిగా డీజీపీ మహేందర్‌రెడ్డి నియమించారు. వరంగల్ కమిషనరేట్‌తో పాటు చుట్టుపక్కల జిల్లాల నుంచి సిబ్బందిని బందోబస్తుకు నియోగిస్తున్నారు. వేలాది వాహనాలలో ప్రజలు తరలివస్తున్న కారణంగా ఎక్కడ కూడా ట్రాఫిక్ జామ్ ఏర్పడకుండా చూడటానికి గాను 300కు పైగా సీసీ కెమెరాలను , మరి కొన్ని కీలక ప్రాంతాలలో దూర ప్రాంతాలను సైతం రోమింగ్ ద్వారా తన కెమెరాలో బంధించి ప్రసారం చేసే డ్రోన్ కెమె రాలను కూడా ఏర్పాటు చేశారు. అంతేగాక మేడారంకు వచ్చే సందర్శకుల సౌకర్యం కోసం ప్రత్యేక యాప్‌ను కూడా ఆవిష్కరించారు. ఈ యాప్ ద్వారా వివిధ మా ర్గాల్లో మేడారంకు చేరేవారు తమ వాహనా లను ఎక్కడ పార్కింగ్ చేయాలి, ఎక్కడి నుంచి తిరుగు ప్రయాణం కావాలి, ఎక్కడెక్కడ భోజన సౌకర్యాలు ఉన్నాయి, సమ్మక్క, సారక్కలను దర్శించుకోవడానికి గద్దె వరకు ఏ మార్గం ద్వారా ఎలా వెళ్లాలి, ఎక్కడ ఏ సమస్య ఏర్పడినా ఎవరిని కాంటాక్ట్ చేయాలి, దగ్గరలో ఏయే కంట్రోల్ రూమ్‌లు ఉన్నాయి, తదితర వివరాలను ఈ యాప్‌లో పోలీసు అధికారులు అందుబాటులో ఉంచారు.

సందర్శకులతో కిక్కిరిసిన మేడారం

నవతెలంగాణ-గోవిందరావుపేట

సందర్శకులతో మేడారం శుక్రవారం కిక్కిరిసిపోయింది. గణతంత్ర దినోత్సవ సెలవు కావడంతో సాధారణ పర్యాటకులతో పాటు వివిధ శాఖల ప్రభుత్వ ఉద్యోగులు కుటుంబసభ్యులతో సమ్మక్క సారలమ్మల దర్శనానికి భారీగా తరలివచ్చారు. దీంతో ప్రధాన గేటు నుంచి కాకుండా క్యూలైన్‌ల ద్వారా దర్శనానికి పోలీసులు అనుమతించారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే ఆరూరి రమేష్, పాలకుర్తి ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్‌రావు వీవీఐపీ లైన్‌లో సమ్మక్క సారలమ్మలను దర్శించుకున్నారు. ఈ నెల 24న లక్నవరం జలాలను జంపన్నవాగుకు విడుదల చేసినప్పటికీ నేటికీ మేడారం చేరుకోకపోవడంతో సందర్శకులు బ్యాటరీ ట్యాపుల కిందనే స్నానాలు చేశారు. సందర్శకులు నార్లాపురం, కొత్తూరు, కన్నెపల్లి, రెడ్డిగూడెం, మేడారం ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన తాత్కాలిక గుడారాల్లో సేదతీరారు. ఇప్పటివరకు పూర్తిస్థాయిలో సందర్శకులకు అవసరమైన సౌకర్యాలను ఏర్పర్చడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. పది రోజులుగా నార్లాపురం ఏరియాలోని చింతల్ ప్రాంతంలో సందర్శకులకు అవసరమైన నీటిని అందించలేకపోయారు. మినరల్ వాటర్ పేరుతో క్యాన్ రూ.50కు అమ్ముతున్న సందర్శకులు కొనుగోలు చేస్తున్నారు.

'ఫేస్‌బుక్' మ్యారేజెస్ ఫెయిల్


గుజరాత్ హై కోర్టు



గాంధీనగర్ : ఫేస్‌బుక్ సామాజిక మాధ్యమం ద్వారా నిశ్చయమైన వివాహాలు విఫలమవుతున్నాయిని గుజరాత్ హై కోర్టు అభిప్రాయపడింది. ఫేస్‌బుక్ ద్వారా పరిచయమైన వ్యక్తిని ఓ యువతి వివాహం చేసుకుంది. అనంతరం ఇరువురి మధ్య తలెత్తిన మనస్పర్థల కారణంగా భర్తపై గృహహింస చట్టం కింద కేసు పెట్టింది. గుజరాత్ హైకోర్టు ఈ కేసుపై విచారణ చేపట్టింది. తీర్పు వెల్లడించే సమయంలో జస్టిస్ జేబీ హర్దీవాలా పై వ్యాఖ్యలు చేశారు. ప్రాసిక్యూషన్ తెలిపిన వివరాల ప్రకారం...రాజ్‌కోట్‌కు చెందిన ఫ్యాన్సీ షా, నవ్సారీ ప్రాంతానికి చెందిన జైదీప్ షాకు 2011లో ఫేస్‌బుక్‌లో పరిచయం ఏర్పడింది. స్నేహితులుగా ఉన్న వారిద్దరు ప్రేమికులయ్యారు. కుటుంబ సభ్యులను ఒప్పించి 2015లో పెండ్లి చేసుకున్నారు. వివాహమైన రెండు నెలల్లోనే వారిద్దరి మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. ఇద్దరి మధ్య వచ్చిన మనస్పర్థలను పోగొట్టేందుకు బంధు, మిత్రులు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. దీంతో, భర్త జైదీప్‌పై, అతని కుటుంబ సభ్యులపై ఫ్యాన్సీ షా గృహహింస కేసు పెట్టింది. భార్య తనపై తప్పుడు కేసు పెట్టిందని, ఈకేసును రద్దు చేయాలని అభ్యర్థిస్తూ జైదీప్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

రాజ్యాంగాన్ని కాపాడుకుందాం..

టీ మాస్ చైర్మెన్ ప్రొఫెసర్ కంచ ఐలయ్య ఆందోళన



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాజ్యాంగానికి విఘాతం కలిగించేందుకు కొన్ని శక్తులు ప్రయత్నిస్తున్నాయని, అదే జరిగితే దేశం అల్లకల్లోలంగా మారే ప్రమాదం ఉందని టీ మాస్ చైర్మెన్ ప్రొఫెసర్ కంచ ఐలయ్య ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగ రక్షణ, అమలుపై దేశంలోని అన్ని విద్యాసంస్థల్లో చర్చ జరగాల్సిన అవసరం ఉందన్నారు. శుక్రవారం రిపబ్లిక్ డే సందర్భంగా హైదరాబాద్ ట్యాంక్‌బండ్ వద్ద గల డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం ముందు 'రాజ్యాంగాన్ని కాపాడుకుంటాం' అంటూ టీ మాస్ ఆధ్వర్యంలో ప్రమాణం చేశారు. అనంతరం కంచ ఐలయ్య విలేకరులతో మాట్లాడారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం అమల్లోకొచ్చి 69 ఏండ్లైంది. రాజ్యాంగంలో రిపబ్లికన్ ప్రజాస్వామ్యాన్ని, సోషలిస్టు సామ్యవాదాన్ని, లౌకికవాదాన్ని, విభిన్న లక్షణాలు కలిగిన దేశంలో ప్రజాస్వామిక వ్యవస్థను ఇప్పటి వరకు కాపాడుకుంటూ వస్తున్నాం. అయితే, దీనికి ప్రస్తుతం కేంద్ర స్థాయిలోనే ప్రమాదం ముంచుకొస్తున్నది. కేంద్ర మంత్రులు కూడా రాజ్యాంగానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్నారు. ఇది ఆందోళన కలిగించే అంశం. ఈ తరుణంలో దేశంలో ఉన్న అన్ని రాజకీయ పార్టీలు, అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు బాధ్యాతాయుతంగా రాజ్యాంగాన్ని కాపాడే ప్రయత్నం చేయాలని, అన్ని రాజకీయ పార్టీల నాయకులకు, అన్ని వర్గాల ప్రజలకు టీ మాస్ పిలుపునిచ్చింది. రాజ్యాంగం వల్లే పేదలు జీవిస్తున్నారు. దాన్ని కాపాడుకోవడం దేశ ప్రజలందరి బాధ్యత. అందువల్లే అంబేద్కర్ విగ్రహాల ముందు ప్రమాణం చేస్తున్నామన్నారు. టీ మాస్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు దాని పీఠిక ప్రియాంబుల్‌తో ప్రమాణ స్వీకారం చేయించాలని నిర్ణయించామని, ఇందులో భాగంగా 6,500 గ్రామాల్లో కమిటీలు వేశాం. 451 మండలాలు, 31 జిల్లాల్లో పెద్ద ఎత్తున రాష్ట్రవ్యాప్తంగా అంబేద్కర్ విగ్రహాల వద్ద ప్రజలతో ప్రమాణాలు చేయిస్తున్నాం' అని చెప్పారు. అనంతరం టీ మాస్ కన్వీనర్ జాన్‌వెస్లీ మాట్లాడుతూ రాజ్యాంగం అమల్లోకొచ్చి 69 ఏండ్లైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పీఠికను అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యాయన్నారు. లౌకవాదాన్ని పక్కనపెట్టి హిందూమత ఉన్మాద రాజకీయాన్ని కొనసాగిస్తున్నాయని దుయ్యబట్టారు. దేశంలో ఎక్కువ శాతం ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలకు విఘాతం కలిగిస్తూ సాంస్కృతికంగా, రాజకీయంగా, ఆర్థికంగా అణచివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగంలో పేర్కొన్న పీఠికను కాపాడుకోవడం కోసం దేశ ప్రజలు, అభ్యుదయ వాదులందరు ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైంన్నారు. కార్యక్రమంలో ఆర్. శ్రీరాం నాయక్ (టీ మాస్), శోభన్‌నాయక్ (టీఎస్ఎఫ్), మహ్మద్ అబ్బాస్ (అబ్బాస్) ఆశయ్య, జీ.నరేష్ (ఎంబీసీ), గోరెంకల నర్సింహ్మ, ఆర్.వెంకటేశ్ (ఎన్‌పీఆర్‌డీ), కట్ట నర్సింహ్మ (ప్రజానాట్య మండలి), ఏ.శ్రీరాములు (మత్స్య కార్మిక సంఘం), ఉడుత రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

జెండావిష్కరణ వేదికగా లొల్లి

- రచ్చకెక్కిన పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఉద్యోగోన్నతుల వివాదం
- ఇంజినీర్ ఇన్ చీఫ్‌ల మధ్య విభేదాలు
- సర్కారులో చర్చనీయాంశమైన వ్యవహారం



నవతెలంగాణ బ్యూరో -హైదరాబాద్

పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ శాఖల ఉన్నతాధికారుల మధ్య విభేదాలు భగ్గుమన్నాయి. శాఖాపరమైన ఉద్యోగోన్నతుల విషయం రచ్చకెక్కింది. ఇందుకు శుక్రవారం నాటి గణతంత్ర దినోత్సవం వేడుక వేదికైంది. ఇందుకు ఇటీవల పంచాయతీరాజ్ శాఖలో ఇచ్చిన ఉద్యోగోన్నతులే కారణమని సమాచారం. 2008 సంవత్సరానికి ముందు పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలు రెండు పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖగా ఉండేవి. ఆ తరువాత ఈ శాఖను రెండింటిగా అప్పటి ప్రభుత్వం విభజించింది. ఇటీవల పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖలో కొంత మందికి ఉద్యోగోన్నతులు వచ్చాయి. 2008కి పూర్వ సీనియార్టీని ఖరారుచేసి కేవలం పీఆర్ శాఖ ఇంజినీర్లకే ఆ ఉద్యోగోన్నతులు కల్పించారనే విమర్శలు వస్తున్నాయి. అయితే ఆ సంగతి ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్ ఇన్ చీఫ్‌కు చెప్పకుండా చేశారనే ఆరోపణలు ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ నుంచి వస్తున్నాయి. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్ ఇన్ చీఫ్ బి.సురేందర్‌రెడ్డి, పీఆర్ ఇంజినీర్ ఇన్ చీఫ్ ఎం.సత్యనారాయణరెడ్డిపై గణతంత్ర దినోత్సవం జెండావిష్కరణ సందర్భంగా విమర్శలు చేశారు. ఉద్యోగోన్నతుల విషయంలో వివక్ష చూపడం సరికాదని అంటున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్లవి కూడా చేయమంటే సత్యనారాయణరెడ్డి సహకరించడం లేదని సురేందర్‌రెడ్డి ఆరోపించారు.

సురేందర్‌రెడ్డి ఆరోపణలు అవాస్తవం:సత్యనారాయణరెడ్డి

ఉద్యోగోన్నతుల విషయమై సురేందర్‌రెడ్డి చేసిన ఆరోపణలు అవాస్తమని సత్యనారాయణరెడ్డి అన్నారు. ఈమేరకు ఆయన వివరణ ఇచ్చారు. ఈఈ, ఎస్ఈ, సీఈ, ఇంజినీర్ ఇన్ ఛీఫ్‌ల స్థాయిలో ఇప్పటికే సీనియార్టీ ఖరారు అయిందన్నారు. 18 ఏండ్లుగా పెండింగ్‌లో ఉన్న ఈ సమస్యను తాను పరిష్కరించినట్టు చెప్పారు. కేవలం జేఈ, డిఈఈల స్థాయిలో మాత్రమే పెండింగ్‌లో ఉందని, వారికి కూడా మరో నెల రోజుల్లో ఉద్యోగోన్నతుల వస్తాయని చెప్పారు. కోర్టు కేసుల మూలంగా ఆలస్యమవుతున్నదని అన్నారు. ఏపి ప్రభుత్వం, జీఏడీ తదితర శాఖల నుంచి అనుమతులు తీసుకుని ఉద్యోగోన్నతుల సమస్యను పరిష్కారం చేసే ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఇదిలావుండగా ఈ సంగతి ముఖ్యమంత్రి కేసీఆర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్ దృష్టికి వెళ్లినట్టు తెలిసింది. దీనిపై నివేదిక పంపాలని పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ ముఖ్యకార్యదర్శి వికాస్‌రాజ్‌ను చీఫ్ సెక్రెటరీ ఆదేశించినట్టు సమాచారం. ఆర్‌డబ్ల్యూఎస్‌కు ముఖ్యకార్యదర్శిగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శే వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే.

ఇది సరికాదు:సురేందర్‌రెడ్డి

జెండావిష్కరణ అనంతరం సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ" పంచాయితీరాజ్ ఇంజినీర్ ఇన్ చీఫ్ సత్యనారాయణరెడ్డి నుంచి ఆశించినంత సహకారం లభించడం లేదన్నారు. ఇంజినీర్ల సీనియార్టీని ఖరారు చేయడంలో పంచాయితీరాజ్ విభాగం ఇంకా మీనమేషాలు లెక్కపెడుతుందని విమర్శించారు. ఒక్కసారి సీనియార్టీ ఖరారైతే ప్రస్తుతం పూర్తిస్థాయి అదనపు బాధ్యతల్లో ఉన్న ఇంజినీర్లు రెగ్యులరైజ్ అవుతారని గుర్తుచేశారు. ఈ చిన్నపని కోసం తమ ఇంజనీర్లు సత్యనారాయణరెడ్డి చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారని, ఆయన దగ్గరి నుంచి ఇంకా సానుకూల స్పందన రాకపోవడం శోచనీయమన్నారు. 2008 ఏప్రిల్ 1 వరకు పంచాయితీరాజ్, విభాగాలు కలిసే ఉన్నాయని, అందుకే సీనియార్టీ ఖరారు చేసే బాధ్యతను పీఆర్ సత్యనారాయణరెడ్డికి ప్రభుత్వం అప్పగించిందని గుర్తుచేశారు. సీనియార్టీ ఖరారు విషయంలో నిర్లక్ష్యంపై చీఫ్ ఇంజినీర్ రాములునాయక్ కోర్టులో కేసు వేశారంటూ సాకు చూపిస్తున్నారంటూ కారణం చూపించారని ఆరోపించారు. దీంతో పీఆర్ ఇంజినీర్ల సీనియార్టీని మాత్రమే ఖరారుచేసి రెగ్యులరైజ్ చేశారని, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్లకు మొండిచేయి చూపించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ ఒకరిది, ఆనందం ఇంకొకరిది అన్నట్టుగా పరిస్థితి ఉందని, తాము కష్టపడి పనిచేస్తుంటే పీఆర్ విభాగంలోని ఉన్నత హోదా కలిగిన అధికారులు అప్పనంగా ప్రయోజనం పొందారని విమర్శించారు. గణతంత్ర దినోత్సవం రోజైన పీఆర్ ఇంజినీర్‌తో మాట్లాడదామనుకుంటే ఆయన అందుబాటులో లేరని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇక పంచాయితీరాజ్ విభాగంలోని మహిళా ఉద్యోగుల పిల్లల కోసం చైల్డ్ కేర్ సెంటర్‌ను కార్యాలయం ప్రాంగణంలోనే ఏర్పాటుచేయాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. సంవత్సరం క్రితం తీసుకున్న ఈ నిర్ణయం ఇంకా అమలుకాలేదన్నారు. పిల్లలకు అవసరమైన వసతిని పీఆర్ విభాగం ఇంకా కల్పించలేదని మహిళా ఉద్యోగులు చెప్పడంపై సురేందర్ రెడ్డి ఆశ్యర్యం వ్యక్తం చేశారు. ఎవరికి తీసిపోకుండా కష్టపడుతున్న మహిళా ఉద్యోగులు అడిగిన ఈ చిన్న పని కూడా చేయకపోవడం సిగ్గుచేటన్నారు. తన ఒక నెల జీతాన్ని చైల్డ్‌కేర్ సెంటర్‌కు విరాళంగా ఇస్తానని ప్రకటించారు. ఇంకా ఏమైనా కావాలంటే తనను అడగాలని మహిళా ఉద్యోగులను కోరారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఇంజినీర్లు రాములునాయక్, జగన్మోహన్‌రెడ్డి, విజయపాల్ రెడ్డి, విజయప్రకాశ్‌తోపాటు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.